
ఆంధ్రసచిత్రవార

పత్రిక





20-9-63





మహనీయుడు కట్టినా
మతిలేనివాడు కట్టినా
మంత్రాలు చదవకపోయినా
మంగళవాద్యాలు లేకపోయినా
మాంగల్యాన్ని అతిపవిత్రంగా
భావించడమే ప్రతి ఒక్క స్త్రీకి
పరమకర్తవ్యమని నిరూపించే
ప్రయోజనాత్మకమైన
సాంఘిక చిత్రం
ప్రసాద్ ఆర్టు పిక్చర్సు
పునర్జన్మ
నిర్మాత
ఎ.వి.సుబ్బారావు
స్క్రీన్‌ప్లే-దర్శకత్వం
కె.ప్రత్యగాత్మ

ఆయుధాలకొరకు ఆభరణాలను ఇవ్వండి









ముఖచిత్రం

6—9—63 తేదీ ఆంధ్ర సచిత్రవారపత్రిక యొక్క అట్టమీద బొమ్మ "రంగారావు" ప్రత్యేక చిత్రం చాలా బాగుంది. ఎన్నాళ్ళ నుండో ఎదురు చూచుచున్న ఎస్. వి. రంగారావు ఉన్నట్టుండి సాక్షాత్కరించటం ఆశ్చర్యమేమరి! మరి ఆ రంగా రావు బొమ్మనే ప్రతీవారం పత్రిక యందు ముఖచిత్రంగా వేసీకూడదు ? !

గుండుమళ్ళ వెంకటరామారావు (శ్రీకాకుళం)

కథలు

'మారుతి'గారు రచించిన "ఘరానా"లో ఒక చోట "పెళ్లి కొడుక్కు భోజనం విడిదికే వచ్చిందని" ఉంది. మన సంప్రదాయ ప్రకారం పెళ్లి కొడుక్కు భోజనం పంపరు. కాఫీ, టిఫిన్ మాత్రం పంపుతారు. ఈ చిన్నతప్పు దొర్లకుండా ఉంటే బాగుండేది. మాకు తెలిసినంతలో ఎక్కడా పెళ్లి కొడుక్కు భోజనం పంపుట జరుగలేదు. మా సందేహమును తీర్పగలరు. కథ మాత్రం చాల బాగుందంటే నమ్మండి.

ఎస్. మోహనరావు, కె. రామారావు (బుద్ధవరం)

మరువలేని మనిషి

నా అభిమాన నటుడు "గురుదత్" పరిచయము చదివి ఎనలేని సంతోషమును వెలగక్కాను. నిజంగా "గ్యాన్ ముఖర్జీ" అతనికి మరువలేని మనిషి యనే చెప్పాలి. కళ్ళకు కట్టినట్లు గురుదత్‌గారు రాసిన వ్యాసము చాల బాగుందండీ !

యం. యస్. రావ్ (పూలపర్తి)

నామరూపాలు

ఇన్ని నామరూపాలలోకి నాకు నచ్చినది అతి చక్కనిది ఎన్నో రోజులుగా ఎదురు చూసినది అక్కినేని నాగేశ్వరరావుది.

టి. కృష్ణబాబు (బెంగుళూరు)

*　　*　　*

అదేమిటండీ ! నాగేశ్వరరావు చిత్రానికి నామ రూపాలు లేకుండా చేశారు !

ఫణిరాజా (పార్వతి)

*　　*　　*

మీరు వారపత్రికలో ప్రకటిస్తున్న నామ రూపాలు శీర్షిక నన్ను చాలా ఆకర్షించింది. మొదటివారం సుప్రసిద్ధ సినీనటుడు శ్రీ యన్. టి. రామారావుతో ప్రారంభించి శతచిత్ర నటుడు శ్రీ ఎ. నాగేశ్వరరావుతో ముగించటం చాలా ఆనందంగా ఉంది. ఇటువంటి శీర్షికలే మన పత్రికలో ఇకముందు గూడా ప్రకటిస్తారని ఆశిస్తున్నాను.

జవ్వాది వెంకటరాజబాబు (విజయవాడ)

తెరమీద_తెరవెనుక

మీ (మా) ఆంధ్ర సచిత్ర వారపత్రికకు ముఖ్య ఆకర్షణీయ శీర్షికలలో "తెరమీద—తెరవెనుక" యొకటి. ఈ రెండు వారములలో

ఉత్తరాలు

(23—8—63) ప్రచురించిన ప్రసిద్ధ తెలుగు, తమిళ నటులు ఎస్. వి. రంగారావుగారి పరిచయముచే సంచికలకు శోభ కలిగిందని చెప్ప వచ్చు. పరిచయము చాలా బాగా వ్రాసినారు. కళామతల్లికి వీరు చేస్తున్న సేవ ప్రశంస నీయమని ఈ పరిచయ వాక్యాలు స్పష్ట పరచును.


ఎన్. విష్ణుమూర్తి (ఎర్లికల్లు)

సీరియల్ కథ

23—8—63 వారపత్రికలో ప్రచురించిన "నయనించిన మరణం" (నా అనుభవంలో కెల్లా పెద్ద పరిశోధన) కథలో "ఇండియన్" అనే మాటకు హైందవుడు అని అనువదించినారు. కాని ఆ కథ జరిగినది కెనడాదేశంలో కనుక అందులో ఇండియన్ అంటే రెడ్ ఇండియన్ అని భావించుకోవాలి. అంతేకాని అనువాదంలో రెడ్ ఇండియన్స్‌ను హైందవులుగ వ్రాయుట అసమంజసముగ నున్నది. "రెడ్ ఇండియన్స్" అని పిలువబడేవారు అమెరికాలోని మారు మూల ప్రాంతాల్లో ఉన్న ఒక తెగ ప్రజలే తప్ప హైందవులుగానీ, భారతీయులు గాని కారని గమనించ ప్రార్థన.

వెంకటేశ్వర శాస్త్రి (నాగార్జునసాగర్‌డామ్)

★








మధురమైన **కాఫీ...**

మైత్రి సమ్మేళనమైన కాఫీ ఉల్లాసప్రదమైనది

కాఫీకి మించి ప్రపంచములో వుల్లాసకరమైనది మరొకటిలేదు.
కాఫీ స్నేహాన్ని పెంపొందించి, ప్రాబల్యాన్ని చేకూర్చును



మీ మనస్సు ఎలా వున్నప్పటికీ కాఫీ తృప్తినిస్తుంది

మంచి కాఫీని తయారుచేయడం అతి తేలిక ఉచిత కరపత్రం కోసం మాకు వ్రాయండి. మీకు ఏ భాషలో కరపత్రం కావాలో కూడా వ్రాయండి

కాఫీ బోర్డు,
బెంగుళూరు.

FDS-CB-15 TE

ఆంధ్రసచిత్రవార పత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

*

శుక్రవారం: 20—9—63
శోభకృన్నామ సం॥ ఆశ్వయుజ మాసం॥ శుద్ధ తదియ
సంపుటము 56 సంచిక : 3

స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఒక సంవత్సరం చందా వివరాలు

ఇండియా : రూ. 13.00 ఇతర దేశాలు : ఓడమీద (Sea Mail) రు. 20.00. (విమానం ద్వార (Air Mail): బ్రిటన్, జర్మనీ, ఇతర యూరోప్, ఆఫ్రికా దేశాలు— రూ. 114.00. అమెరికా రూ. 176.50. ఆస్ట్రేలియా 135.00.)

*

విడిప్రతి : 25 న.పై.
సంవత్సర చందా : 13-0-0.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీధి, మద్రాసు-1



నటి జయంతి (ఫొటో: ప్రభాకర్)

మనలో మాట

ఈ వారం వనితాలోకంలో వంటకి సంబంధించిన వ్యాసం వేశాము. వచ్చే వారం కూడా వంట గురించిన వ్యాసం ప్రచురించ పోతున్నాము! ఏ వంటకానికి సంబంధించినదో వచ్చేవారమే మాద్దురుగాని.....

* * *

దీపావళి కథలపోటీ ప్రకటన చాలా వివరంగా ఉన్నప్పటికీ కొందరు సందేహాలు వెలిబుచ్చుతూ వ్రాస్తున్నారు. అవసరం అంతగా లేక పోయినప్పటికీ కొన్ని సమాధానాలు ఇవిగో :

○ కథలు ఆంధ్ర సచిత్ర వార పత్రికకు ప్రత్యేకంగా పంపాలి. ఇతర పత్రికలకు పంపినవి మాకు పంపరాదు.

○ ఒక రచయిత ఒక కథ మాత్రమే పంపాలి.

○ కథలతో స్వంత చిరునామా గల కార్డు జతపరచి అందినట్లు వ్రాయమని రచయితలు కొందరు కోరుతున్నారు కాని ఇది వీలుపడదు.

ఇంత కన్నా వింత సందేహాలకు జవాబులు ఇవ్వాలేము!


లోకంపోకడ



"మంత్రిని కాకపోవచ్చును నేను; కాని అంతకన్నా ఎక్కువవాణ్ణే. ఎందుకంటే నెహ్రూగారికి దన్ను నేనే కదా!"

పురుషుల శక్తి దేశానికి రక్షణ నిధి
మహిళల పొదుపు రక్షణ నిధికి పదును

విషయానుక్రమణిక


ఒకపాళ్ళ
నియంతృత్వం
పెంకె గుఱ్ఱం
అమెరికా
పాకిస్తాన్
సరి కొత్త పాత కథ
కామరాజ్
పథకం
కుకక తోక వంకర
సరిచెయ్యాలని....
అమెరికా
దక్షిణ
వియత్నాం
లాభనష్టాల
బేరీజు
లాభాలు
బంగారు నియంత్రణ
నష్టాలు

నేఫా పరాజయాలపై నివేదిక వెలువడటంతో, ప్రధానమంత్రి ప్రజల దృష్టిని మళ్ళించాలని చేసిన "అద్భుత చర్యలు" మరుగుపడిపోయాయి.

అధిక పన్ను విధింపువల్ల జీవన వ్యయంలోని పెరుగుదల, నిర్బంధపు పొదుపు పథకం, స్వర్ణ నియంత్రణం, అన్ని రంగాల్లోను అన్ని స్థాయిల్లోను పెరిగిపోతున్న అవినీతి చర్యలు, మెల్లిగా పరిపాలనా విధానంలోకి వ్యాపిస్తున్న పక్ష (పా) వాతంపట్ల ఇప్పటికే జనానికి బాగా అసంతృప్తి కలుగుతున్నది. దీనికితోడు పంజాబ్, ఉత్తరప్రదేశ్, బీహారు, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, కేరళ, గుజరాత్ రాష్ట్రాల్లో పదవులకోసం కాంగ్రెస్ వాళ్ళు తమలో తాము పోట్లాడుకుంటున్నారు. కాంగ్రెస్ పరిపాలనలోఉన్న అవ్యవస్థితిని కామరాజు ప్రతిపాదన ఎలా సాధించగలుగుతున్న దానికి సమాధానమేలేదు. ఉదాహరణకు మొన్నటి రాజీనామాలే తీసుకుందాం. కేంద్ర మంత్రివర్గం నుంచి ఆరుగురు తప్పుకున్నారు కదా! ఈ రాజీనామాలు అవినీతిని—రూపు మాపటం మాట దేము డెరుగు—అసలు ఏ విధంగా అరికట్ట గల్గుతాయిటా? వినియోగ దార్ల విశ్వాసాన్ని మళ్ళీ చూరగొనేటట్లుగా, ధరలను అదుపు చేసేందుకు శ్రీకృష్ణమాచారి చెయ్యి వేసితే స్వేచ్ఛన్నా ఉంటుందా? అన్నిటికన్న పెద్ద సమస్య కేంద్ర ప్రభుత్వమే.

మెంటు ఎక్స్ఛేంజీల ద్వారా ఏర్పాటు చేసుకోవాలి. అలాగే కేంద్ర గూఢచారి శాఖ (సెంట్రల్ ఇంటెలిజన్స బ్యూరో)ను రద్దు చేసి ఆ పని అఖిల భారత సాధూ సమాజ్‌కి అప్పగింత చేస్తే మరీ బాగుంటుంది. అప్పటికీ దేశంలో ఏమాత్రమన్నా సామర్థ్యం అనేది ఉంటే, ఆ శాఖకూడా, భారత్ సేవక్ సమాజ్‌కు దేశీయాంగ శాఖను అప్పగించటంతో తీరిపోతుంది.

ఆర్థిక, దేశీయాంగ శాఖలు 'సీనియర్' మంత్రులు ఎక్కి కూర్చునేందుకు ఏర్పడ్డ గద్దెలు కావు. ఒకానొక స్థాయిలో కొంతపని చేయటానికి సామర్థ్యం అవసరమవుతుంది. శాసనోల్లంఘనమే జీవిత ధ్యేయంగా పెట్టుకున్న ఓక్మారిక నాయకుడిని కనీసం కేంద్ర పాలిత ప్రాంతాల్లో కన్నా శాసనానుసరణం చూడమని బాధ్యతలు అప్పగించటం జరిగింది.

ఈ క్రింది రెండు విషయాలు, వ్యవహారాలు ఎలా ఉంటవో నిరూపించటానికి.

బహదూర్ శాస్త్రి కమ్యూనిస్టుల దౌర్జన్యాన్ని క్రోసిరాజని అచంచలగా నిలబడ్డారు, ఆ సమ్మె విషయం బొంబాయి ఆంతరంగిక విషయామని సరైన సమాధానం చెప్పారు. మరి శ్రీ నందాజీ అలాంటి పద్ధతి అనుసరిస్తారా అనేది ముఖ్యమైన ప్రశ్న.

చేసింది తాత్కాలికమే అనుకున్నా, సమాచార శాఖ నిర్వహణకు అధికారి నియమంలో జరిగిన నిర్ణయం చాలా పొరపాటైన పని. బహుశా ప్రధాన మంత్రి రెండు తప్పు లొక ఒప్పుగా మారుతాయని అనుకుంటూరు. ఎందుకంటున్నానంటే, ఛీఫ్ విప్‌ను పూర్తి హోదాగల కాబినెట్ మంత్రిగా నియమించటం, రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టించటమే అవుతుంది. బ్రిటన్‌లో ఛీఫ్ విప్‌కు ఉపమంత్రి హోదా మాత్రమే ప్రధానమంత్రి ఏదో సంసార పక్షంగా సర్దుకుపోయే విధంగా పరిపాలన నిర్వహించటం పెద్ద ఇబ్బందైపోతోంది. పదవిని విరమించిన న్యాయమూర్తులను హై కమీషనర్లుగనూ, గవర్నర్లుగానూ నియమించటంతో న్యాయ చట్టానికున్న స్వాతంత్ర్యాన్ని పాడు చేసేశారు. పదవీ విరమణ చేసిన ఆడిటర్ జనరల్‌ను కూడా వాషింగ్టన్‌లో నియమించారాయె!

పాలనలో పాటవాన్ని తగ్గించే కేంద్ర పద్ధతులు

లాలా గుల్జారీలాల్‌నందాతో కేంద్ర మంత్రివర్గం ఋణ గ్రస్తమై పోయినంత పని. కమ్యూనిస్టుల, వారి అనుయాయుల దృష్టిలో శ్రీ నందా 'అభ్యుదయవాది.' అభ్యుదయమనే పదానికి సాధూపరి (సమాజ్) పాలకమో, అంబరుచర్ఖా ప్రచారమో అర్థమైతే, ఆమాటలు, ఆ అర్థాన్ని కోల్పోయాయనో, ఆ మాట ఉపయోగించే వారికి సజావైన ఆలోచనలు లేవనో అనుకోవాల్సి వస్తుంది. శ్రీ లాలా గుల్జారీలాల్ నందా ప్రణాళికా సంఘంని 'గంద్రగోళం' చేసి పారేయటమే గాకుండా, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీల ద్వారా ఎన్నికైన మూడో తరగతి ఉద్యోగులను కేంద్రంలో నియమించటం ద్వారా సచివాలయంలో పాటవాన్ని తగ్గించేశారు.

ఆయనకు తన సిద్ధాంతంలో అంతనమ్మకంవుంటే ఆయన పోలీసు ప్రతినిధులను, పౌగుల, గూండాల ప్రతినిధులను ఆహ్వానించి (భారత పౌరుల ప్రవర్తనా 'స్మృతి'కి దారితీసే ఒప్పందానికిగాను) త్రైపక్ష సమావేశం ఏర్పాటు చేసుకోవాల్సిందే. అలాగే కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ రద్దుచేసి ఉద్యోగుల నియామకాలు ఎంప్లాయి

రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగులు తమ కోర్కెల పత్రాన్ని బ్యాంకుకు అందజేశారు. స్వయం పాలక వ్యవస్థ ఐన రిజర్వు బ్యాంకు ఈ తగాదా తీర్చేందుకు విచారణ సంఘాన్ని (ట్రిబ్యునల్) నియమించవలసిందని కోరింది. మామూలుగా ఈ పద్ధతిలో సంఘం తీర్పు ఇరు పక్షాలకు అసంతృప్తిని కలిగిస్తే ఏ పక్షమైనా సుప్రీం కోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు. చట్టంలోని ఈ సూత్రం రిజర్వు బ్యాంకుకు మాత్రమే అనుకూలంగా ఉందని అన్నారు. కాని, బ్యాంకు ఆయనతో అంగీకరించక పోవటంవల్ల శ్రీ నందా రిజర్వు బ్యాంకు ఉద్యోగుల నాయకునికి ఉత్తరం వ్రాస్తూ, ఈ తగాదా పరిష్కారం పడనివ్వక పోయింది. రిజర్వు బ్యాంకు గవర్నరేనని రాజీ పడటం ఆయనకు ఇష్టం లేదనీ వ్రాశారు దీనివల్ల రిజర్వు బ్యాంకు గవర్నరు శ్రీ హెచ్. వి. ఆర్. అయ్యంగారిపట్ల వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. తనతోటి ఆర్థిక మంత్రిని ఇరుకుల్లో పెట్టాలని కేంద్ర మంత్రి చేసే ఘనకార్యం ఇది! నందాజీకి చుక్కెదురు కావటంవల్ల అయ్యంగారు ప్రధానమంత్రితో ఫిర్యాదు చేయటం, ఆయన నందా వాదాన్ని కొట్టి పారెయ్యటం దరిమిలా జరిగిన విశేషాలు.

మొన్న బొంబాయిలో జరిగిన కార్మికుల సమ్మె రెండో సంఘటన అప్పటి దేశీయాంగమంత్రి శ్రీ లాల్

ఇవన్నీ ఎలా వున్నా, ముఖ్యమైన ప్రశ్న ముందుడనేవుంది. ఈ మూక ఉమ్మడి రాజీనామాలు ధరల అదుపుగాని, అవినీతి నిర్మూలనగాని సాధిస్తాయా?

కాని ఒక్క విషయంమాత్రం కాస్త మెరుగనిపిస్తోంది. ఇదివరకు కాంగ్రెస్‌లోని ప్రత్యర్థి వర్గంగా శ్రీయుతులు హరికృష్ణ మెహతాబ్, మహావీర్ త్యాగి, హనుమంతయ్య, ఇంకా కొద్దిమందిమాత్రం ఉండే వారు. ఇప్పుడు శ్రీయుతులు దేశాయ్, యస్. కే. పాటిల్‌ల రాకలో ఈ ఈ వర్గం మరి బలపడుతోంది, పరిపాలనలో చాలా సన్నిత పరిజ్ఞానం ఉన్నవాళ్లు కినుక చీటికిమాటికి ప్రధానమంత్రికి కాస్త చీకాకు కలిగించవచ్చు. అంటే కాంగ్రెస్‌లో ఉన్న ప్రజాస్వామ్యశక్తులు బలపడతాయన్నమాట.

డా. రామ మనోహర లోహియా ఈమధ్య
61 వ పేజీ చూడండి

నగరానికి క్రొత్త మేయరు ఎన్నిక

ప్రజావిశ్వాసమనేది, అసభ్యపు ప్రవర్తనలకు దారితీయక్కర్లేదు. మన అభిప్రాయాలను నిర్దుష్టంగా ప్రకటించుకోవటానికి, చేష్టలు కూడా ఉత్తమ సాంప్రదాయాలమీద ఆధారపడి ఉండాలి అంటూ భారత రిపబ్లిక్ అధ్యక్షులు డాక్టర్ రాధాకృష్ణగారు ఈమధ్యనే అన్నారు. ప్రజాస్వామ్యంలో, వయోజన ఓటింగ్ పద్ధతి అమలుకు వచ్చిన తర్వాత, ఈ పద్ధతి ఎంతవరకు ఆచరణ సాధ్యమో, ఏ విధంగా అమలు జరుగుతుందో అందరికీ తెలిసిందే! సామాన్య ఎన్నికల సందర్భంలో, జరుగుతూ వస్తున్న అక్రమ చర్యలు, క్రమశిక్షణ పాటించకపోవటం ఇంకా ఇతరములూ కూడా మామూలే అనే ధోరణిలో ప్రతి వ్యక్తి, సమాధానపడిపోతున్నాడు. కాని, రాష్ట్ర రాజధానిలో నగర పాలక సంఘానికి మేయరు ఎన్నికలో కూడా కౌన్సిలర్స్, సహనం, క్రమశిక్షణ పాటించకపోవటం శోచనీయమైన విషయమే! ఎంతో రసాభాస అయిన తర్వాతగాని మేయరు ఎన్నిక జరగలేదు. కాంగ్రెసు పార్టీలో చీలికలు తీవ్రతరమయి, రెండు వర్గాలు సమన్వయం సాధించలేక, ఇద్దరు అభ్యర్థులు కాంగ్రెసు పార్టీవారే బాహాటంగా పోటీకి నిలబడాలిసి వచ్చింది. పై అంతస్థునుంచి వస్తున్న భేదాభిప్రాయాలే, నగర రాజకీయాల్లో కూడా అలుముకు పోయినాయి. మేయరు ఎన్నికలో ఇలాంటి వాతావరణం రావటం, హైదరాబాదు పట్నానికి కొత్తే!

చివరకు శ్రీ బనార్సీలాల్ గుప్తాగారు మేయరుగా ఎన్నికైనారు. ఉత్సాహవంతుడైన యువకుడు. వర్తక వ్యాపార సంస్థలతో సన్నిహిత సంబంధాలున్నవాడు. నగర పాలన విషయంలో గత రెండేళ్ళనుంచి ఎక్కువ శ్రద్ధ చూపిస్తూ వస్తున్నారు. పట్నాన్ని అతి సుందరంగా రూపొందించాలని అందరూ అనుకుంటున్నదే. అయితే ఈ నూతన మేయరు అలాంటి కార్యక్రమాలతోపాటు శిథిలావస్థలోనున్న చార్‌మినార్ ప్రాంతం కూడా అభివృద్ధి చేయాలనే ఆసక్తి ప్రప్రథమంలో వెల్లడి చేశారు. మురికి వాడల నిర్మూలన విషయంలో బీదా బిక్కీ పునరావాసంలోనూ తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. విశాల హైదరాబాదు కార్పొరేషన్ నూతన భవనాల విషయంలో కూడా ప్రభుత్వం వారిని అభ్యర్థిస్తూ త్వరలోనే ఈ ప్రయత్నం కూడా సఫలీకృతమయ్యేటట్లు కృషి చేస్తామన్నారు. 'టవున్ హాల్' నిర్మాణానికి అంకురార్పణ జరిగిందని వెల్లడించారు. మేయరు ఎన్నికతో భేదాభిప్రాయాలు సమసిపోయి, అందరూ కూడా నగర పాలనా కార్యక్రమాల్లో శ్రద్ధ చూపిస్తూ, సహకార సమన్వయాలు సాధించగలరని ఆశించవచ్చు.

పదవీ విరమణ చేస్తున్న శ్రీమతి కుముదినీ దేవిగారు ఈ సందర్భంలో చేసిన హెచ్చరికలు కూడా గమనించతగ్గవే. అంటువ్యాధులు సోకనీయకుండా, నగరంలో తగు చర్యలు తీసుకున్నారు. కాని, దానికి సంబంధించిన పథకంయొక్క పూర్తి అమలు కాకమునుపే వారు పదవీ విరమణ చేయాలసి వచ్చింది. ఈ బాధ్యత నూతన మేయరుమీద పడింది. దీంతోపాటు, కల్తీ ఆహార పదార్థాలు రాను రాను ఎక్కువవుతున్నాయి. దీన్ని అరికట్టటానికి కూడా కొత్త మేయరు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని, సికింద్రాబాదునుంచి ఎన్నికయిన డిప్యూటీ మేయరు కొండలరెడ్డిగారు కూడా, నగరానికి కొత్త ఆకారం ఇవ్వగలరని, ఈ ఎన్నికల్లో చూపించిన ఉత్సాహం, ఆసక్తి, పట్టుదల, కార్యాచరణలో కూడా కనపరచగలరని ఆశ.

'అపరసీతారామరాజు'

ధైర్య సాహసాలతో, తరుణ ప్రాయంలోనే భారత జాతీయ స్వాతంత్ర్యోద్యమంలో, సర్వస్వం త్యాగం చెయ్యటానికి సిద్ధపడిన వీరాధి వీరుల్లో, శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు పేరు చిరస్థాయిగా నిలబడి పోతుంది. గాంధీజీ నాయకత్వాన సమర రంగంలో దూకుతూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సింహగర్జనకు, ప్రతిధ్వని పలికాడు. నిర్దాక్షిణ్యంగా పోలీసువారు పెట్టిన హింసకు మూడు నెలలు ఆసుపత్రిలోనే ఉండిపోవలసి వచ్చింది. అయిదారేళ్ళు జైళ్ళల్లోనే మగ్గిపోయాడు. ఆశావాది, గొప్ప వక్త, గొప్ప వ్యక్తీను. నిరుత్సాహం, భయం, ఆయన చెవిన పడరాని మాటలు. పార్లమెంటు సభ్యుడుగావున్నా, అఖిల భారత కాంగ్రెసుకు కార్యదర్శిగావున్నా, ఆంధ్రరాష్ట్రంలోనే ఆయన జీవితం పెనవేసుకు పోయింది. రాష్ట్ర రాజకీయాల్లో కీలక వ్యక్తి అని అన్నివర్గాలవారు గుర్తించారు. ఆయనలోవున్న ఉత్సాహానికీ, ఆశాభావానికి తగినంత ఆరోగ్యం సమకూర్చుకోలేక పోయారు. ఇది ఆయనకు భగవంతుడు చేసిన పెద్ద లోపం! కొన్ని సంవత్సరాల్నుంచి తీవ్రమైన రుగ్మతలతో, ఆయన శరీరం పూర్తిగా క్రుంగిపోయింది. ఆయన కార్య కలాపాలకు ఇదొక పెద్ద అవరోధంగా పరిణమించింది. నాలుగైదేళ్ళుబట్టీ ఆసుపత్రి జీవితమే, ఎక్కువైపోయిందనటంలో అతిశయోక్తికేమీ లేదు. అంత అనారోగ్యంగా ఉన్నప్పటికీ, ప్రత్యక్షంగా ఆయన ముందుకొచ్చి ఏ కార్యభారాన్ని కూడా స్వీకరించలేని పరిస్థితిలో ఉన్నప్పటికీ, ఆయన పేరు చెపితే చాలు, శత్రువర్గంయొక్క గుండెలు దడదడమంటూనే ఉండేవి. వారి సలహాలు అడుగడుగునా, మిత్రవర్గానికి అభ్యమవుతూనే ఉండేవి. అల్లూరి అస్తమయంతో పెద్ద అండ విరిగి నేలకు ఒరిగినట్లయింది.

ఉస్మానియా ఆసుపత్రిలో మామూలు ధోరణిలో వైద్య పరీక్ష చేయించుకోవటానికని చేరారు. ఉన్నట్లుండి తీవ్రమైన అస్వస్థత ఏర్పడింది. నిపుణులైన డాక్టర్లు ఆశవదులుకున్నారు. క్షణాల్లో వుంది ఆయన జీవితం అన్నారు. నువ స్పృహ లేదు. నలుగురూ వచ్చి చూశారు. జన్మతఃయోధి కనకనే మృత్యువుతో కూడా హోరాహోరి పోట్లాడి ఆ గండాన్ని దాటేవాడు డాక్టర్లే ఆశ్చర్యపడిపోయారు. వైద్య శాస్త్ర రీత్యా, మేము చెప్పేదేమీ లేదన్నారు. ఏదో మానవాతీతమైన శక్తి ఆయనలో ప్రవేశించింది. అంతే! అందరూ ఆనంద పడ్డారు. ఆఖరి క్షణాలు అమాంతం ముంచుకొచ్చాయి. జీవిత సమాప్తి అయిపోయింది. ఆత్మబంధువులు దగ్గరనే ఉన్నారు. హృదయ విదారకమైన దృశ్యం అందర్నీ కలవర పెట్టేసింది. చిరు



కొత్త మేయర్ శ్రీ బనార్సీలాల్ గుప్తా.

నవ్వులు చిందులాడుతూ, యువలోకాన్ని, ఉత్తేజపరిచే, నూతనోత్సాహంతో కళకళలాడిన ఆయన ముఖ వర్చస్సు, అందరి కళ్ళల్లోనూ మెసులుతూనే ఉంటుంది. అందుకనే ఆయన్ను 'అపర సీతారామ రాజు' అని జోహార్లర్పించారు.

ఔత్సాహిక నాటకసంఘాలు

ఇలాంటి సంఘాలు, జంట నగరాల్లో ఎన్నో ఉన్నాయి. సంగీత నాటక అకాడమీవారి లెక్కల ప్రకారం 120 దాకా ఉన్నాయని అంచనా. సంఖ్య ఇంత వున్నా, గట్టిగా పని చేస్తున్నవి నాలుగైదు సంస్థలకంటె ఎక్కువ లేవుట. కారణాలు ఏకరువు పెట్టటం మొదలు పెడితే, ఆర్థిక స్తోమత లేకపోవటం ప్రధానంగా కనిపించినా, ఇతర లోపాలు కూడా గమనించ తగ్గవే. నాటక ప్రదర్శనకు కావలసిన హంగులు లేకపోవటం, 'రిహార్సల్సు' వేసుకొనటానికి తగిన హాలు లేకపోవటం, యీ రెంటివలన ఎక్కువ నాటక బృందాలు, అనుకున్న ఆశయాలను సాధించలేక పోతున్నాయి. 'రవీంద్ర భారతి' వారు దీంట్లో ఓ లోపాన్ని సద్దుబాటు చేయటానికి పూనుకున్నారు. ఔత్సాహిక నాటక బృందాలవారికి, 'రిహార్సల్సు' కూగాను, పై హాలును ఆట్టే అద్దె తీసుకోకుండా ఇవ్వటానికి నిశ్చయించారు.

56 వ పేజీ చూడండి

అవీ - ఇవీ - అన్నీ

సెట్టుమీద "కలవారికోడలు"

"లతా! లతా! నువ్వు బ్రతికే ఉన్నావా. జీవించి ఉండే మమ్మల్ని మర్చిపోయినావా! నువ్వే సర్వస్వం అనుకున్నా నువ్వు రైలు ప్రమాదంలో మరణించినట్లు వచ్చినవార్త నా జీవితాన్నే తారుమారు చేసింది. ఇంతకాలం నిజం ఎందుకు దాచావ్? మౌనం ఎందుకు వహించావ్? వెంటనే ఇంటికి ఎందుకు తిరిగి రాలేకపోయావ్! మేమంతా పరాయివాళ్లమయిపోయామా నీకు. నన్ను నీవు మర్చిపోయినా, కనీసం మీ అన్నయ్య స్నేహితుడుగానైనా నీ కష్టసుఖాలు నాతో చెప్పవచ్చుగా?"

"............................"

"ఇంతకాలం మౌనం వహించిన దానివి, ఇప్పుడో మాత్రం జవాబు చెబుతా వనుకోవడం నా భ్రమ."



నటి సరస్వతి [ప్రభాకర్]

"డాక్టరుగారూ, మీరు పొరపాటు పడుతున్నారు. ప్రమాదంలో పాపం లత తీవ్రంగా గాయపడింది. నెల రోజులపాటు ఎటూ కదలలేదు. గాయాలు నయమైనవిగాని, మూగబోయిన గొంతు తిరిగి రాలేదు. మీరు పెద్ద డాక్టర్లని తెలిసి ఇక్కడకు తీసుకొచ్చా!"

"ఆఁ లత గొంతు పోయిందా! మధురగాయని కంఠం మూగబోయిందా? నన్ను క్షమించు లతా! విధి పగబట్టిన శత్రువులా మనల్ని వేరు చేసింది. ఆనంద్‌గా నీకు దూరమయినా, డాక్టరుగా దగ్గరయ్యాను. నీ తియ్యని కంఠం తిరిగి పలికిస్తాను."

"డాక్టరుగారూ ఇన్నాళ్లూ లతకు నా అనేవాళ్లు ఎవరూ లేరనుకున్నాను. మీరే అండగా ఉంటే లతకు ఇంకేం కావాలి. అమ్మా! ప్రభువు తప్పక నిన్ను కరుణిస్తాడు.

"లతా! ఎగ్జామినేషన్ రూమ్‌కి పద"

"మాటల్లోనే వచ్చింది. రా అమ్మా రాణీ! మా కోడలు."

"నమస్కారం"

"నమస్కారం"

"ఈమె మన అబ్బాయి స్నేహితుని చెల్లెలు—లత. పాపం రైలు ప్రమాదంలో దురదృష్టవశాత్తూ గొంతు మూగబోయింది. అబ్బాయి ఆపరేషన్ చేసి, గొంతు వచ్చేలా చేశాడు. మాట్లాడుతూ ఉండడమ్మా ఇప్పుడే వస్తాను."

"మీరే కాలేజిలో చదువుకున్నారండీ?"

"కాలేజీ చదువు లేదండీ. మామూలు చదువే మీరేం చదివేరండీ?"

"బి. ఏ. చదివాను. కాని ఏం ప్రయోజనం? ఆడవాళ్ల చదువు అడవి కాచిన వెన్నెల."

"అదేమిటి అలా అన్నారు?"

'అవును లతగారూ! మనం చదువుకునేటప్పుడు ఎన్నో మేడలు కట్టుకుంటాం. తియ్యని కలలు కంటాం. తీరా పెళ్ళి అయిన తర్వాత మన ఆశయాలకు బ్రేక్ పడుతుంది."

"ఇప్పుడు మీకేం లోటు. మీరొక గొప్ప డాక్టరు గారి భార్య."

"అలా అనుకునే పొరబడ్డాను. వారి దృష్టిలో భార్య అనే మాటకు అర్థం కష్టాలు భరించడమే."

"మీరేదో కష్టంలో ఉండి అలా అంటున్నారే కాని వారు దేవుడిలాంటివారు. అందరి బాధ తన బాధగా చేసుకుని ఎందరికో సేవ చేస్తున్నారు."

"అదే నా దురదృష్టం. కట్టుకున్న భార్య కన్నా రోగులకు విలువనిచ్చే భర్త దొరకడం ఎంత బాధగా ఉంటుందో మీరే చెప్పండి?"

"మీ కుటుంబ వ్యవహారాల్లో జోక్యం కలిగించుకుంటున్నానని మీరనుకోకపోతే నా దొక చిన్న సలహా."

"ఏమిటో చెప్పండి."

"భర్త ఆనందమే తన ఆనందమనుకునే భార్య ఎప్పుడూ సుఖపడుతుంది"

"ఇలాంటి పాతకాలపు నీతులు ఇంకా పట్టుకుని వేళ్లాడబట్టే మగవాళ్లిలా చెలాయిస్తున్నారు. పోనీయండి మా గోడవ లన్నిటితో మీకు చికాకు కలిగించినట్టున్నాను ఉండండి, కాఫీ తెస్తాను"

ఈ సన్నివేశం రఘురాం పిక్చర్స్‌వారి "కలవారి కోడలు" చిత్రంలోనిది. ఈ చిత్రంలో రామా

రావు, కృష్ణకుమారి, ప్రభాకరరెడ్డి, రమణా రెడ్డి, చలం, పద్మనాభం, శ్యామలరావు, గిరిజ సూర్యకాంతం, గీతాంజలి, హేమలత మొదలగు వారు నటిస్తున్నారు.

మాటలు: నార్ల చిరంజీవి, పాటలు: చిరంజీవి. సి. నారాయణరెడ్డి, కొసరాజు, సంగీతం: టి. చలపతిరావు, ఛాయ: యం. జి. సింగ్, కళ: బి. యన్. కృష్ణ, నృత్యం: వెంపటి సత్యం, కూర్పు: బి. గోపాలరావు, స్టూడియో: పినస్, ప్రొడక్షన్ మేనేజర్: కె. ఆనందమోహన్, నిర్మాత, దర్శకుడు: కె. హేమాంబరధరరావు, అసోసియేట్ ప్రొడ్యూసర్: లట్నూరి పూర్ణచంద్రరావు, సహాయ దర్శకులు: కె. గోపాలకృష్ణ అండ్ లక్ష్మీనారాయణ.

"నా గ దే వ త"

అలంకార్ చిత్ర (హైదరాబాద్) వారు సమర్పించు "నాగదేవత" చిత్రం సెప్టెంబరు 12వ తేదీని ఆంధ్రదేశం అంతటా విడుదలవుతుంది. ఈ చిత్రంలో శ్రీమతి అంజలీదేవి కథా నాయకిగా నటించింది. ఈ చిత్రంలో ట్రిక్ షాట్సు ఒక ప్రత్యేకత. పాములు వివిధ వాద్యాల్ని చక్కగా వాయించుతవి. ఆ వాద్యానికి అంజలీ నృత్యం చేస్తుంది. కథానాయకిని ఒక మర్రిచెట్టుకు విలన్ కట్టివేసి, కథానాయకుణ్ణి తీసుకుపోతుంటాడు. నిస్సహాయురాలైన కథానాయకి "నాగదేవత"ను ప్రార్థిస్తుంది. ఆ మర్రిచెట్టునున్న వూడలన్నీ పాములుగామారి విలన్‌ను వెంటాడి కథా నాయకుణ్ణి విడిపిస్తాయి. కథా నాయకిని కూడా పాములే త్రాళ్ళు విప్పి రక్షిస్తాయి. ఇటువంటివి ఎన్నో ఉన్నవి.

ఈ చిత్రానికి మాటలు: మహారథి, పాటలు: వీటూరి, సంగీతం: కోదండపాణి, ప్లేబాక్ సుశీల, జానకి, ఎల్. ఆర్. ఈశ్వరి, వసంత అండ్ సత్యారావు, నిర్మాత: సి. సాంబశివరావు.

"ర హ స్యం"

లలితా శివజ్యోతి ఫిలింస్‌వారు తెలుగు, తమిళ భాషలలో పూర్తి ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిస్తున్న జానపదచిత్రం "రహస్యం" ఆగస్టు 23 వ తేదీని వాహినీ స్టూడియోలో ప్రారంభించబడింది బాక్సాఫీసు రికార్డులన్నిటినీ అధిగమించి క్రొత్త చరిత్రను సృష్టించగలిగిన "లవకుశ"ను నిర్మించిన శ్రీ శంకరరెడ్డి ఎం. ఎ. బి. ఎల్; దీని నిర్మాత.

ఈ చిత్రంలో దక్షిణాదినున్న అగ్రశ్రేణికి చెందిన సాంకేతికవర్గం, నటీ నటులు అంతా ఇందులో ఉంటారు.


లలితా పూజతో ఈ చిత్ర ప్రారంభం జరిగింది. నిర్మాత శ్రీ శంకరరెడ్డి సాంకేతిక వర్గానికి, అతిథులకు పూల మాలలువేసి గౌరవించారు.

ఘంటసాల, మాధవపెద్ది ఒక్కొక్క శ్లోకం చదువగా వాహినీ ఛీఫ సౌండ్ ఇంజనీర్ శ్రీ వి. శివరాం రికార్డు చేశారు.

ఫిలిం ఫైనాన్సర్ శ్రీ జబక్, శ్రీ బి. ఎన్. కొండారెడ్డి, శ్రీ గణపతి (గీతా ఫిలింస్), శ్రీ టి. వి. ఎస్ శర్మ (ఆర్టు డైరెక్టర్), ఆర్ సుబ్రహ్మణ్యం మొదలగు ప్రముఖులంతా ఈ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. 55వ పేజీ చూడండి



"హో కా న్ థీ" లో సా ధ నా, మ నో జ్.



ల క్షా ధి కా రి లో ఒ క దృ శ్యం

నా డైరీలో ఒక పేజీ!



ముప్పాళ రంగనాయకమ్మ

జరిగిన కథ

భర్త రచన రాయమంటాడు తనకు వస్తువు లభ్యం కాదు పైగా సంసార తాపత్రయం కాని గోపాలం అనే కథా నాయకుడు సరోజ అనే కథా నాయిక లభ్యమయ్యారు ఐతే రచన ఎలా [illegible]

(గత సంచిక తరువాయి)

పిల్లలిద్దరూ ఆటలో పడగానే ఉత్తరాలు చదవటం ప్రారంభించాను అభిమానుల ఉత్తరాలు చదువుతోంటే కళ్ళు చెమర్చిన క్షణాలు ఎన్నో ఉన్నాయి నిజంగా ఇది ఎంతటి భాగ్యం! అనిపిస్తుంది ఎన్నోసార్లు—నాతో ఏవిధంగానూ సంబంధములేని అపరిచితులూ, నాకన్న ఎన్నో విధాల అధిగమించి ఉన్నవారూ, తండ్రులో, తాతలో కాగలిగేంత పెద్దవారూ అత్యధికంగా అభిమానించి ప్రేమించే పిన్నవారూ—ఇంతమందిచేత గౌరవాభిమానాలను పొందగలగటం భాగ్యమే కాకపోతే ఏమిటి?

ఈ అభిమానుల ప్రేమ అతి పవిత్రమైంది ఈ అభిమానుల అసూయ కూడా అతి మధురమైంది వెంటనే కవరు తీసి రెండు ఉత్తరాలకు జవాబులు రాశాను జీవితంలో మరేనాటికీ ఈ అభిమానులు నన్ను మర్చే దురదృష్టం రాకూడదనే నా కోరిక—సరే! మూడో ఉత్తరం ఓ ఫ్రెండు దగ్గర్నుంచి—"నీ నవల పంపిస్తావని యిన్నాళ్లూ చూస్తూ కూర్చున్నాను మొన్న ఓ శుభక్షణాన ఆ ఆశ నిరాశ చేసుకుని కొనటానికి బయల్దేరాను వూరంతా తిరిగి మరో రూపాయి ఎక్కువిచ్చి మరీ తెచ్చుకోవాల్సి వచ్చింది" మరేవో విశేషాలు—దీర్ఘంగా నిట్టూర్చాను ఈ పబ్లిషర్స్ తెలివితేటలు ఒక్కొక్కటీ బయట పడుతోంటే మొట్టమొదట విస్తుబోవటం, విభ్రాంతి పడటం, ఆతర్వాత ఆవేశంతో అంగలార్చటం, చిట్టచివరికి ఉస్సురని నిట్టూర్చటం అలవాటైపోయాయి అయినా "ఎంత దారుణం!" అనిపించింది మరోసారి చూడబోతే ఈ పబ్లిషరుగారు దేవుళ్లందరినీ తన పేరులోనే బంధించుకున్నారు అందుకే కాబోలు ఏ కార్యం తలపెట్టినా నిర్భయంగా నిర్మోహమాటంగా సాధించగల్గుతారు ఈయన బ్రతుకనేర్చినవాడు మేధావి ఈయన తెలివితేటలు—అసమానం! అపూర్వం!

ఈవాడు ప్రచురిస్తానంటూ ఓ రచన తీసుకొని మరోనాటికి దాని తాలూకు రచయితనో, అనువాదకుణ్నో తనే నంటూ ఆ రచన తన స్వంతం చేసుకుంటే ఆశ్చర్యపోనక్కర్లేదు పేరు మోసిన ఓ పుస్తకానికి తనో అనుకరణ సృష్టిస్తే విస్తుపోనక్కర్లేదు వేలాది కాపీ లమ్ముకొంటూ — సారీ! మీ ఎడిష నింకా పూర్తికాలేదని మొసలి కన్నీటితో కార్డుముక్క రాస్తే ఆగ్రహించనక్కర్లేదు దూరంగా సుదూరంగా తెలీని ప్రాంతాల్లో హెచ్చు ధరలకు పుస్తకా లమ్ముకొంటూ దాని తాలూకు లాభాలు దాచుకుంటే విచారించనక్కర్లేదు రచయిత అనుమతి లేకుండానే పేరు వాడుకున్నా కలగజేసుకో నక్కర లేదు

తనొకటి చెప్పి మరొకటి చెయ్యొచ్చు పైపెచ్చు "మీరే అవధులు దాటుతున్నారని" దబాయించనూ వచ్చు ఇదంతా ఎంత అపారమైన వారి మేధాశక్తి ముందు? ఓ దూదిపింజ! మరో గడ్డిపరక!—ఒక్కటి మాత్రం నిజం! జ్ఞానసంపద పెరగాలంటే వారికే ఓ నవల ఇచ్చితీరాలి చాలు! ఓ సంవత్సరం నిరీక్షించాలి అంతే! ఎంత విజ్ఞానం వస్తుందో అంచనా వేసుకోవాలి

ఉత్తరం డెస్క్‌లో పడేశాను.

శ్రీవారి సన్నిహితుడి లేఖ చదివితే మతి పోయింది జవాబెలా రాయాలో అర్థంకాలేదు — "ఇంతకీ నువ్వు కనుక రాజుని కలుసుకుని నా సంగతి మాట్లాడావా ?" "శ్రీనివాస్‌కు నువ్వేదో పుస్తకం పంపుతానన్నావని ఎదురు చూస్తున్నాడు ఉత్తరం రాయకూడదూ ?"

"కృష్ణమూర్తి పెళ్లికి నేను రాలేకపోయాను వాడికేమైనా కోపం వచ్చిందేమో లెటర్స్ వ్రాయటంలేదు నువ్వయినా పెళ్లి విశేషాలు రాయి"

దేవుడా ! ఈ పెళ్లిళ్లేమిటో, పుస్తకా లేమిటో కోపా లేమిటో నాకే అంతుచిక్కలా ఆ ఉత్తరానికి జవాబెలా రాయను ? వివరాలేమీ చెప్పకుండా పోయిన పెద్దమనిషిమీద కోపంతో ఆ ఉత్తరాన్ని కూడా డెస్క్‌లోకి తోసేశాను

నిద్ర ముంచుకురాసాగింది కళ్లు కూరుకు పోతన్నాయి పడుకున్నానూ అంటే లేచేది ఆరింటికే —పక్కకేసి చూసినా లాభంలేదనుకుని నిద్ర ఎగర గొట్టుకోటానికి కాస్త తెరిపికోసం పిల్లల దగ్గరికి వెళ్లి కూర్చున్నాను నానిగాడు కుర్చీ అడుగున దూరి ఏమిటో హడావుడి పడు తున్నాడు పాప ఎడంచేతిలో గిలక్కాయి కుడి చేతికి అందనివ్వకుండా జాగ్రత్తపడుతోంది

"నానీ ఒక్కసారిలా లేచిరా !"

"అబ్బ నేను కారు నడుపుతున్నానమ్మా !"

"ఏవూరు వెళ్తుందే కారు"

"విశాఖపట్నం"

"ఎన్ని డబ్బులు తీసుంటావ్ ?"

"పఫది డబ్బులు"

"అయితే నేను ఎక్కుతాను" లేచి వెళ్ళి కుర్చీమీద కూర్చున్నాను పిపీప్ భుయ్ భుయ్! ఝూఁ మంటూ రెండు నిముషాలు శరవేగంతో పోయింది కుర్చీకారు

"దిగమ్మా డబ్బులివ్వు"

"చిల్లర లేదురా ! యిస్తా"

వాడు నిర్విచారంగా కారు నడపటంలో నిమగ్నమై పోయాడు నా నిద్రమత్తు కాస్త వదలి పోయింది —"పిల్లలు ఆడుకొంటున్నారు గోపాలాన్ని ఓ దరికి చేర్చేద్దాం" అన్పించింది

* * *

గుడ్‌లక్ ! వెరీ గుడ్‌లక్ ! కాకపోతే ఏమిటి ? సరోజాదేవి జవాబు రాస్తుందనీ ఉత్త జవాబా ? నో, నో! ప్రేమ జవాబు రాస్తుందనీ, రాసినా అలా తనసం తల్లడిల్లిపోతుదనీ కలనైనా కన్నాడా గోపాలం ? —కనలేదు ఆసలు సరో సమాధానం యిస్తుందని అనుకోలేదు సరిగదా తన ఉత్తరమైనా చించి చదువుతుందని విశ్వసించ లేదు చదవకుండా చించేస్తుందేమోనని కుత కుత లాడిపోయాడు తొందరపడి ఎందుకు రాశానా అని తన ఆవేశాన్ని తిట్టి పోసుకున్నాడు —సన్నిహితుణ్ణయినా సలహా అడిగానుగానని ఎంతెంతో నొచ్చుకున్నాడు పోనీ, జరిగిందంతా చెప్పేసి ఫ్రెండు ఒడిలో తలదాచుకు ఏడ్చేద్దామా అని సిద్ధమై పోయాడు —తను చేసిన తెలివితక్కువ పనికి ఫలితం ఎలా ఉంటుందోనని కంగారుపడిపోయాడు అంత అధ్వాన్నపు స్థితిలో అంత విషమదశలో అంత చెడ్డ సమయంలో సరోజాదేవి జవాబు యిచ్చింది —సరో ప్రేమలేఖ రాసింది గుడ్! గాడ్!

గోపాలం మొహం కళకళలాడింది.

గోపాలం భయం పారిపోయింది.

గోపాలం ఛాతీ వెడల్పయింది

గోపాలం మీసం లేదు లేదు గోపాలానికి మీసాల్లేవు గంటనుంచి ఆశ్చర్యానందాంబుధులలో మునిగివున్న గోపాలం దాహం వేస్తుంటే లేచి గ్లానుడు మంచినీళ్లు తాగేశాడు గడగడా "నయం ఇంకా రహస్యం కాస్తా కిష్టిగాడికి చెప్పేశాను గాను వా డసలే భుజాన్న నాలుకవేసుక తిరిగే వెధవ ! రోగ్ ! ఉత్త జెలసీ ! ప్రేమ హృదయాలను చూసి వోర్చలేడు నయం చెప్పలేదు" తనని తనే మెచ్చుకున్నాడు చాలాసేపు

సరో లెటరు మరోసారి చదువుకోవాలి పధ్నాలుగోసారి అవుతుంది అవనీ ! డైరీలో రాసుకోవచ్చు ఇంతకీ సరో నిజంగానే తనని ప్రేమిస్తోందన్నమాట ఆ అనురాగమంతా ఇన్నాళ్లూ ఎలా దాచుకుందబ్బా ? బావుంది దాచుకోక ఏం చేస్తుంది ? ఆడపిల్ల తనకై తనెలా వెల్లడిస్తుంది ? ఇప్పటికైనా తను ధైర్యంచేశాడు కాబట్టి సరో మనస్సు విప్పి చెప్పగలిగింది

పదమూడుసార్లు చదివినా తృప్తిపడని గోపాలం సరోజ ఉత్తరాన్ని మరోసారి

"శ్రీ శ్రీ గోపాలరావుగారికి హృదయపూర్వక నమస్కృతులు !" ఎంత యిదిగా రాసిందీ ! అవును మరి ఎంత ప్రేమిస్తే మాత్రం స్త్రీ పురుషుడికి గౌరవం యివ్వకపోతే బావుంటుందా మరి ? మన భారతదేశంలో ఏ స్త్రీ మాత్రం అంత అవిధేయతగా ప్రవర్తిస్తుంది ? నో నెవర్ !

"మీ ఉత్తరం చదివి చాలా సంతోషించాను మిమ్మల్ని బీచ్‌లోనూ, కాలేజీ గేట్ల దగ్గరా చాలా సార్లు చూశాను మీనుంచి యిలాంటి లెటరేదో వస్తుందని అనుకొంటూనే ఉన్నాను,"

అబ్బో ! గడుసు తలకాయలాగే ఉంది ఆవలిస్తే పేగులు లెక్కపెట్టేస్తుందేమో ఖర్మ ! తను ప్రేమించిన విషయం ఎప్పుడో కనిపెట్టేసిందన్నమాట

"మీరు నాకేగాదు నా ఫ్రెండు కమలకు కూడా బాగా తెలుసు మీ లేఖ దానికి కూడా చూపించాను"

ఛ ! ఎంత ఫ్రెండైతే మాత్రం ఇలాంటి విషయాలు వెల్లడించుకోవచ్చునా ? రాసే రాసే ఉత్తరం దాచేసి తలనొప్పి నటించాడేగాని తను అసలు సంగతి కిష్టిగాడితో చెప్పాడా ? ఛ్ఛ ! ఏమిటో ఈ ఆడవాళ్ళు ! ఏది వచ్చినా పట్టలేరు నోట్లో నువ్వుగింజ నాన్చుకోరు

"మీకు జవాబు రాయమని కమల కూడా ప్రోత్సహించింది అది చెప్పకపోయినా నేను రాయాలనే అనుకుంటున్నాను సుమండీ !"

పిచ్చిగానీ పరాయివాళ్ళు చెప్తే చెయ్యగలిగే విషయమా ఇది ? తనకన్నా మిన్నగా వేదన పడుతోందన్నమాట వెర్రి సరో !

"మీ ఉత్తరమంతా చక్కని భావ కవిత్వంతో నిండి ఉందండీ ! మీ రేదైనా పెన్ నేమ్‌తో కథలు రాస్తూంటారేమో అనిపిస్తోంది నాకు అవునంటారా ?" — పిచ్చిపిల్ల ! ప్రియుడిలో ఏదో ప్రత్యేకత ఉండాలని ఆరాటపడతారీ ఆడపిల్లలు — తను ఎప్పుడో ఏదో రాసి మూల పడేశాడు ఏదీ ప్రోత్సాహమేదీ ? సరోవంటి ప్రేయసివి హీరోయిన్ చేసుకుంటే ఇక తను ఎన్ని కథలనైనా

రాయగలడు ఎన్ని వర్ణనలైనా చెయ్యగలడు ఎంత సాహిత్యమైనా సృష్టించగలడు రాయాలి. తప్పకుండా రాయాలి సరో సంతోషం కోసమైనా రాయాలి

"వేర్పుగా ఉత్తరం రాసినంతమాత్రాన రచయితేనా ఏమిటి? అంటోంది కమల" — మధ్య ఆవిడకేం తెల్సు మహా చెప్పటానికి ? పరస్పరం ప్రేమ హృదయాలకే తెలుస్తాయి ఆ పోలికలన్నీ

"ఇలా ఎంత రాసినా రాయాలనే ఉంది మీకు విసుగ్గా ఉందో ఏమో !" సరో ! ఎంతమాటన్నావు సరో ! ఇంకెప్పుడూ అనకు మరెప్పుడూ అనకు నువ్వు మాట్లాడుతోంటే నేను వినుక్కోవటమా ? నీ నోటి మాటకోసం—నీ చేతి రాత కోసం కాకపోతే నా జీవితం దేనికి ? ఈ ఆరాధన దేనికి ? ఈ తపస్సంతా దేనికి ?" ఏడ్చుకోబోయాడు గోపాలం

"మిగతా విషయాలన్నీ మనం కల్సుకున్నప్పుడు మాట్లాడుకుందాం ఉత్తరంలో ఎంతని రాయను ?"

మరీ బిడియస్థురాలు ! అన్నంతపనీ చేసింది అకస్మాత్తుగా ఆపుచేసింది—మిగతా విషయాలన్నీ . ఏమిటో ? పిచ్చి సరోకి ఎంత మాట్లాడాలని ఉందో ! ఎన్ని చెప్పాలని ఉందో !

"మీకోసం శుక్రవారం సాయంకాలం నిరీక్షిస్తూ ఉంటాను మీరు నేరుగా మా ఇంటికే రావచ్చును బామ్మా, నేనూ మాత్రమే ఉంటున్నాము నా చదువుకోసమే ఈ వూళ్లో మకాం పెట్టాల్సి వచ్చింది మా బామ్మ చాలా మంచిది. మీరేమీ అనుమానించ నవసరంలేదు"

ఎంతమాట ! సరో— సరో బామ్మగారూ— సరోవాళ్ల తల్లిదండ్రులూ — అసలు ఆ వంశం వాళ్లే మర్యాదస్తులు ! సంస్కారులు !

"తప్పక వస్తారుకదూ ? మనం ఆ సాయంత్రం ఏదైనా పిక్చర్‌కి కూడా వెళ్దాం మీకోసం వేయి కళ్లతో ఎదురుచూస్తూంటాను నన్ను నిరాశ పర్చరుగా ! ఉండనా మరి ?" సరో ! అబ్బ ! బొత్తిగా మతి పోగొడుతోంది ఉత్తరం రాస్తే ఇంత మధురంగా—స్వీట్‌గా రాస్తే ఇక గోపాలానికి సిగ్గు వేసింది మరి ఆలోచించలేక ఎదురుగా కిష్టిగాడు ! అప్రాచ్యుడు ! మూడ్స్ చెగొడట్టడమే పనిగా పెట్టుకుంటాడు బుద్ధిహీనుడు ! విలన్ మూర్ఖుడు !

"ఏంరా అలా పడుకున్నావ్ ? ఒంట్లో బాగా లేదా ?" గోపాలం కంగారు కంగారుగా సరో లేఖ మంచంకిందికి తోసేశాడు

"మాట్లాడవేంరా ? మన్నీమధ్య బొత్తిగా మారిపోతున్నావ్ ఎందుకో"

—నీ నెత్తికి, అంత ఏడ్చుకోకపోతే నువ్వూ మారరాదూ ? లోలోపల తిట్టుకుంటూ పైకి నవ్వేశాడు గోపాలం — "అబ్బే ! మారటం ఏమిట్రా నీ మొహం నే నెందుకు మారతామా ?"

"ఏమో ! నువ్వు "

* * *

"బిస్కట్ -నావ్‌రొట్టి బిస్కట్ -" దూర దూరంగా అరుపులు— "అమ్మా ! అమ్మా ! బిస్కట్లు కొనుక్కుంటానే !"

"ఊఁ కొనుక్కో" అనేశాను విసుగ్గా.

"మరి తలుపు తియ్యమ్మా !"

43 వ పేజీ చూడండి

టి. భూమాదేవి

ఈ మధ్యకాలంలో బిస్కట్ల విషయం పూర్తిగా మరిచిపోతున్నారు వనితాలోకంలో అడపాతడపా వంటలు — పిండివంటలు కూడా ప్రచురిస్తున్నారు ఇది వనితలకు ఎంతో ఉపయోగకరమైనదే ముఖ్యంగా ఇదివరలో చెప్పిన కొన్ని స్వీట్సు తయారు చెయ్యడం చదివానుగాని బిస్కట్ల చేసేవిధం ఎవరయినా వ్రాస్తారా అని ఇంత కాలం ఎదురు చూశాను ఎవరూ వ్రాయక పోవడంచేత నాకు తెలిసిన కొన్ని రకాల బిస్కట్లు చేసేవిధం చెబుతాను

బిస్కట్లు చేసుకోడానికి ముఖ్యంగా కావలసినవి— తాజావెన్న, తాజా మైదాపిండి, ఇవిగాక బేకింగ్ డబ్బా అంటే బిస్కట్లు వండేందుకు ప్రత్యేకం అరల డబ్బా అమ్ముతారు అరలు కింద ఇసుక వేసేందుకు స్థలం ఉంటుంది ఈ డబ్బాలో నాలుగయిదు ఆకారాల్లో అచ్చులుంటాయి వీటితో బిస్కట్లు ఆకారాలు వచ్చేట్లు కోసి, ఆపైన వండుతారు సరే ఈ డబ్బా దొరకని పక్షంలో బిస్కట్లు వండేందుకు రెండు పెనాలు, ఒక ఇత్తడి పళ్ళెం, లోతుగా చదునుగా ఉండే పళ్ళెం, మెత్తని ఇసుక కావాలి

బేక్ చెయ్యడం అంటే, నేరుగా నిప్పు సెగ మీదను కాక సెగవల్ల వచ్చిన వేడిమీద వండటం అన్నమాట ఈ వేడి మామూలు నిప్పు సెగ కంటే ఎక్కువ వేడిగా ఉంటుంది పైనా కిందా రెండు వైపులా నిప్పుసెగ ఉంటుంది దీన్నే బేకింగ్ అంటారు

బిస్కట్లు చేయడానికి ముందుగా బొగ్గుల కుంపటి నిండా బొగ్గులుపోసి, నిప్పు అంటించి, బాగా ఎర్రగా నిప్పు అయ్యేదాకా విసరాలి కుంపటి అంటించినప్పుడు కర్రల పొయ్యిగానీ, ఈ రోజులలో వచ్చే కిరసనాయిలు స్టవ్‌గానీ, జనతా వంటి స్టవ్‌గానీ, అంటించాలి బేకింగుకి వాడే అట్లపెనాలలో ఒకటి పెద్దది, రెండోది కాస్త చిన్నదిగా ఉండాలి పెద్ద పెనంలో బాగా అరచేతి మందాన ఇసుక పరచి, ఆ ఇసుక ఎర్రగా కాలనివ్వాలి చీపురు పుల్ల ఆ ఇసుకలో పెడితే, వెంటనే కాలిపోవాలి అంత సెగవరకు ఇసుక కాలాలి ఈ కాలిన ఇసుకమీద చిన్న పెనం ఉండి, బాగా వేడెక్కిన వెనుక, దానిపైన కోసిన బిస్కట్లు ఉంచి, ఆ పెనం మీద ఇత్తడి పళ్ళెం ఉంచి, కుంపట్లోని ఎర్రని నిప్పులు పొయ్యాలి. పావుగంట అయ్యేసరికి బిస్కట్లు కమ్మని వాసన వస్తవి పై పళ్ళెంలో నిప్పులు బాగా ఉంటే బిస్కట్లు తిరుగవెయ్యక్కరలేదు బిస్కట్లు బాగా పొంగి గోధుమ రంగుకి వస్తాయి అప్పుడు తీసి విడిగా ఓ పళ్ళెంలో ఉంచుకోవాలి ఇది బిస్కట్లు వండే విధానం

* * *

ఇప్పుడు పిండి తడపటం వగైరా చెబుతాను. మామూలు తీపి బిస్కట్లకు పాళ్ళు

ఒక అరపౌను మైదాపిండి, అరపౌనులో మూడోవంతు దంచి, జల్లించిన చెక్కెరపొడి, అయిదు పలాల తాజా వెన్న, అర టీస్పూను సోడా అర టీస్పూను రొట్టెలసోడా నాలుగు చుక్కల వెనిల్లా ఎసెన్సు

మైదాపిండి అరపౌను జల్లించి ఉంచుకోవాలి ఈ పిండిలో మూడోవంతు చక్కెరవేసి దంచి, జల్లించి ఉంచుకోవాలి అంటే మైదాను కొల్చుకుని, ఆ మైదాలో మూడోవంతు చక్కెర పొడి ఉండేట్లు చూచుకోవాలి

వెన్న తాజాగా ఉండాలి లేకపోతే బిస్కట్లు బాగుండవు తాజావెన్నతక్కువ వడుతుందికూడా

ప్రొద్దుట బిస్కట్లు చేస్తామనగా, రాత్రి పదింటి వేళ పిండి తడిపి ఉంచుకోవాలి. మధ్యాహ్నం చేసే మాటుంటే ఉదయాన పిండి తడపాలి. ఏమైనా బిస్కట్ల పిండి ఆరుగంటపాటు నానాలి. అది ముఖ్యం.

ఒక వెడల్పాటి స్టీలు గిన్నెను తీసుకుని అందులో చిలక కొట్టిన చెక్కెరపొడి, వెన్నవేసి, బాగా చిలక కొట్టాలి. ఈ చిలక కొట్టిన మిశ్రమంలో నాలుగు చుక్కల వెనిల్లా ఎసెన్సువేసి, బాగా నురగ వచ్చేటట్లు చిలకాలి. మైదాపిండిలో సోడా, రొట్టెలసోడా వేసి, పిండిలో బాగా కలిసేటట్లు కలిపి, ఈ నురగలో పిండి వేస్తూ పూరీల మాదిరి కలిపి, తడి ఆరిపోకుండా మూత పెట్టాలి. వెన్న ఎక్కువవేస్తే రుచిగా ఉంటుంది గదా అని ఎక్కువ వెయ్యకూడదు. పిండి రొట్టెల పిండిలా మోతాదులో ఉండాలి. లేనట్లయితే పల్చబడి బిస్కట్లు పాడవుతాయి.

మూత పెట్టి ఆరు గంటలు ఉంచి, ఆ పైన పిండిని బాగా మర్దనచేసి చపాతీలకంటే కాస్త మందంగా వత్తాలి. ఈ వత్తిన వాటిని డైమండ్సుగానో, చక్రాలుగానో మనకు కావలసిన షేప్సులోకి కోసుకోవాలి. ఈ ముక్కలను పెనానికి పట్టినన్ని వేస్తూ, 'బేక్' చెయ్యాలి. గోధుమ రంగు వచ్చాక తీసి విడిగా పళ్ళెంలో పెట్టుకుని చల్లారేక గట్టిమూతగల డబ్బాలో వేసి, టైట్‌గా మూత పెడితే ఎన్నాళ్ళయినా మెత్తపడవు ఇవి తింటానికి రుచిగా, బాగా ఉంటాయి.



మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక జానపద నృత్యం

ఈ బిస్కట్లు వండ తడపెటప్పుడు గమనించ వలసిన కొన్ని విషయాలు :

పిండి తడుపుతున్నప్పుడు తడి తగులకూడదు తడిచెయ్యి తగిలితే బిస్కట్లు మెత్తబడతాయి. చక్కెర, వెన్న కలిపిన మిశ్రమం ఎంత నురగ వస్తే అంత బాగుంటుంది. పంచదార కొట్టి జల్లించే కలపాలి. వెన్నకూడా పిండికి సరిపడి నంతే వెయ్యాలి. వెన్న అంత వెయ్యలేని వారు కాసిని పాలుపోసి కలుపవచ్చు. కాని పాలు కలిపిన బిస్కట్లు వెన్నబిస్కట్లంత రుచిగా ఉండవు.

సాల్ట్ (ఉప్పు) బిస్కట్లు

దీని పాళ్ళన్నీ మామూలు తియ్య బిస్కట్లు లాగానే. ఎటొచ్చీ పంచదార వెయ్యరు. తగినంత ఉప్పు, వాము, మెత్తగా దంచి, మైదాలో వేసి వెన్న రొట్టెలసోడా కావలిస్తే పాలు కూడా పోసి, కలిపి, బేక్ చేస్తారు.

కర్జూరం బిస్కట్లు

అరసౌను మైదా, మైదాలో మూడోవంతు చక్కెరపొడి, పావుసౌను ఎండు కర్జూరం కాయలు, చిటికెడు ఉప్పు, టీస్పూన్ రొట్టెల సోడా

ఎండు కర్జూర కాయల్లోని గింజతీసి, పై పెచ్చులు మెత్తగా పొడిమాదిరి దంచాలి. చక్కెర దంచి, జల్లించాలి. వెన్నలో చక్కెర పొడివేసి, బాగా చిలకకొట్టి నురగ వచ్చాక మైదాలో రొట్టెల సోడా, ఖర్జూరపుపొడి, చిటికెడు ఉప్పు వేసి, బాగా కలిపి ఈ నురగను పిండి మధ్యవేసి, మెత్తగా ముద్దచేసి, ఆరుగంటలసేపు మూత పెట్టి, నానపెట్టి ఆ పైన చపాతీ మాదిరి వత్తి ముక్కలు కోసి, బేక్ చెయ్యాలి.


లెమన్ (నిమ్మ) బిస్కట్లు

అరసౌను మైదా, మూడోవంతు మెత్తని చక్కెర పావుసౌను వెన్న, అర టీస్పూన్ రొట్టెలసోడా ఒక టీస్పూన్ నిమ్మరసం, అరటీస్పూన్ నిమ్మతొక్క పొడి, చిటికెడు ఉప్పు.

మైదా జల్లించి ఉంచుకోవాలి. చక్కెర కూడా జల్లించి ఉంచుకోవాలి. టీస్పూన్ నిమ్మరసం తర్వాత పంచదార, నిమ్మకోరు కూడావేసి బాగ కలపాలి. పిండి బాగా ముద్దయ్యాక నిమ్మరసం వేసి, బాగా కలిపి, ఓ ఆరుగంటలు మూత పెట్టి నాననిచ్చి, ఆ పైన కావలసినట్లు కోసుకుని, మామూలు బిస్కట్లకు మల్లే బేక్ చేసుకోవాలి.

కొన్ని ముఖ్య విషయాలు :

బిస్కట్ల పిండిలో వెన్న చాలకపోతే పాలు పోసి కలుపవచ్చు. నీరు పొయ్యకూడదు. పిండి మొదట్లో బాగా గట్టిగా తడపాలి. లేనట్లయితే ఆరుగంటలు నానిన వెనుక మరీ పల్చబడి పోతుంది. బిస్కట్ల పిండి వత్తేప్పుడు, అవసరమయితే పొడి పిండివేసి వత్తవచ్చు. కాని చాలా కొద్దిగా పిండి వెయ్యాలి. బేక్ చేసేప్పుడు పై నిప్పుల సెగ, క్రింది ఇసుక సెగ బాగా ఉంటే బిస్కట్లు పావు గంటలో గోధుమరంగుకు వచ్చేస్తాయి. కాబట్టి నిప్పుసెగ బాగా ఉండటం ముఖ్యం. ఇవి చేసుకో డానికి సుమారు రెండు గంటలు పడుతుంది. రెండు గంటలు కష్టపడితే వారానికి తగు బిస్కట్లు తయారవుతాయి. ★



పంజాబీల పరిణయం

చక్కగా, ముచ్చటగా, ఉన్నదున్నట్లుగా, ఓ చిన్న సినిమారీల్‌లాగా, హాస్య రసపూరితంగా ఉంది అనటంలో సందేహములేదు!......ముఖ్యంగా....

"ఆజ్ హమారే ముండాకా ముండన్ హై!"..

"లావుగా వున్న వదినగారొస్తే బక్కగా ఉన్న ఆడపడుచు ఎత్తుకోగలదా ?...." అన్న మాటలు చదివిన తరువాత నవ్వకుండా ఉండలేక పొయ్యా మంటే నమ్మండి!...

రాధ, శాయి (గుంటూరు)

* * *

రచయిత్రి వ్యాసము చక్కగా వ్రాసినారు. ఈ విధముగా భారత దేశములోని అన్ని భాషల వారి గూర్చి ప్రచురించిన బాగుగా నుండును.

కూచిభొట్ల సీతా మహాలక్ష్మి, చర్ల వెంకట సత్యవతి (రాజమండ్రి)

స్త్రీ

స్త్రీ అను అక్షరములో ఎంత సొందాతన ముంది ! ఉచ్చారణలో ఎంత పవిత్రత ఉన్నది! 'కలకంఠి కంటె కన్నీరొలికిన సిరి ఇంట నిలువ నొల్లదు సుమతీ !" అని చక్కని వాక్యములు గలవు. ఈ వాక్యములను చదవని మాతాపిత లుండరు. అట్టివారు తమ పుత్రికలను నిర్లక్ష్య భావముతోనూ చూడరు. ఎంత అజ్ఞానము, ధనాశా పీడితులైనను తమ (పుత్రికా) సంతాన మును బరువుగాను, అసహ్యముతోనూ చూడరు. ఇక తల్లిని గూర్చి ఆలోచిస్తే. ఆమె స్త్రీ కాదా సంస్కారము గల ఏ స్త్రీయైనను, ఏ మాతృ మూర్తి యైనను (తమ) "పిల్లలపై పక్షపాత ముంటుంది" అని 'రమ'గారు వ్రాసిన వ్యాసంతో ఏకీభవించరు.

ఎంత క్రూరుడైన అన్నగారికైనను, తమ్ము డికి యైనను తమ సోదరిపై ప్రత్యేక అభిమానము ప్రేమ యుండకపోవు. అసహ్యం ఎన్నటికి సోద రిపై కలుగదు.

స్త్రీ స్వాతంత్ర్యము, స్త్రీ విద్య ప్రబలు చున్న నేడు ఏ తల్లి తండ్రులును, (ఏ సోదరులును) తమ పుత్రికను ప్రేమించకుండా, మిక్కిలి భార ముగా చూచెడు వారు ఉండరు.

ఈ వ్యాసము వాస్తవికతకు చాల దూరంగా మున్నది.

వై. రమణమ్మ (గురజాల)

* * *

నిజానికి స్త్రీజాతి అంతా ఇటువంటి బాధ తోనే తమ యొక్క ఆశయాలను ఆదర్శాలను నెరవేర్చుకొనలేక పోతున్నారు. రచయిత్రిగారి వ్యాసము చూచినా స్త్రీజాతికి నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యములు కల్గిస్తారని ఆశిస్తున్నాను.

కుమారి. తోలేటి రమాజ్యోతి (ఏలూరు)

* * *

రచన బాగానే ఉంది. కాని జగత్తులో ప్రతి స్త్రీ జీవితం, అలా ఉండదు. నిస్పృహతో కూడిన రచన, అతిశయోక్తి కూడాను.

రాధ (హైదరాబాద్)

* * *

అబ్బ, ఇంత చక్కటి వ్యాసం వ్రాసిన "రమ" గారికి ముందే అభివందనములు తెలుపుతున్నాము.

"ఆడపిల్ల" పుట్టగానే "ఆడపిల్లా" అని పెదవి విరిచే అలవాటు సాధారణంగా మన ఆడ వాళ్ళలోనే ఉంది. మగవాడు ఎంత తప్పు పని చేసినా వాడికేం మగ మహారాజు అని త్రోసేస్తారు. "స్త్రీ" జీవితం ఎంత కష్టమో కన్నుల కట్టినట్లు వ్రాసేరు. ఆడదై పుట్టేకన్న అడవిలో మ్రానై పుట్టడం నయం అని బుజువు పరిచే ప్రశ్న సమస్యగా పుడుంతుంది, సమస్యగా పెరుగుతుంది, సమస్యగా మరణిస్తుంది. "స్త్రీ" జీవితమే ఒక సమస్య. ఈ వాక్యము మమ్మల్ని ఎంతో ఆకర్షిం చింది.

కుమారి శేషాకుమారి, కుమారి రమణకుమారి, కుమారి. రాజకుమారి (ఎ. మల్లవరం)

* * *

వ్యాసము చదువుతుంటే నవ్వు వచ్చింది. ఇది కేవలము పురుష జాతిమీద ఉన్న దురభిప్రాయం వల్లనైనా వ్రాసియుండాలి. లేక పత్రికలో పేరు పడుటకైన ఉండాలి. కాలం మారింది మనుష్యులు మారారు. మగవారు మారారు. కట్నం గురించి వ్రాసిన దానిలో కొంత నిజము ఉండ వచ్చు కాని, మిగత విషయములు ఎక్కడో తప్ప మనకు కానరావు. కొన్ని కుటుంబాల సంగతులు తీసికొని, మగవారిని దుమ్మెత్తి పోయుటం మన స్త్రీ జాతికే అవమానకరం హా ఇంటిలో, మాకు తెలిసిన ఇండ్లలో, ఆడపిల్లల్ని ప్రేమగా చూస్తారు. మనం చేసే పనులు బాగుంటే, పురు షులు అలా చేయరేమో ! ఇంతకీ మన బంగారం మంచిది కావాలిగాని ఒకరినని ఏం లాభం !

దూరా లక్ష్మీకుమారి (గుంటూరు)

* * *

వనితా వాణి

స్త్రీకి నిత్య జీవితంలో ఉండే సాధక బాధకాలను ఆమె చక్కగా కళ్లకు కట్టినట్లు రాశారు. కానీ ఆమె రాసినదాంట్లో చిన్నలోపం ఉంది. అది ఏమంటే ప్రతీ భర్త, ప్రతీ భార్యనూ అనుమానిస్తాడనటం చాలా శోచనీయం. వారివారి అదృష్టాన్ని బట్టి అలాంటి భర్తలు దొరుకుతారు. భార్యలను రాక్షసులమాదిరి భర్తలు బాధిస్తారని రాశారు. కానీ భార్యని దేవతలమాదిరి చూచే భర్తలు కూడా ఈ యుగంలో ఉన్నారు. అందరు భర్తలూ అలా ఉంటారనటం ఏమి బాగు! వ్యాసంలో ఈ ఒక్కలోపంతప్ప మిగతాఅంతాచాలా చక్కగాఉంది. శ్రీమతి. పి. రత్నమాల (సోంపేట)

వ్యాసము నాకు ఎంతో నచ్చినది. వారికి నా హృదయ పూర్వక అభివందనలు. స్త్రీ ఏమి చేసినా తప్పే. ఎక్కడికైనా బయటికి వెళ్ళి వస్తే లక్షా యాభై ప్రశ్నలు. స్త్రీ జీవితము తామరాకు మీద నీటిబొట్టు వంటిది. మగవాడు ఎంత తిరిగినా ఫర్వాలేదు. అదే, స్త్రీ విషయములో,

ఆమె ఎంత పవిత్రముగా ఉన్నా అపనిందలు, అభాండాలు వేస్తుంటారు.

ఇక పెళ్లి చూపులు విషయము తీసికొంటే దీనికంటే ఏ ఆఫీసులో నన్నా ఇంటర్వ్యూకు పోవచ్చు. అమ్మాయిని శరీరమంతా పట్టిపట్టి చూడడము ఇవంతా ఎంత ఎబ్బెట్టుగా ఉంటుందీ వారు వూహించలేరు. ఇంతకూ వారు వచ్చేది బాగా టిఫిన్లు మెక్కి వెళ్ళడానికి. మా అన్నయ్యకు మా గాలి అంటేనే పట్టదు.

మా అన్నయ్య వూరికెళ్ళేముందు పిల్లవాడ యితే టెలిగ్రాము కొట్టించు. ఆడపిల్లయితే ఒక ఉత్తరం రాసిపడేయి అని చెప్పి (వదినకు) వూరికి పోయాడు. ఎంత చులకన ఆడదాని బ్రతుకంటే !

సోదరి (అనంతపురము)

* * *

రచయిత్రిగారు లోకములో సంఘమున ప్రతి స్త్రీకెలాంటి విలువ ఉన్నది అన్న విషయమును 'వ్యాసములో చక్కగా చిత్రీకరించినారు.

కుమారి అంభారు హేమలత (గుంటూరు)

* * *

నిజముగా వారు వ్రాసినట్లు "స్త్రీ"ను దేవితోనూ పోల్చలేరు. "స్త్రీ" లేనిదే సృష్టియే లేదు. ఎటువంటి ఇంటికయినా స్త్రీ వచ్చిన తరువాత వచ్చిన కళ ముందు ఉండదు. ప్రతిస్త్రీ ఎవరికి కావలసిన అవసరములు ఆయావేళలలో చేస్తూ ఎంతటి విచారము నయినా భరిస్తూ ఉన్నా ఆమెకు సుఖ శాంతులు లేవు. అటువంటి "స్త్రీ"లకు సంఘములో సరిఅయిన స్థానము లేదు పురుషులు చాలా మంది స్త్రీలను నానా బాధలు పెడ్తూ నీచముగ చూస్తున్నారు అందు ఈ రోజుల్లో ప్రతి 'స్త్రీ' స్వశక్తిపైన నిలుస్తూ ఒకరి ఆధారములేకుండా బ్రతుకుతున్నది. ఈ విధముగా ప్రతిస్త్రీ ఉంటేనే తప్ప వారికి సంఘములో సరి అయిన గౌరవస్థానము లభించదు.

కె. సత్యవాణి (చేబ్రోలు)

* * *

నేటి స్త్రీ పడే బాధలకన్న, స్త్రీ ఔన్నత్యము గురించి, త్యాగము గురించి చక్కగా వివరించి, నేటి పురుషులకు చక్కని కనువిప్పు కల్గించారు. ఇది చదివిన పురుషులు, వారివారి ప్రవర్తన, మనస్తత్వం, ముఖ్యంగా కట్నాలు, ఆదరణాభిమానాలతో సక్రమంగా నడచి (మార్పు తెచ్చు తెచ్చుకొని) సంఘాన్ని ఉద్ధరించ గలరని ఆశించవచ్చు.

పిచ్చెమ్మ (రావుర్ కెలా)

* * *

నాలుగు గోడల మధ్య (నిజంగా) నలిగి పోతూన్న ఈ భారతీయ నారీమణులను పైకి తీసుకు రావాలంటే పురుషులే ముందంజ వేయాలి. అప్పుడే మన సంఘం (సమాజం) తన విలువను, తన శక్తిని, ఇతర దేశాలవలె, ప్రపంచానికి చాటగలదు. కాని కొంతమంది చదువుకొన్న వాళ్ళే, తను భార్యలను బానిసలకంటె అన్యాయంగా చూడటం లోక విదితమే ! దీనికి ప్రతిక్రియ, ప్రభుత్వం ఎంత త్వరలో తీసుకు రాగలదో అంత తొందరగ స్త్రీ జాత్యాభివృద్ధి ఏర్పడుతుంది. "స్త్రీ సమస్యగా వుడుతోంది... స్త్రీ జీవితమే ఒక సమస్య"— 'రమ'గారి ఈ ఆఖరు మాటలు నా కన్నీటి బొట్లకు ఆహుతి అయినా యంటే అది స్త్రీ ప్రభావమే !

ప్రభ (వాల్తేరు)

* * *

వ్యాసము చాలా వాస్తవిక దూరముగా నున్నది ఆమె ఉద్దేశములు కొన్ని నిజమైనవి. అయినప్పటికి వాటికి కొంత అతిశయోక్తిగా వ్రాశారు పురుషులను దుయ్య పట్టటమే వారి ధ్యేయమేమో అనే అనుమానానికి ఆస్కారమిచ్చారు. ఆ వ్యాసము స్త్రీలకు ఎవ్విధముగా ఉపకరిస్తుందో అర్థమగుట లేదు. అయినప్పటికి ముగింపు చాలబాగ వ్రాశారు.

నిర్మల (వీరఘట్టాం)

* * *

స్త్రీ జీవితాన్ని ఉన్నదున్నట్లుగా, అతి సహజంగా ఈ వ్యాసంలో చిత్రీకరించారు. సుఖాల ననుభవించే స్త్రీలు ఎక్కడో నూటికి కోటికి ఒకళ్లుంటారేమో ! సాధారణంగా ప్రతీ స్త్రీ జీవితం ఈ విధంగానే ముగిస్తుంటుంది.

గుండుమళ్ల ధనం, సీత, స్వరాజ్యం, విజయ. (విజయనగరం)

* * *

రచయిత్రి ముఖ్యముగా విద్యార్థి దశయందు గల స్త్రీని చక్కగా విమర్శించినారు. వారినే నేను మనస్ఫూర్తిగా యేకీభవించుచున్నాను. వీరి వ్యాసమును బట్టి పరిశీలించినా స్త్రీ ఈ లోకములో గల స్థానమూ కేవలము బానిసత్వముగానే యున్నదని తెలియుచున్నది.

టి. బి. సుందరిదేవి (అనంతపురము)

30—8—63 పత్రికలో 'రమ'గారు వ్రాసిన 'స్త్రీ' అనువ్యాసం చదివాక రాగగలేకుండా ఉండలేక పోయాను. 'రమ'గారు కేవలం పురుష జాతిపై దండెత్తి, ఆ జాతి నంతటిని అవమాన పర్చటం సబబుగాలేదు. వారు చెప్పినట్లు కొంత మంది పురుషులలో స్త్రీలను హీనంగా చూసే లక్షణాలున్నాయి.

స్త్రీ దేవత, నిజమే. కాని ఈ కాలం, నవ నాగరికతగల స్త్రీలలో ఆ దేవతా లక్షణములు వాలామటుకు కానరావు.

మాటవరసకు ఒక స్త్రీ జీవితము నటన మైనదంటే దానికి కేవలం పురుషుడే బాధ్యుడు కాడు. ఆ స్త్రీకి కూడా కొంత భాగముంటుంది.


స్త్రీ పురుష భేదము అనాది నుండి వస్తున్న ఆచారము. స్త్రీ ఎంత తపస్సు చేసిన పురుషుడు కాలేదుగదా !


దేవి (రాయగడ)

* * *

వ్యాసము చదువుతున్నప్పుడు 'స్త్రీ' జాతిపై ఎంతో జాలనిపించింది. అనుకొన్న కోరికలు, అణగారిపోయి, అందరి సౌకర్యములను చూస్తూ, వారి సుఖమే, తన సుఖముగా ఎంచుకొని జీవితాన్ని ధారపోసే త్యాగమయి స్త్రీ అందుకే ఆమెను దేవత అన్నారు. ఈ రోజులలో స్త్రీకి గౌరవము తగ్గింది. అన్న రమగారి వ్యాసము చాల సమంజసము. రచయిత్రిగారి ప్రతి వాక్యముతో నేను ఏకీభవిస్తాను.

శాంత (సీతారాంపురం)





ఇది సినిమా కథ కావడం మూలాన పాఠకులకు నా విన్నపమేమంటే—ముగింపు చెప్పొద్దని. ఇలా అన్నందుకు నేను బి. ఆర్. చోప్రాకుకానీ, బీరేన్‌నాగుకుకానీ ఏదో అవుతానని దురభిప్రాయం లోపడక తెలుగు వ్యక్తిగా గుర్తించమని కూడా నా మనవి. ఇంతకీ కథా ప్రారంభం బెట్టిదనిన.....

"గురూ— ప్రమాదం" శంకర్రావు ఆయాసంతో రొప్పుకుంటూ వచ్చి కుర్చీలో చితికిలబడిపోయాడు. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నల్లి టకీమని అతని శరీరంమీద చురక వేసింది.

"ప్రమాదమంటూ వచ్చి—ఆ కుర్చీలో కూర్చుని మరింత ప్రమాదం తెచ్చుకుంటావేం?" అన్నాడు గోపాలం, లేచి కుర్చీలో నల్లికోసం వెదుకుతూన్న శంకర్రావుని చూసి.

"దీనికేంలే గురూ— ఇప్పు డింతకంటే పెద్ద ప్రమాద మొచ్చింది. విశ్వనాథం గోడ ఎక్కి దూకుతున్నాడు. పిచ్చెక్కిందో ఏమో తెలీదు. నిచ్చెనేసుకుని గోడెక్కడం — అవతలగా ఒక్కసారి ఉరకడం......పలకరిస్తే అన్నాడూ—" శంకర్రావు ఒక్క నిముషం ఒగుర్పుతో ఆగేడు.

"ఏమన్నాడు?" గోపాలం చిత్రంగా చూస్తూ అడిగాడు.

"ఉండవోయ్—అప్పుడే కంగారు పడతావు. ఇంకాస్సేపు ప్రాక్టీసు చేశాక — ఇంటిమీంచి దూకుతాను అన్నాడు. ఇంటిమీంచి దూకితే ఇంకేమన్నా ఉందా?"

"చిత్రంగా ఉందే" గోపాలం ఓ సారి ఆశ్చర్యపోయాడు.

"ఒరేయ్ అన్నయ్యా — ఈ కవరు నిన్న సాయంత్రం వచ్చిందిరా" చెల్లెలో ఉత్తరం గోపాలం చేతి కిచ్చి వెళ్ళిపోయింది.

గోపాలం కవరందుకున్నాడు. అది ఎక్స్‌ప్రెస్ డెలివరిలో వచ్చిన కవరు. కవరుమీద దస్తూరీ ముత్యాలకోవలాఉంది. గోపాలం త్వరగా — జాగ్రత్తగా ఆ కవరు మూత తెరిచి, ఉత్తరం బైటకు తీశాడు. నీలంరంగు కాగితంమీద ఎర్రసిరాతో అందంగా రాయబడిన ఉత్తరం అది. గోపాలం చదువుకోవడం ప్రారంభించాడు.

ఇతరుల ఉత్తరాలు చదవడం చాలా తప్పని బాగా తెలిసిన వాళ్ళలో శంకర్రావొకడు. అయినా అతను ఇతరుల ఉత్తరాలు చదువుతూనే ఉంటాడు. కానీ— ఈవేళ అతనెందుకో ఆ ఉత్తరంకేసి కన్నెత్తయినా చూడలేదు. అదే మంచిదయింది. లేకపోతే ఇద్దరూ మూర్ఛపోయి ఉండేవారు.

ఉత్తరం సగంలో ఉండగానే గోపాలం కళ్ళు తేలవేయడం ప్రారంభించి — ఉత్తరం పూర్తయే దాకా ఆగి— "నే మూర్ఛ పోతున్నారోయ్" అని చెప్పి మూర్ఛపోయాడు.

హఠాత్తుగా సంభవించిన అనుకోని ఈ ప్రమాదానికి శంకర్రావు నిశ్చేష్టుడై, "మరో ప్రమాదం' అనుకున్నాడు.

ఎవరూ తన్ని మూర్ఛ తేర్చక పోయేసరికి— విసుగెత్తి గోపాలం తనంతట తనే లేచాడు. లేచి— "ఇది నిజమేనంటావా?" అన్నాడు.

"ఏది— నువ్వు మూర్ఛ పోవడమా— నిజం కాకపోవచ్చు."

"ఛా— అది కాదురా— ఈ ఉత్తరంలోని విషయం"

"ఏదీ చూడనీ—" శంకర్రావుత్తరం చూసి— "ఓరి నీ—ఇదా— బ్రహ్మంగాడు రాశాడ్రా. ఇందులో అంత మూర్ఛపోవలసిన విషయాలేం రాస్తాడు."

"పూర్తిగా చదివి ఏడ్వవోయ్" గోపాలం ఏడుపు మొహం పెట్టాడు. శంకర్రావు గడగడా ఉత్తరాన్ని చదివేశాడు. గోపాలం అతనికేసే పరీక్షగా చూస్తున్నాడు. ఉత్తరం పూర్తి చేస్తూనే శంకర్రావు విరుచుకుని పడిపోయాడు. పడగానే తగిలిన దెబ్బలకి వెంటనే మూర్ఛ తేరాడు.

"కంగ్రాట్యులేషన్సురా—మ్యూజిక్ డైరెక్టరూ" అన్నాడు.

గోపాలం ముఖం ఇంతింతై, అంతంతై కోనేటి చాంతాడంతైంది. "అయితే అందులోని విషయాలు నిజమే నంటావురా—"

"నిజమా అని మెల్లిగా అడుగుతున్నావూ— పచ్చి నిజం. అందులోనూ బ్రహ్మంగాడు రాశాడంటే ఇంకా సందేహముందీ— పదపద— **ముందీ విషయాన్ని మన మిత్రులందరికీ చెప్పి**

ఓ పార్టీ ఏర్పాటు చేయించాలి. అంతకంటే ముందు నువ్వు నాకో పార్టీ చెయ్యాలి.''

గోపాలం డ్రెస్సైనా మార్చుకోకుండా శంకర్రావు ననుసరించాడు......

తలుపుమీద టకటకమని శబ్దం వినిపించింది.

"ఎవరది?'' ప్రకాశం గర్జించాడు. మంచి సమయంలో డిస్టర్బెన్స్. తలుపు తీసేసరికి—గోపాలమూ, శంకర్రావూను.

"మీరు(టా—రండి—రండి— ఎవరో అనుకున్నా.''

గోపాలం ప్రకాశాన్ని పరీక్షగా చూశాడు. క్రాఫింగ్ చెదిరిపోయింది. షరాయీ, లాల్చీ వేసుకున్నాడు. బల్లనిండా తెల్ల కాగితాలు.

"ఏమిటీ—కవిత్వం రాస్తున్నావా?'' గోపాలం విషయాన్ని గ్రహించేశాడు.

ప్రకాశం భావ యుక్తంగా చిరునవ్వు నవ్వి, "అవున్నా'' అన్నాడు.

గోపాలం టేబుల్ దగ్గర కెళ్ళి చూశాడు. దానిమీద సగం రాయబడిన గేయం ఒకటుంది.

విహంగాలతో కలిసి ఎగిరి పోదమా
కురంగాలతో కలిసి పరుగు లెడుదమా
తరంగాల సంగీతము నాలకించుదమా
అంతరంగా లానందాబ్ధి నోలలాడగా......

అనుకోకుండానే గోపాలం రాగయుక్తంగా పాడేశాడు.

''గురూ—మీ ట్యూను అద్భుతం!'' అవకాశం రాగానే శంకర్రావు గోపాలాన్ని పొగిడేశాడు. పొంగిపోయిన గోపాలం—''గేయం బాగుందిరా—పద కాఫీ తాగుదాం'' అన్నాడు. కాఫీ అనగానే ప్రకాశం మాటాడకుండా చెప్పులు తొడుక్కున్నాడు.

దారిలో గోపాలం అడిగాడు. ''ఇంతకీ ఏమిటి విశేషం? హఠాత్తుగా కవిత్వంలో పడ్డావ్!''

''ఆ! విశేష మేముందిలే—ఇది చూస్తే నీకే తెలుస్తుంది.'' ప్రకాశం జేబులోంచి కవరు తీశాడు. గోపాలం కుతూహలంగా దాని వంక చూశాడు.

కవరులోంచి నీలి రంగు కాగితం, దానిమీద ఎర్ర సిరా అక్షరాలు.

"బాప్రే బాప్!'' శంక్రర్రావు గోపాలం చేతుల మీద మూర్ఛపోయాడు.

"ఛా—అస్తమానూ మూర్ఛ పోవడం స్టైలను కున్నావేంటి—లేలే!'' మిత్రుణ్ణి మందలించాడు గోపాలం. ముఖం మాడ్చుకుని మూర్ఛ తేరాడు శంకర్రావు.

అంతా చదివి—''నిజమే నంటావా?'' అన్నాడు గోపాలం.

"నిజం కాదనుకోడం వలన మన కొచ్చిన లాభ మేమిటి? నిజమనుకున్నందువల్ల మన కొచ్చిన నష్టమేమిటి?'' ప్రకాశం షావుకారు ఇంట్లో అద్దె కుంటున్నాడు.

ఈ ''థీరీ'' గోపాలానికి నచ్చింది. "నాకూ ఇలాంటిదే ఓ ఉత్తరం వచ్చింది— తెలుసా?'' అన్నాడు. ప్రకాశం—''ఏమిటీ?'' అన్నాడు.

"గురూ! కాఫీ హోటలు వచ్చింది'' శంకర్రావు గుర్తు చేశాడు.

ముగ్గురూ కాఫీ హోటల్లో ప్రవేశించారు.

హోటలు చాలా సందడిగా ఉంది. మనుషుల కన్నా ఈగలే ఎక్కువున్నా—వాటి రొదకంటే మనుషుల రొదే ఎక్కువగా ఉంది. ''కాఫీ ఒకటీయ్—రోస్ట్ పెసరా ఒకటీయ్—పచ్చి మిరపకాయల దోసె ఒకటీయ్—కాఫీ స్ట్రాంగుగా—టీ లైటుగా—మొత్తం మూడు దోసీ—'' ఆగకుండా కేకలు వినిపిస్తున్నాయ్. చుయ్‌మనే పెనం చప్పుళ్ళు, తయారయిందన్నందుకు సూచనగా అట్లకాడతో పెనంమీద చప్పుళ్ళూ—......

ఇన్ని చప్పుళ్ళని ఛేదించుకుని వినిపిస్తున్న సుందరం కంఠస్వరం గోపాలాన్ని చకితుణ్ణి చేసింది.

సుందరం ఎప్పుడూ అతిగా మాట్లాడడు. చిన్నగా మాట్లాడుతూ, ముక్తసరిగా ఉంటాడు. స్నేహితులంతా ''డల్ డాగ్'' అంటూండటం కద్దు.

"ఏమిటి సుందరం అంత హుషారుగా మాట్లాడుతున్నాడు'' గోపాలం తన ఆశ్చర్యాన్ని ప్రకాశం దగ్గిర వ్యక్తపరిచాడు.

ఆ మాత్రానికే శంకర్రావు ఓసారి సుందరం దగ్గిర కెళ్ళొచ్చేసి— ''గురూ, వాడు ఏళ్లేస్తున్నాడు కూడా!'' అన్నాడు.

"ఈవేళ చాలా విశేషమైన రోజు!'' అన్నాడు గోపాలం.

ఈలోగా శంకర్రావు ఖాళీ సీట్లు వెదికి—తనో సీట్లో కూర్చుని—''గురూ! ఇక్కడ ఖాళీ ఉంది—రండి!'' అంటూ చప్పట్లు కొట్టాడు. అంతే కూర్చున్నారు.

''ఏం కావాలిసార్?''

గోపాలం, ప్రకాశం ఇడ్లీలు చెప్పారు. శంకర్రావు మాత్రం ''ఇదిగో — ఇలా చూడు. పెసరట్ చెప్పు. మరీ అంత రోస్టుగా ఉండకూడదు. పచ్చి మిరపకాయలూ, అల్లం సమపాళ్ళలో తూచినట్లు పడాలి. ఒకటి రెండుల్లిపాయలు కూడా తగిలించమను. గట్టి చట్నీ తీసుకురా సుమా!'' అన్నాడు.


అంతా విని—''పెసరా ఒహటీయ్'' అంటూ అరిచాడు సర్వరు. శంకర్రావు తెల్లమొహం వేశాడు.

సుందరం బిల్లు తీసుకుని కౌంటర్ దగ్గర కెళ్తున్నాడు. గోపాలం చప్పట్లు కొట్టాడు. సుందరం వెనక్కు చూసి—''హల్లో'' అంటూ త్వర త్వరగా గోపాలం దగ్గిర కొచ్చాడు. అతని మిత్ర బృందం కూడా అతని వెనకే వచ్చారు.

''వ్వాట్—పొద్దున్నే హోటల్‌వాడి ఋణం తీర్చడానికంతా వచ్చేశావే'' అన్నాడు సుందరం.

శంకర్రావు చెప్పింది నిజమే. సుందరం నిజంగానే ఏళ్లేస్తున్నా డనుకుని గోపాలం ఓసారి

47 వ పేజీ చూడండి





కొలంబా

రచన: ప్రాస్పర్ మెరిమె

జరిగిన కథ

కర్నల్ థామస్‌నెవిల్, తన కుమార్తె లిడియాతో ఇటలీ యాత్రానంతరం ఫ్రాన్స్‌వస్తాడు లిడియా సాహసం గల యువతి చిత్రలేఖనం తెలుసు 'కార్సికా' ఫ్రాన్సు ఇటలీల దరిని గల ద్వీపం అక్కడికి వెళ్లడం కష్టనష్టాలతో కూడిన పని ఐనా లిడియా, నెవిల్‌లు నావ కాప్టెన్ మాతెతో ప్రయాణం అవుతారు. కార్సికాకు బయలుదేరారు వారితో లెఫ్టినెంట్ "ఆర్సోడెల్లా రెబ్బియా" అనే కార్సికను కూడా వచ్చాడు కర్నల్‌కి రానురాను యీ రెబ్బియాతో పరిచయం పెరుగుతుంది మూడు రోజుల ప్రయాణం తర్వాత వారి నౌక అజాచ్చియో గల్ఫ్ సమీపించింది వారు కార్సికా చేరారు పాస్‌పోర్టు ఆఫీసరు మాటలవల్ల, ఆర్సో తండ్రి హత్యకు లోనయ్యాడని మిస్ లిడియా గ్రహిస్తుంది ఇంతలో ఆర్సో చెల్లెలు కొలంబా అతన్ని వెతుక్కుంటూ అజాచ్చియోకి వస్తుంది. కర్నల్‌గారి వసతంలోనే దిగుతుంది కొలంబా, ఆర్సో ఆంటన్‌లు పియత్రనెరాకి వెళ్ళిపోతారు ప్రగావ ంలో కొలంబా బ్రాందొలాచ్చియో అనే బందిపోటు దొంగకు సహాయం చేస్తున్నట్లు ఆర్సో ఆంటన్ తెలుసుకుంటాడు అతన్నీ అతని సహచరుడినీ కూడా కలుసుకుంటాడు

(గత సంచిక తరువాయి)

"ఆరు నెలలకింద" అని చెప్పకుపోయాడు బందిపోటు "ఒర్‌జా తీరం దగ్గర షికారుకి వెళ్లాను అప్పుడు ఒక మనిషి నన్ను సమీపించి, వినయంగా టోపీ తీసేసి వంగి ఇలా అన్నాడు "ఫాదరీగారూ, మన్నించండి ఇంకొంచెం గడువు ఇవ్వండి ఏభయి అయిదు ఫ్రాంక్‌లకన్నా దొరకలేదు ఇంతకన్నా ఎక్కువ సేకరించలేకపోయానంటే నమ్మండి" నాకు ఆశ్చర్యం వేసింది 'ఏమిటోయి నువ్వు అనేది? ఏభయి అయిదు ఫ్రాంకులు ఏమిటి?' అని అడిగాను 'అరవయి అయిదు అందామనుకుని పొరబాటున చెప్పాలెండి నూరు అడిగారు, అదిమాత్రం వీలు కాదు' అని సమాధానం చెప్పాడు 'ఏమిటోయ్ ఈ హాస్యం! నిన్ను నే నడగడం ఏమిటి?? నాకేమీ అర్థం కావటం లేదు!' అన్నాను నేను అతను ఒక ఉత్తరం తీసి చూపాడు వంద ఫ్రాంకులు ఇవ్వకపోతే ఇల్లు తగలబెట్టి, ఆవులన్నీ చంపేస్తాననే బెదిరింపు కింద నా సంతకం 'జియో కాంతో కాస్త్రికోని' అని స్పష్టంగా ఉంది నా సంతకం 'ఫోర్జి' చేసే గుండెలున్నాయన్నమాట ఎవరికో!

"కాని నాకు నిజంగా కోపం వచ్చిందేమిటంటే ఉత్తరంలో భాషనిండా తప్పులే... నేను తప్పులు రాయటమా! విశ్వ విద్యాలయంలో బహుమతులు తీసుకున్నవాడిని!

"మనవాడి తల తిరిగేట్లు ఒక దెబ్బ వేశాను 'ఓహో నేనేమన్నా దొంగననుకున్నావా దొంగ వెధవా' అన్నాను. ఒక తన్ను తన్నాను. ఎక్కడో మీకు తెలిసే ఉంటుంది. కోపం తగ్గింతర్వాత మళ్ళీ అన్నాను 'ఈ డబ్బు ఎప్పుడిద్దా మనుకుంటున్నావు?' — 'ఇవాళే' 'సరే! తీసుకుపోయి ఇవ్వు'—ఒకానొక చెట్టు గుర్తుగా చెప్పి దాని దగ్గరే డబ్బు ఉంచాలని మనవాడు చెప్పాడు.

"నేను ఆ చెట్టుదగ్గరే దాక్కున్నాను పొదల్లో. ఆరు గంటలు కాచుకుని కూచున్నాను దెల్లా రెబ్బియాగారూ! అవసరమైతే మూడు దినాలు కాచుకుని కూర్చునేవాడిని. ఆఖరికి ఒక 'బాస్తియా' (ఒక ప్రదేశం) వాసి వచ్చాడు తుపాకితో కాల్చేశాను సరిగ్గా వాడితల డబ్బుమీద పడింది. 'ఒరే! నీ డబ్బు తీసుకుపో! ఇకెప్పుడూ జియో కాంతో కాస్త్రికోనిని అనుమానించక!' పాపం వాడు వణుకుతూ తన అరవయి ఆరు ఫ్రాంకులు తీసుకుని నాకు తన కృతజ్ఞతను తెలుపబోయాడు ఇంకొక తన్ను తన్ని పంపించాను."

"ఆహా! ఫాదర్!" అన్నాడు బ్రాండలాచ్చియో. "నీ తుపాకిదెబ్బ వేసే అవకాశం నాకు రాలేదే అని బాధపడుతున్నాను. తర్వాత బాగా నవ్వుకున్నావా?"

"ఆ బాస్తియా వాడి కణతకి తగి లింది తుపాకి బులెట్. ఎంత వేగంగా దూసుకునిపోయిందోగాని సీసం కరిగి పోయింది. ఇది నిజం కాదని మీరు చెప్పగలరా?"

న్యాయాన్యాయాల చర్చవదిలి, సాంకేతికమయిన విషయం గురించి వాదించే అవకాశం దొరికినందుకు సంతోషించాడు ఆర్నో. బ్రాండో ల్లాచ్చియోకి ఈ చర్చ నచ్చలేదు. సూర్యుడు అస్తమించే సమయం కావచ్చిందని హెచ్చరించాడు.

"ఆర్నఆంటన్, మాతో భోజనం చెయ్యటానికి ఇష్టపడటం లేకు న్నవ్వు! పోని కాలంబాగారు నీకోసం కాచుకుని కూర్చోకుండ యింటికి వెళ్ళిపో!" అన్నాడు. "చీకటి పడిన తర్వాత బయట తిరగటం మంచిది కాదు. అసలు తుపాకీ లేకుండా వస్తావెందుకు? ఇక్కడ చాలా చెడ్డ వాళ్ళున్నారు, జాగ్రత్త! బారిచినీలు సిద్ధం అవుతున్నారు. వినిచెంటిల్లో ఉన్నాడే పట్టి దొంగ......ఆర్లోం డుచ్చియోకి వక్రంగా పోట్లాడటమే వచ్చు... నేను చెప్పినవన్నీ గుర్తుంచుకో!"

"మీ సలహాకి కృతజ్ఞుడిని," అన్నాడు ఆర్నో "కాని 'విడదీయ వలసిన చిక్కులు' ఏమున్నాయి? ఏమయినా మాట్లాడదామని వస్తే అనవసరం అని చెప్పాను."

బందిపోటు అవహేళనగా నాలిక బుగ్గలో ఉంచాడు కాని ఏమీ అన లేదు. ఆర్నో లేచి నుంచున్నాడు.

"మీ మందుగుండుకి కృతజ్ఞతలు చెప్పలేదు," అన్నాడు బ్రాండో


35 వ పేజీ చూడండి

వివిధ ప్రాంతాల వింతలు 24

ఉన్నత భవనాల లండన్ నగరం

కొన్నాళ్ళ క్రిందటిదాకా లండన్ నగరంలో సెంట్ పాల్ కెథెడ్రల్ శిఖరం ఆకాశాన్నంటేవాటిల్లోలెక్కగా ఉండేది. తర్వాత ఈ ప్రాముఖ్యం తగ్గి పోటీ ఏర్పడే సూచనలు కన్పించాయి. ఎందుకంటే ఓ ముప్ఫై అంతస్థుల భవన నిర్మాణానికి పథకాలు తయారైనట్లు ప్రకటించారు. 366 అడుగుల ఎత్తు కెథెడ్రల్ కన్న ఇది 16 అడుగులు తక్కువగా ఉంటుంది.

ఈవిధంగా పోటీపడి ఆకాశాన్నంటేట్టు భవనాలు నిర్మించటం బ్రిటిష్ ప్రభుత్వానికి స్థానిక అధికార్లకూ కూడా సమ్మతంగా ఉండేది కాదు. కారణ మేమంటే లండన్ భవనాలన్ని తక్కువ ఎత్తులో అన్నీ ఒకే



లండన్‌లోని సెంట్‌పాల్ కెథెడ్రల్.

ఎత్తులో అందంగా ఉండాలనీ వాళ్ళ నమ్మకం. అందుకనే ఎత్తయిన కట్టడాలంటే అంతఆసక్తి చూపించేవారు కాదు. కానీ కాలం మారి పోయిందిగా! ఇప్పుడు లండన్ నగరంలో కొత్తకొత్త రీతుల్లో ఎత్తయిన కట్టడాలు విరివిగా ఏర్పడుతున్నాయి.

ఈ ముప్ఫై అంతస్థుల భవనం కట్టడ మంటే లండన్ నగరవాసులకు విడ్డూరంగా కన్పించింది. మూడున్నర ఎకరాలలో ఈ భవన నిర్మాణానికి థేమ్సు నది ఒడ్డున ప్రఖ్యాతమైన టాటె గాలరీ దగ్గర్లో స్థలం కేటాయించారు. ఇందులో ఆఫీసులు, అవే గాక, చుట్టూ మైదానంలో ఉద్యానవనం కూడా ఏర్పాటుచేసేది పథకంలో ఒక భాగం.

పురాతన సంప్రదాయాన్ని ఎటూ త్రోసి రాజన్నాం గనుక ఇంకేమిటన్నట్లు వివిధమైన భవనాలు ఆకాశాన్నంటే ఎత్తు నిర్మించాలని పలువురు పథకాలేశారు. పార్క్‌లేన్ దగ్గరగా 34 అంతస్థుల హోటలు ఒకటి, 27 అంతస్థుల నివాస భవనం ఒకటి, ఇలాంటి ఎత్తయిన కట్టడాల నిర్మాణ పథకాల్లో కొన్ని.

మొదట చెప్పిన సెంట్‌పాల్ కెథెడ్రల్ మొదటి నుంచి సరైన పోషణలేక చెడి పోయింది. ఈ అందమైన గోపురం ఛాయల్లో ఉండే వందలాది భవనాలు యుద్ధకాలంలో నాశనమైపోయాయి. అసలు ఈ చర్చి నిర్మాణం 1675లో ప్రారంభమై 1710 లో పూర్తయింది. ఈ చర్చినిండా చాలా ఎత్తయిన విగ్రహాలు, అందమైన కట్టడాలు చాలా ఉన్నాయి. ఇవన్నీ చూడ ముచ్చటగా ఉంటాయి.

ఈ చర్చిలో చారిత్రక విశేషాలు చాలా జరిగినా అన్నిటికన్న ముఖ్యమైంది డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్ (ఈయన్ని ఐరన్ డ్యూక్ అనే వారు) అంత్యక్రియలు. శవపేటికను మోసు కొచ్చిన శకటం నిండా ఆయన జయించిన తుపాకులు అవీ పేర్చి అలంకరించారట.

ఈ చర్చిలో ప్రత్యేక ఆకర్షణల్లో ఒకటి రెన్ సమాధి, రెండోది చర్చిలో భూమికి 100 అడుగుల ఎత్తున్న 'విస్పరింగ్ గ్యాలరీ' ముఖ్యమైనవి.

యుద్ధానికి పూర్వం ఈ కెథెడ్రల్ వెనుక వైపున ఆర్చిలతో అందమైన పెద్ద ద్వారం ఒకటుండేది. దాంటోనుంచి గోపురం కింద ఉన్న హాల్లోకి వెళ్లటానికి వీలయ్యేది. ఈ అలంకృత ద్వారబంధం సుమారు 500 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా నిల్చినా, ఇప్పుడు అంతా పోయి వట్టి ఆర్చి మాత్రమే మిగిలింది.

ఇందాక చెప్పిన 30 అంతస్థుల భవనం ప్రక్కనే ఉంది టాటె గ్యాలరీ. దీని శిల్పి అధునాతన కళాకోవిదుడుగా ప్రపంచ ప్రఖ్యాతి పొందాడు. సంప్రదాయిక కళకు ఆటపట్టయిన రాయల్ అకాడమీ ఎన్నికకు వచ్చే చిత్రాలన్నీ ఈ గ్యాలరీకే వస్తాయి. కాని ఏఒక్కటి కూడా ఎందుకనో గోడలకు పెట్టలేదు. అయినా ఇక్కడికి చూడవచ్చే జనమంతా నవీన చిత్రపటాలు చూడటానికే వస్తారు.

—టెంపిల్ మాలింగ్. ★

గ్రహస్థితి

పసుపు ధర పెంగుతుంది. మిర్చి ధరలో కొద్ది తగ్గుదల వస్తుంది. గోధుమల ధర మామూలుగానే ఉంటుంది. నూలు, వస్త్రాలు ధరలు ముందు పెరిగి తగ్గుతవి. వేరు శనగ పప్పు ధర తేజీ అవుతుంది.

20-9-1963 శుక్రవారము మొదలు
26-9-1963 గురువారము వరకు

మేషం:

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

మీ శక్తి, ఉత్సాహము పెరుగుతవి. మాట విలువ బాగా ఉంటుంది. ఆదాయ వ్యయములకి సంబంధించిన ఆందోళన తొలగిపోతుంది. ఇంతకు ముందు ఇతరులచేతికి పోయిన ధనము మొదలయినవి సకాలంలో తిరిగి వస్తవి. వారం మధ్యలో శారీరకంగా బలహీనత తోస్తుంది. రక్తదోషం కలుపించవచ్చు. పుణ్య స్థలాలకు వెళ్ళ గలుగుతారు. సంఘ కార్యాలలో ధన వ్యయం అధికం పిల్లలను గురించి శ్రమ పడవలసిన సమయం. విశ్రాంతి ఉందామనుకొంటారు కాని అవకాశం లభించదు. వారాంతంలో అకస్మాత్తుగా ఇతరుల మీద విసుగుదల, కోపము వస్తవి. దుర్వార్తలు తెలుస్తవి. 20, 21 తేదులలో అధికారుల ఆదరణ, దేహ బాధలు.

* * *

వృషభం:

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

ఆలోచనలకు ఎన్ని అవాంతరాలు వచ్చినా చివరకు మీ మాట ప్రకారం జరుగుతుంది. వ్యవహారంలో న్యాయం సాధించగలుగుతారు. ప్రయాణ సూచన లున్నవి. వృత్తిలో కార్యభారం ఎక్కువ అయినట్లు తోస్తుంది. క్రొత్త వ్యాపార, ఉద్యోగాది ప్రయత్నాలలో అభివృద్ధి సూచన లున్నవి. చిన్న విషయాన్ని కూడా పెద్దదిచేసి మాట్లాడే వారు ఉంటారు. వస్తువులు మొదలయినవి కొనే సందర్భాలలో జాగ్రత్తగా ఉండండి. కుటుంబంలోని సమస్యలు వెంటనే తీరకపోవచ్చు. ఆదాయమును మించిన వ్యయం కనుపిస్తుంది. ఇతరుల కార్య బాధ్యతలను ఆలోచించి పైన వేసుకొనటం అవసరం. 22, 23 తేదులలో అనారోగ్య సూచనలు, కార్యభారం అధికం.

* * *

మిధునం:

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

గౌరవప్రదమైన సమయం. వృత్తి వ్యాపారాలలో ఎదటివారిని సంతృప్తి పరచ గలుగుతారు. సంతోష వార్తలు తెలుస్తవి. అనుకోకుండా



దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

గౌరవం తెలియనివారితో ప్రసంగించవలసి వస్తుంది. అలంకార వస్తువుల వంటివి కొంటారు. ఈ సమయంలో తలచిన కార్యక్రమాలు ఎక్కువ భాగం పూర్తి అవుతవి. తీవ్రమైన ఆలోచనల వల్ల చేసే పనులలో పొరపాట్లు జరుగుతవి. అయినా చిక్కులు ఏర్పడవు. శుభ వార్తలు తెలుస్తవి. ధనాదాయం బాగుంటుంది. విద్యార్థులకి మంచి కాలం. మనస్సంతోషం లభిస్తుంది. కొత్త కార్యక్రమాలలో ప్రోత్సాహం కలుగదు. మాటలలో తొందరపడవద్దు. 21, 22 తేదులలో ఆందోళన, మిత్రలాభం.

* * *

కర్కాటకం:

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష.)

మీ ఆర్థిక స్థితి బాగుంటుంది. భాగస్థులతో కలిసి చేయు పనులు చికాకు కలుగచేస్తవి. ఆరంభించిన పని పూర్తి కాబోతున్న సమయం కొంచెం కొరత ఏర్పడుతుంది. ధన సంబంధమైన లావాదేవిలలో మృదువుగా ఉండటం అవసరం. మీ అధికారాన్ని, నిర్ణయాన్ని త్రోసిపుచ్చే ప్రయత్నాలు జరుగుతవి. కాని, పర్యవసానంలో అవతలివారు మీ దారికే వస్తారు. ఇతరులయందు జాలి పడటంవల్ల శ్రమ పడవలసిన సమయం. సాంఘిక కార్య కలాపాలలో పేరు, ప్రతిష్ఠలు వృద్ధి అవుతవి. ఎవరినీ కష్టపెట్టవలసిన అవసరం లేకుండా మీ పని నెరవేరుతుంది. గ్రంథ పఠనం మొదలయిన వాటియందు మనస్సును నిలుపలేక పోతారు. 23, 24 తేదులలో వృధాశ్రమ, బంధు విరోధం.

* * *

సింహం:

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

గౌరవం లభిస్తుంది. ధైర్యము, సంతోషము, చేతినిండా ధనము వీటికి లోపం ఉండదు. పైకి పొంగకుండా లోలోపలనే విరోధ సూచనలు కనిపిస్తు ఉంటవి. బంధువుల రాక, విలువగల వస్తువులు కొనటం వీటి నిమిత్తం ధన వ్యయం అవుతుంది. వ్యవహార రంగంలో మిమ్ములను ఇబ్బంది పెట్టేవారుంటారు. అధికారుల ఆదరం లభిస్తుంది. ఒక సందర్భంలో ఫలితం లేకపోయినా మాటను

ఈ వారము ధరలు

మిధునంలో రాహువు, కన్యలో సూర్య, బుధ, శుక్రులు, తులలో అంగారకుడు, ధనుసులో కేతువు, మకరంలో శని, మీనంలో గురువు, కన్య, తుల, వృశ్చిక, ధనుస్సులలో చంద్రుడు.

నిలబెట్టుకొంటారు. ఇతరులకు సలహా చెప్పటంలో సాధక బాధకాలను విచారించుకొనటం అవసరం. శుభ కార్య ప్రయత్నాలు చక్కగా అనుకూలిస్తవి. దూరమందున్న మిత్రులవద్దనుంచి లాభవార్తలు తెలుస్తవి. అలసట పెరుగుతుంది. 24, 25 తేదులలో సందేహాలు, కలహ ప్రసంగాలు.

* * *

కన్య:

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా.)

మన స్థిమితం తక్కువ. ఎక్కడ పొరపాటు జరుగుతుందోననే భయం కలుగుతుంది. విశేషంగా ధనం వచ్చి ఖర్చు అవుతూ ఉంటుంది. ఉద్యోగ కార్యక్రమాలు శ్రమకరంగా తోచగలవు. ధన వ్యయం చేసే సందర్భాలలో కొంచెం వెనుక ముందులు ఆలోచించటం అవసరం. మాటలలో తొందరపాటువల్ల చిక్కులను ఎదుర్కొనవలసి వస్తుంది. బంధు మిత్రులు మిమ్ములను గౌరవిస్తారు. ఎంతో మీ ఆలోచనలో ఉన్న పనులు ఈ సమయంలో పూర్తి అవుతవి. కుటుంబంలో అనారోగ్య సూచనలు ఉంటవి. ఉష్ణాధిక్యంవల్ల బాధపడతారు. అధికారులవల్ల మీరు అనుకున్నంత ఉపయోగం ఉండదు. 25, 26 తేదులలో శుభ వార్తలు, శ్రమ.

* * *

తుల:

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ, 1, 2, 3 పాదాలు)

శ్రమకరమైన కాలం. అనవసరమైన ప్రశ్నలతో బాధ పెట్టేవారుంటారు. ధైర్యము, సూక్ష్మగ్రాహణశక్తి బాగుంటవి. పెద్ద మొత్తాలలో ధనం చేతికి వస్తుంది. పోటీని ఎదుర్కొని శక్తి సామర్థ్యాలతో నిలబడవలసిన సమయం. స్థిరాస్తుల మార్పులు, వృద్ధి మొదలయిన ప్రయత్నాలు సులభంగా జరుగుతవని అనుకోవద్దు. కుటుంబ విషయాలలో మీ అభిప్రాయాన్ని సవరించుకొన గలుగుతారు. గౌరవం బాగుంటుంది. అయితే మీరు కోరుకునే విశ్రాంతి లభించదు. అకస్మాత్తుగా దేహ బాధలు ఏర్పడుతవి. 25, 26 తేదులలో భయంకరమైన మార్పులు, ధన వ్యయం.

* * *

...ృశ్చికం:

...శాఖ 4 వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

...ప్రస్తుతం మీలో కొంత విదానము, విసుగు ...ఏర్పడుతవి. ఇంతకుముందు ఆరంభించిన కలాపాలలో మార్పులు చేయవలసి ఉంటుంది. ... ఉద్యోగాలలో మీ బాధ్యతలను జాగ్రత్తగా ...ాంచగలుగుతారు. ఈ సమయంలో "దూరపు ...లు నునుపు" అనే సామెత వంటి ఆలోచ ...వస్తవి. పిల్లల ఆరోగ్యం గురించి జాగ్ర... ఉండండి. పని జరుగుతుందనే ఆశతో ...ుగా ధన వ్యయం చేయవలసిన సమయం. ...తులు ఏ సమయంలో తమ అభిప్రాయాన్ని. ...చ్చుకుంటారో తెలియదు. జాగ్రత్తగా ఉండండి. ...ంమీద సుఖం తక్కువ. 24, 25 తేదు... ధన లాభం, అధికారుల స్నేహం.

*   *   *

...నస్సు:

...ల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

ఈ సమయంలో మీరు కూడా ఒక మెట్టు ...కాని కార్యం సానుకూలంకాదు. ప్రయాణం ...రు. ఇంతకుముందు బయలుదేరిన కలతలు ...పోతవి. వ్యవహారంగంలో మీ శక్తిని వినియో...కొనగలుగుతారు. క్రొత్తవారిని కలుసు...ారు. సంఘంలో గౌరవం లభిస్తుంది. ధన ...సంలోను, వ్యవహార పత్రాలు మొదలయున ...ూలలోను ముందు యోచన అవసరం. ...కనా మన శ్శాంతి లభిస్తుంది. మంచి మాటలతోనే మీ వాద కార్యభారం మోవ గలవారుంటారు. శుభ కార్య ప్రయత్నాలు అనుకూలిస్తవి. బంధువులవల్ల నిష్ఠురం కలుగుతుంది. 23, 24 తేదులలో సంచారం, స్వల్ప లాభం.

*   *   *

మకరం:

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)

వృత్తి వ్యాపారాదులలో శ్రమ ఉంటుంది. కాని, అభివృద్ధికరమైన మార్పులు కనుపిస్తవి. ఎప్పటి కప్పుడు డబ్బుకు ఇబ్బంది కలిగేటట్లు తోస్తుంది. బంధువర్గంలో మీయందు సంతృప్తికరమైన అభిప్రాయం కలుగుతుంది. ధనాదాయం సామాన్యంగా ఉంటుంది. స్నేహితులను నమ్మిన వ్యవహారాలలో ఇబ్బంది పడతారు. వ్యవహార, వ్యాపార సంబంధమైన వప్పందాలు అనుకూలించక పోవచ్చు. కుటుంబంలో జరుగవలసిన కార్యకలాపాలు వాయిదా పడే అవకాశా లున్నవి. మానసికమైన అలసట కలుగ తగిన సమయం. కుటుంబంలోనివారి ఆరోగ్యం బాగుండదు. 22, 23 తేదులలో గౌరవం, ధర్మ కార్యాలు, ప్రయాణం.

*   *   *

కుంభం:

(ధనిష 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)


ఈ సమయంలో ఎంత ధైర్యంగా ఉంటే అంత మంచిది. పదిమందినీ ఒకదారికి తీసుకొని రాలేకపోతారు. ఉద్యోగ వృత్తులలో మంచి మార్పు కనుపిస్తుంది. సంచారం అధికం. అధికారం, మాట చలామణి, దర్పము బాగుంటవి. ఆదాయం పెద్దగా పెరుగుతుందని అనుకోవద్దు. కుటుంబంలో కలహ సూచన లున్నవి. చెయిజారిపోయిన వనుకొన్న వస్తువులు లభిస్తవి. దైవ కార్యాలు నెరవేరుతవి. బంధు మిత్రులతో ప్రసంగించే సందర్భాలలో పరస్పరము వాదించుకొనే పరిస్థితి రావచ్చు. విలువగల వస్తువులు కొనే ప్రయత్నాలు విరమించవలసి వస్తుంది. 21, 22 తేదులలో కార్యసిద్ధి, అధికారుల స్నేహం.


*   *   *

మీనం:

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)

ఈ సమయంలో దేవుడు ఓర్పును ఇస్తాడు. వృత్తిలో ఎదురుపడే సమస్యలను నిగ్రహించి నిలబడగలుగుతారు. కవ్వించి కలహాలకు పిలిచేవారుంటారు. ఏమైనా చివరకు జయం మీ ప్రక్కన ఉంటుంది. ముందుగా ప్రయత్నించినా సాధించలేని వ్యవహారాలు అనుకోకుండా పరిష్కారం అవుతవి. సంతోషవార్తలు తెలుస్తవి. ఈ సమయంలో జరుగని పనులను గురించి ఆదుర్దా పడవద్దు. సంఘ కార్యాలలో ప్రవేశించవద్దు. ఆదాయం మామూలుగా ఉంటుంది. కుటుంబంలో సుఖంగా ఉంటుంది. ఎదురు చూస్తున్న వార్తలు ఆలస్యంగా అందుతవి. తలవని తలంపుగా జరిగే సంఘటనలవల్ల ముందు ఆశ్చర్యం కలిగినా ఫలితం అనుకూలంగా ఉంటుంది. ★





జరిగిన కథ

సురేఖను, భాస్కరానికీ భాస్కరాన్ని సురేఖకు పరిచయం చేస్తుంది, పద్మావతి. భాస్కరం సవతి తల్లి జానకమ్మగారు అతన్ని కన్నబిడ్డ కంటె ఎక్కువగా ప్రేమిస్తుంది. భాస్కరానికీ; కూతురు వసంతకూ ఒకేసారి వివాహం చేయాలని ఆమె ఆరాట పడుతుంది. తత్ఫలితంగా భాస్కరాన్ని పెళ్లిచూపులకు బలవంతంగా ఒప్పించి తీసుకెళ్తుంది. పెళ్లి కూతురు సురేఖ అని తెలియగానే భాస్కరం మనస్సులో కల్లోలం చెలరేగుతుంది. సురేఖ దొడ్డమ్మ అయిన ధనమ్మకు మాత్రం భాస్కరంలో అన్నీ మంచి గుణాలే కన్పించి ఎలాగైనా భాస్కరాన్ని తన అల్లుడుగా చేసుకోవాలని పట్టుదల పెరుగుతుంది. భాస్కరం పద్మావతిని ప్రేమించడం నిజమా, కాదా అనే సందేహం కూడా సురేఖకి కలుగుతుంది. ధనమ్మకు దూరపు బంధువు ముకుందరావును వసంతకు ఇచ్చేటట్లు కూడా అప్పుడే ఏర్పాటు జరుగుతుంది. తను సురేఖను వద్దంటే ధనమ్మ తన కూతురుకే ముకుందరావును ఇచ్చి చేస్తానంటోంది. చెల్లెలి సంబంధం తన మూలంగా చెడిపోతుందని భాస్కరం; ముకుందరావుని వివాహం చేసుకుందామని కల్లో గూడా అనుకోని సురేఖకు తను భాస్కరాన్ని వద్దంటే ధనమ్మ తనను ముకుందరావు కిచ్చి చేస్తుందేమో అన్న భయంతో సురేఖా ఎటూ మాట్లాడలేకపోతారు. చివరికి భాస్కరం తన పెళ్లి ఏడాది వాయిదా వేస్తాడు. ఇంతలో యూనివర్సిటీ తెరుస్తారు. సురేఖ, పద్మ యిద్దరూ ఎం. ఏ లో చేర్తారు. భాస్కరం కూడా ఫైనలియర్ పూర్తి చేయటానికి వస్తాడు. సురేఖ అంతా చెప్పిఉంటుందని భాస్కరం అనుకొని పద్మతో ఏమీ చెప్పలేకపోతాడు. ఎగ్జిబిషన్‌లో కూడా పద్మావతిని కల్సుకొని ఎలాగైనా జరిగింది చెప్పాలని చాలా ప్రయత్నించాడు. భాస్కరం భాస్కరం స్నేహితుడు మూర్తి శైలజను ప్రేమిస్తాడు. శైలజ కూడా పద్మవతికు సురేఖకు స్నేహితురాలు. జానకమ్మగారు వసంత పెళ్లి యత్నంలో మునిగి వుంటుంది. పిక్‌నిక్‌కు వెళ్లాలనుకున్నారంతా.

35

పిక్‌నిక్‌కి వెళ్లాలనీ ఉంది పద్మావతికి వెళ్లాలనీ లేదు. అనేకానేక సుఖాలు, సంతోషాలు జీవితంలో పంచుకో వచ్చును గాని ఒక్క సుఖం మాత్రం బహు స్వార్థమైనది. దీనిని పంచుకోడం అసాధ్యం పిక్‌నిక్కే గానీ షికారే ఐనా, తనూ భాస్కరం ఉన్నప్పుడు మరొక్కరితో ఆ ఆనందాన్ని పంచుకోలేదు పద్మావతి ఈ బలహీనత నామె పదేపదే గ్రహించినా, నివారణోపాయం అసలు తెలియరావటం లేదు— తను భాస్కరాన్ని మెచ్చుకొంటూ ఉంటే సురేఖ వినాలి; కాని సురేఖను భాస్కరం గానీ, లేదా భాస్కరాన్ని సురేఖగాని మెచ్చుకుంటే సంకటంగా ఉండేది పద్మావతికి.

భాస్కరం తాను వెళ్లకపోతే చిన్నబో వచ్చును నొచ్చుకోవచ్చును లేదా మనసులోని భయం దాచుకోకూడదూ బయటకు చెప్పాలీ అంటే, "అతను సురేఖతో సర్దాగా కాలం గడపవచ్చును."

అందుకే జయమ్మగారితో 'క్లాసు వాళ్లంతా వెళ్లాలమ్మా' అని చెప్పి మరీ వెళ్లింది పద్మావతి.

జయమ్మగారు కూతురు మాష్టరీ చెయ్యాలి తాను 'నాకేమని' హాయిగా కన్ను మూయ్యాలి! అనుకునేది ఇది వరకు. ఇప్పుడిప్పుడు ఆమెకు యువ్వనంలో ఉన్న కూతురు పందలకొలదీ పడుచు వాళ్ల మధ్య నిత్యమూ తిరుగుతున్నదే— దీనికి ఒక "సంబంధం చూడ్డునా ?" అనిపిస్తోంది కూడా— కాస్త భెంగగా ఉన్నది.

కాని, తనవాళ్లు అనే వారెవరున్నారు ? సవతి కొడుకులున్నారు. వాళ్లకీ ఒక అప్పచెల్లెలున్నది. దాని సంగతే చూస్తారా ? ఈ అమ్మాయి గురించే తంటాలు పడతారా ? భర్త వంక సంబంధాలు— తనకు రావాలీ అంటే అతని తొలి భార్య సంతానమే గతి కాని వాళ్లమీద ఆమెకు నమ్మకంలేదు.

ఇక 'నా అన్న వారెవరున్నారు తనకి?'— తల్లి తనను 'ఈ జన్మకు చూడనన్నది'— అలాగే కన్నుమూసింది తండ్రి కన్నీటితో కుమిలి కృశించిన ఇల్లాలు జయమ్మ తల్లిని తిడుతూనే అంతకు ముందే కనుమూశాడు. 'ఇక ఏం చెయ్యాలి?'

జయమ్మకు కూతురి భవిష్యత్తును దాని చేతిలో పెట్టి — తదుపరి ఒక సమ్బంధం వెతకాలని ఉన్నది అందుకు ఎలా ప్రయత్నం చెయ్యాలీ అన్న విషయంలో ఆమె ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. "ప్రేమిస్తు"న్నా మనే కథలు— "ప్రేమించుకుంటున్న" సినీమాలు ఆమె చూస్తూనే ఉన్నది. కూతురు అటువంటి ప్రలోభనకు లోనవుతుందేమోనన్న భయం ఆమెకు వాల్తేరు వచ్చిన తర్వాత ఎక్కువగానే కలుగుతున్నది.

"అమ్మో ! ఏ కాలుజారినా, తల్లి చాలు; పిల్లదంటారు." అందుకే ఆమె గజగజలాడి పోతుంది.—

"జాగర్త ! సాయంకాలంవేళకి ఇల్లు చేరుకో" మని నాలుగుమార్లైనా అన్నది ఆమె. "అలాగేనమ్మా" అన్నది. పద్మావతి సహజమైన వినుగుతో.

*   *   *

అమ్మాయిల బస్సు కశింకోట వనభోజనాల తావుకు చేరేసరికి, బారెడు పొద్దెక్కింది— అప్పటి కప్పుడే ఐదారు బస్సులు, విద్యార్థులనందర్నీ దిగవిడిచి, తిరుగు ముఖం పడుతున్నాయి.

ఇన్ని వందల మందికి వనభోజనం తయారు చెయ్యాలంటే మాటలా ? లారీలమీద వంట వాళ్లని, బుట్టలుతోనూ గంపలతోనూ సంభారాలను ముందురాత్రే తరలించాల్సి వచ్చింది.

అమ్మాయిలు దిగేసరికి తోటకి పూలు పూసినట్లైంది! సంబరం ఇనుమడించింది! రకరకాల వేషాలు ఆటలు పాటలు సందడిగా ఉంది. చిన్నచిన్న జట్లుగా విడిపోయి కొందరు పేకాటలు పరిచారు.

"ఈ సమయం కోసం వాళ్లు .... వారం రోజులైంది కాచుకుని ఉన్నారు. కొందరు బాడ్మింటన్ లాంటి ఆటలకు ఆయిత్తమయ్యారు—

అక్కడి తోటలూ చెట్లూ చేమలూ, కొండలూ గుట్టలూ అన్నీ వీళ్ల సొంత ఆవిష్కరణమే ఐనట్లుంది ఆనందం.

ఉప్మాలు కాఫీలు వడ్డించడమైంది. తిన్నది తిన్నారు త్రాగింది త్రాగారు— పారేశారు.

వీళ్ల సందడికి ఉడుతలు బెదిరిపోయాయి— ఉన్న కొన్ని పిట్టలూ చెదిరిపోయాయ్ !

మూర్తీ భాస్కరం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు — శైలజా సురేఖా పద్మావతీ వస్తున్నారా ? లేదా ? అని—

"థాంక్ గాడ్ ! శైలజ వచ్చింది" మూర్తికి మహానందంగా ఉంది.

"నాకు చెప్పరా, థాంక్స్! పద్మావతి అండ్ సురేఖా ఆరాల్సోదేర్" ఒక్క చరుపు చరిచాడు భాస్కరం మిత్రుణ్ణి.

"అబ్బ! నేనేం కీచకుణ్ణి కామరా! శైలజా ప్రియుణ్ణి...."

"నీ మొహం......భృత్యుణ్ణి అనూ"

మిత్రులిద్దరూ నవ్వుతూ గబగబా అమ్మాయిలు వస్తూంటే ఎదురు వెళ్ళారు.

పద్మావతి పరిస్థితి ఫలానీ విధంగా ఉందీ అనడానికీ వీల్లేదు. కోపంగా ఉంది తనకి—ఎవరిమీదో తెలియదు—సంతోషంగానూ ఉంది—బహుశా స్వేచ్ఛగా ఉంది గనుకనేమో !....

"మీరు ఉప్మాలు తినరూ ?" పలకరించాడు భాస్కరం.

"ఎందుకుతినం తింటాం గాని మాకు మీరు మిగిల్చారా ?" సురేఖ అడిగింది.


మూర్తి నవ్వాడు.

"ఎంతమాట ! మీకోసరం మేం అది తినము కూడాలేదు...."

"సరే ! పదండి ఏ చెట్టు క్రింద వడ్డిస్తున్నారో మార్గం చెయ్యండి...."

పద్మావతి భాస్కరాన్ని కోపంగా చూసినా, మాటలో మాత్రం సరదాతనం ఉన్నది.

39 వ పేజీ చూడండి





తీర్థయాత్ర

మరాఠీమూలం
శ్రీ వెంకటేశ్ మడ్గూల్కర్
అనువాదం
చంద్రమౌళి

అర్జునుడి పని అయిపోయినట్లనిపించింది. ఇప్పుడిప్పుడే అంతా తెలిసిపోవటం మొదలైంది. అందుకనే అతనిలో ఉదాసీనత వ్యాపించింది. అతనిలో కలిగిన ఈ మార్పు ప్రపంచం పట్ల విశ్వాసంతో చూడసాగింది. ఇంట్లో ఏమున్నది ? ఏదిలేదు అనే విచారణ అతనిప్పుడు చేయటం లేదు ముసలాడి మాట ఎవరు లక్ష్యం చేస్తారులే అన్నట్లు— ఇప్పుడు సణగడంలేదు. ఎక్కువగా ఎవరితోటీ మాట్లాడటమూలేదు. ఇంట్లో చీకటిగా ఉన్నమూల చేతులు ముడుచు కూర్చుని ఏదో ఆలోచిస్తూ ఉండటం అలవాటయి పోయింది. కోడలు ఏది పెడితే అది తినటం— కాగా మనుమల వీపుమీద చేత్తో రాస్తూ కూర్చోవటం —ఇదీ పని.

అర్జునుని కొడుకూ, కోడలూ మంచివాళ్లనే చెప్పాలి. ముసలివాడిని విసుక్కుని, కసురుకొనే వాళ్లుకాదు. చేతనైనంతలో అతన్ని సుఖ పెడుతూనే ఉన్నారు. ఐనా అర్జునుడు ఉదాసీనత వదలలేదు. ఈ ప్రపంచంమీద, పిల్లా జెల్లా మీద, అదృష్టం మీద అతని కిప్పుడు మక్కువ లేదు. మాయాజాలంలో కట్టుపడి, జారిపోతూ చూస్తూ ఉండి పోయాడు. ఏమిటోగా అనిపిస్తున్నది గతం. జీవిత కాలమంతా పొట్టకోసం కష్టపడ్డాడు. ప్రేలెడు ఆ తిత్తి నింపటానికి అడ్డమైన పనులూ చేశాడు. నిందలు మోపాడు. అవినీతి పనులు చేశాడు. తిట్లు తిట్టాడు. చెడును మంచిగా వర్ణించాడు. మంచిని చెడుగా రచించాడు. కాని జ్ఞానము కలిగి మనసు క్షుభితమైపోయింది. అతని కాలేయము కుతాకుతలమైనది.

ఇప్పుడు కూర్చుంటూ, లేస్తూ 'హరి— హరి' అనటం అలవాటయింది. గుళ్ళో 'హరి విజయం' పురాణ కాలక్షేపం జరుగుతున్నది. చీకటి పడగానే రెండు మెతుకులు నోట్లో వేసుకుని కుని అర్జునుడు, కంబళి కప్పుకుని గుడి ముంగిట దుమ్ములో కూర్చుంటాడు. ధ్యానంగా పురాణం వింటాడు. మాష్టారుగారు చెప్పే నీతి, అతనికి నచ్చేది ! ఈ దేహము కేవలము మట్టి కుండ దానిమీద శ్రద్ధ చూపటం కానీ, అలంకరించటంగానీ వృధా. ఈ సంసారమే మిథ్య దాని వెనకాలబడి జీవిత కాలాన్ని వృధా చేసుకో కూడదు. అన్నిటికన్న 'హరి'నామమే సత్యము. హరినామ స్మరణకన్న వేరే మార్గములేదు.— పుస్తకం చదివి చెప్పే మాష్టారుగారి మాటలు అర్జునికి వచ్చినవి. వంటరిగా కూర్చుని హరినామ స్మరణ చేశాడు కూడాను.

"రూపము చూడగనె కన్నులు,
ఆనందము కలిగెనె సఖీ—"

అనే జ్ఞానోబా వ్రాసిన అభంగ్ పాడుతుంటే అతని హృదయములో అలలు అలలుగా భక్తి భావం చెలరేగేది. ముడతలు పడిన బుగ్గలమీద నుంచి జారుతున్న నీటి బిందువులను తుడిచివేసుకుంటూ— ఇక ఒకసారి పండరి పోయిరావాలి. చంద్ర భాగా నదిలో మలినమైన ఈ దేహాన్ని ముంచాలి. 'సంత్' జనులకాళ్లు పట్టుకోవాలి. మనస్సు తృప్తి పొందేటంత వరకూ తాళాల నాదమూ భజన, మృదంగ స్వరమూ వినాలి. పాండురంగని నామమూ వినాలి. ఎవరివల్ల పిండం నాశనమైందో ఆహారిని తన దగ్గరికి రప్పించుకున్న ఆ చోఖా సమాధి చూడాలి. రాతిమెట్టులాగా నీ ద్వారం దగ్గర వాసం చేస్తానన్న— నామదేవుడు ఏ మెట్టుమీద కాపున్నాడో ఆ మెట్టుమీద తులసీ మాల పెట్టాలి. క్రిందపడి భక్తితో దొర్లాలి. సుందరమైన ఆ ధ్యానము కన్నురాల చూడాలి నల్లని ఆ శ్రీరూపం పాదాలమీద తలనుంచాలి. రంగశిలమీద నాట్యం చేయాలి. గుడిలో నిల్చుని అహోరాత్రులూ విఠోబా నామస్మరణ చేయాలనిపించింది.

అందుకనే ఒక రోజు రాత్రి కొడుకుతో అన్నాడు. "ఒరే నేను పండరి యెళ్తాను. ఒకసారి భగమంతుడ్ని చూడాలనిపిస్తుంది''— కొడుకు వూళ్ళో అడుక్కుని కవళం తీసుకొచ్చాడు. తలపాగా తీసి నేలమీద కూర్చుని చిన్న పిల్లాడిని తగ్గరకు తీసుకొన్నాడు. వాడు తండ్రిమీసాలు లాగుతున్నాడు. తండ్రి చెప్పిన మాటలు విని తన కొడుకుని వళ్ళోకి తీసుకుని ముద్దు పెట్టుకుంటూ— "ఈ నిర్బల శరీరంతో ఎలా ఎళ్తావ్? నడవలేవు—" అన్నాడు. కోడలు చిన్నవాడికి పాలిస్తున్నది.

"ఇంత ఆలస్యంగా చెబుతున్నారే ? తీర్థానికి వెళ్ళేవాళ్ళు చాలామంది మన వూరివాళ్ళు ఎప్పుడో వెళ్ళిపోయారు. ఇక తోడెవరున్నారు ? ఒక్కరే ఎలా వెళ్తారు ?" అన్నది. అర్జునిడికి బాగా వినపడలేదు. చెవిదగ్గర చేయి పెట్టుకొని కొడుకు దగ్గరగా జరిగాడు.

"ఏమంటున్నార్రా ?"

కొడుకు గొంతుపెద్దదిచేసి ముసలాడి చెవి దగ్గర నోరుపెట్టి అరిచాడు—" "యాత్రకెళ్లే అందరూ వెళ్లిపోయారు. ఇక తోడెవ్వరున్నారు— ? వోపిక లేకుండా ఎలా వెళ్తావు నడిచి ?"

కోడలు మళ్ళీ అన్నది— "తీర్థం రోజుల్లో తొక్కిడిగా ఉంటుంది. రోగమూ రొష్టూ ఉంటయ్. గవర్నమెంటు ఉద్యోగులుంటారు. చేతుల్లో సూదులు పొడుస్తారు. ధాటీ చేస్తారు. ముసలి వాళ్ళు తట్టుకోలేరు. అక్కడ—" నేలమీద చెయ్యి ఆనిస్తూ కొడుకు వంక చూస్తూ అర్జునుడు అన్నాడు "అరే యెళ్తారా— పడుతూ లేస్తూ— నా కాళ్ళకి బలం ఆ యిటోబాయే యిత్తాడు" అప్పుడు కోడలు అన్నది "ఆ— ఇటోబా ఇత్తాడు బలం. దోవలో పడానికి పోమంటే చాలు— ఏమైనా ముసలితనంకదా ?" అర్జునుడు నేలవంక

చూస్తూ మాట్లాడలేదు. కొడుక్కు కష్టం తోచింది. పెళ్ళాం వంక చూస్తూ తండ్రితో అన్నాడు. "నీకు వెళ్ళాల నుంటే వెళ్ళవుగానిలే. కాని నడిచిమటుకు వద్దు. బస్సులో వెళ్ళు—" అర్జునుడు కళ్ళు మూసుకుని తల అడ్డంగా తిప్పాడు.

"నేను బస్సులో యెళ్ళేదిలేదు — ఇక్కడ మనం సిరితో తూగుతున్నాం— డబ్బు ఖర్చుపెట్టుకొని బస్సులో యెళ్ళేదిలేదు—" ఎవరూ మాట్లాడలేదు. కోడలూ మాట్లాడ లేదు కొడుకు పిల్లాడి చెవిలో 'కుర్ కుర్' మని వాడిని నవ్వించాడు. పిల్లాడు చక్కిలిగింతకు ఎగిరెగిరి నవ్వుతూ కాళ్ళు నేలకు రాస్తూంటే కోడలు కూడా కౌతుకంతో చూస్తూ ఉండి పోయింది. అర్జునుడు వంటిమీద ఉత్తరీయాన్ని గుండ్రడగా చుడుతూ సర్దుకు కూర్చుని— "నాకు తెలుసు. మీకు నచ్చకపోతే మాట్లాడనే మాట్లా డరు. సంబంధ లేనట్లు—"

కాళ్ళు దగ్గరికి తీసుకుని కూర్చున్నాడు. కొడుక్కు కష్టమనిపించింది. ముసలితనంలో తన తండ్రి కోరిక తను తీర్చకపోతే ఆయన ఆత్మ కొట్టుకుంటు దనే శంక కలిగింది. అందుకని భార్యతో అన్నాడు —"ఆయన్ని పోనీరాదూ — ముసలితనం దేవుడి మీద భక్తి సర్వైన సంగతే. ఆయన మనసు ఈ లోకంలో లేదలేదు. చివరి రోజుల్లోనన్నా భగవంతుడిని చూడనీ—" మొగుడి మాటకు వత్తాసుకోసమన్నట్లు ఆమె అన్నది. "వెళ్ళమని రాదూ పాపం ! నేనెక్కడ వద్దంటున్నాను. అం దరూ అంటున్నారూ ఇప్పుడు మనల్ని కూడా దేవాలయంలోనికి రానిస్తున్నారట. 'ఇటుబా' కాళ్ళమీద తలపెట్టుకోవచ్చుట—" భార్యకూడా ఒప్పుకోగానే కొడుకు తండ్రి చెవిలో అరిచాడు. "వెళ్ళయ్యా! మాకేం అయిష్టంలేదు — తీర్థం రోజులుగా— దోవలో ఎవరో ఒకరు తోడు దొరక్క పోరు — యాత్రికులు రద్దీ ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది—"

"వెళ్ళిరా మామా ! చాలామంది మన వాళ్ళు —చనిపోయిన వాళ్ళు ఇంతకు ముందు వెళ్ళి దర్శనం చేసుకు వచ్చారంటారు—"

"వ్వ ! వ్వ ! ఆ తుకారామ్, హరిజనుడు గర్భ గుడిలోకి పోయి భగవంతుడి పాదాలమీద తల పెట్టి వచ్చాడు. గాంధీ తాత రాజ్యంలో ఇంక ఛండాలుడు కూడా గర్భగుడిలోకి వెళ్ళాడు. ఆ పుణ్యపురుషుడు గాంధీ తాత మన వాళ్ళకి దేవ దర్శనం కలిగించాడు.

"మునుపు మనవాళ్ళ నీడ కూడా ఇంకోళ్ళ మీద పడటానికి వీలుండేదికాదు. త్రోవలో ఉమ్మి వేయటాని కాస్కారముండేదా ? మెడకు 'లోటా' కట్టుకుని దాంటో ఉయ్యాల్సిందే గాని ఆ రోజులు వెళ్ళి పోయినై. హరిజనుల వనవాసం పూర్త యింది."

"అవును— పూర్తయింది. మామగారూ మీరు వెళ్ళండి వెళ్ళి 'ఇటుబా'ను చూచిరండి—"

కొడుకూ, కోడలూ, అలా అనటంతో అర్జు నుడి మనసు తేలిక పడింది. తుకారామ్ మాది రిగా తను కూడా దేవుని పాదాలమీద తలబెట్టు కోవచ్చనేది సంతోషం కలిగించింది. కొడుకు మంచితనాన్ని తలుచుకొని ఎక్కడలేని వాత్సల్యము పొంగి పొరలింది. మనుమరాల్ని దగ్గరకు లాక్కొని, ఒకటే ముద్దుల వర్షం కురిపించాడు. తాత మీసాలను, పెరిగిపోయిన గడ్డాన్ని ఆడిస్తూ బుగ్గలుపై చిన్నారి చేతులలో మనవరాలు వ్రాయటం మొదలుపెట్టింది.

ముసలాడి తీర్థయాత్రకు ఏర్పాట్లు జరిగినై. కోడలు— మామ ధోవతి ఉతికి మకిలి పోగొట్టింది. కొడుకు చిరిగి పోయిన చెప్పులు మాదిగ వాని దగ్గర కుట్టించుకు వచ్చాడు. ఎనిమిది లావుపాటి జొన్న రొట్టెలు కోడలు చేసిచ్చింది. వాటి మధ్యలో మిరపకారం, ఉల్లిపాయలు వేసి దుత్తికట్టింది. నడుముకు ఉత్తరీయం కట్టుకుని, గొంగళి భుజంమీద వేసుకుని పండరికి బయలు దేరాడు. కొడుకు అతనికి ఎనిమిది తొమ్మిదిదణాల చిల్లర ఖర్చుల కిచ్చాడు.

'తేపతేపకు వెళ్ళొస్తారా వెళ్ళొస్తారా' అంటూ ఇంట్లోనే అటు ఇటూ తిరగసాగాడు. మనసులో ఎంత ప్రయత్నించినా అర్జునుడుకి ఇంట్లో నుంచి బయట కడుగు పడలేదు. విస్మయంతో, మన మడు వచ్చి అతని ఉత్తరీయం క్రిందకు లాగుతూ "నాకు బటాణీలు— మిఠాయి తెచ్చిపెడతావుగా తాత ?" అంటే. ముసలాడు— "హ తెచ్చిపెడ తాను నా బిడ్డకు—" అన్నాడు. మళ్ళీ కొడుకు కోడలుతో అన్నాడు.

"వీళ్ళని జాగ్రత్త త్వరలోనే నేను తిరిగి వస్తాను—"

కోడలు అన్నది. "మంచిది. ఇక బయలు దేరండి ఎండెక్కక ముందే ఎంత నడిస్తే అంత మంచిది—"

భుజంమీదున్న గొంగళి అంచులు చంక క్రిందకు లాక్కుంటూ అర్జునుడు బయలు దేరాడు. మూటలో కట్టిన చెప్పులుజత బయటకు లాగి వూరు బయటకు వచ్చాడు. కొడుకు వూరి బయటగేటుదాకా పంపించటానికి వచ్చాడు. అక్కడికి వచ్చాక అన్నాడు "త్వరగా తిరిగిరా. దర్శనం చేసుకుని. జాగ్రత్తగా వెళ్ళు. రొట్టెలు బిగిసిపోయి తినటానికి వీలుకాకపోతే ఏదో హోటల్లో కొనుక్కుతిని— ఇంకా డబ్బివ్వనా ?

"వద్దు— వద్దు — నాదగ్గరుంది." కొడుకు వెనక్కి తిరిగిగాడు. ముసలాడు నడవటం మొద లెట్టాడు. అర్జునుడు— హరిజనుడు పండరి దారి పట్టాడు.

కొంత దూరం మంచిరోడ్డుమీదా కొంత లెక్క కాలిబాటన నడవాలి. అలిసిపోయినట్లని పిస్తే త్రోవ ప్రక్కనేదో చెట్టుచూచుకుని దాని నీడలో అలసట తీర్చుకోవటం— మళ్ళీ త్రోవ పట్టడం. బాటసారులతో నాలుగు మాట్లాడుతూ తొందర తొందరగా నడిచి పోవటం రాత్రయే సమయానికే వూరు చేరటం— ధర్మశాలలో మూట పడేయటం— రొట్టె తినటం— గొంగళి పరచుకుని దానిమీద పడుకోవటం. తెల్ల వారు జామున చుక్క పొడవగానే మళ్ళీ బయలు దేరటం అర్జునుడు తెల్లవారేటప్పటికి యాత్ర పూర్తిచేసి ఆ పుణ్య నగరానికి చేరాడు.

సుఖాల పేటికయైన పండరి ధన్యురాలు. ఈ పండరికి క్రితం, ఎంతమంది స్వాములు వచ్చి వెళ్ళారు. ఎంత మంది పాదాలు ఈ పుణ్యభూమి తొక్కనది. యోగులలో రాజులాటి జ్ఞానదేవుడు, ఆయన గురు పరాత్పరునితో నివృత్తి; ఆ మెట్లు. ఇటు ముక్తాబాయి— ఆ భోలానాముడు అతని దాసి జనీ. దేహుకు చెందిన పిచ్చివాడు. అరభెండీ నుంచీ వచ్చినవూరి, తెరఢోకి నుంచి వచ్చిం కుమ్మరి మంచి—పంచముడు. ఈ పండరిధన్యం అయినది. స్వాముల చెబుతారు

"చరాచరములు ఎప్పుడు లేవో— అప్పుడు కూడా ఉన్నది పండరిపురము—" అలాటి పం డరిపురం ప్రవేశించగానే అర్జునుడు వ్యాకులత అంతమొందింది. చంద్ర భాగావది కనుపించగానే రెండుచేతులూ యెత్తి దండం పెడుతూ 'పుండరీక వరదాహరి విఠల్' అని అరిచాడు. చంద్రభాగా నదీతీరంలో.

ఇసుకమీద వైష్ణవుల ఉత్సవము జరుగు తున్నది. చాలా మంది భక్తులు చేరి ఉన్నారు. ఆడ మగా, ఉచ్ఛులు, నీచులు పిన్నలూ పెద్దలూ అందరూ చంద్రభాగానదీ నిర్మల జలాలలో తమ పాతకాలు కడిగి వేసుకుంటున్నారు. 'హరివోం — హరివోం—' అంటూ మునకలు వేస్తున్నారు. ఆ దృశ్యం చూచి అర్జునుడు ఉత్సాహంతో ఉప్పొంగి పోయాడు. ఇసుకలో కాళ్ళు ఇరుకయి పోవటంతో ఆగిపోయి ఆ ఉత్సవం వంక చూస్తూ ఉండి పోయాడు. ఏకా ఏకీ అతని కనిపించింది. తను కూడా వాళ్ళల్లో ఆ రద్దీలో కలిసిపోయి — నీళ్ళల్లో మునగాలని పావనుడు కావాలని, నిర్మ లుడు కావాలని. ఆభావం కలుగగానే భుజంమీద మూట సర్దుకుని కాళ్ళు ఇసుకలో నుంచి లాక్కుని ప్రవాహం దగ్గరగా సన్నాటంగా వెళ్ళాడు. కాని రద్దీ ఎక్కువై ఇరుకున పడ్డాడు. స్నానానికి దిగిన వాళ్ళు మంచి - మంచి బట్టలు కట్టుకుని తిరిగి వస్తున్నారు. వాళ్ళని తను తాకుతానేమోననే భావం కలుగగానే తాబేలులా ముడుచుకు పోయాడు అర్జునుడు. ప్రక్కకు తప్పుకున్నాడు. ఈ పెద్దల సమూహంలో జొర బడి తను స్నానం ఎలా చేయగలడు ? వాళ్ళ శరీ రాల మీద అమంగళకరమైన తన శరీరం తాలూకా నీళ్ళు చింది వాళ్ళు మైల పడ్తారు. అందుకని తానిక్కడ స్నానం చేయడు. ఇంకా బాగా క్రిందకు పోయి చేస్తాడు. గోపాల్ ఘాట్ దగ్గరగా పోవాలి. పంచముడు అర్జునుడు ఇంకా క్రిందికి, క్రిం దికి పోయాడు

ఆ మంగళకరమైన తన శరీరం మీద మంచి నీళ్ళు చింది ఇంకెవరి శరీరం మీదా పడవనే నమ్మకంగానే, మూట క్రింద బెట్టాడు. ఉత్త

41వ పేజీ చూడండి

రామారావు 'ఎ' సెక్షన్ నించి 'సి'కి మారాడు 'ఎ' సెక్షన్ క్రికెట్ కాప్టెన్ అతని దగ్గరకొచ్చి "రామం, నేను నీకు నేర్పిన చిట్కాలన్నీ మర్చిపో!" అన్నాడు.

సుబ్బారావు (అమలాపురం)





★ ఇటీవల మంచి నటనకు యీ అమ్మాయి పేరు వినవస్తున్నది 'ఆజ్ ఔర్ కల్' చిత్రంలో వందా.



వ్యక్తిత్వం

విడిదిలోకి ప్రవేశించగానే, స్నేహితుల మధ్య కూచుని తాను నవ్వుతూ తనవారిని నవ్విస్తూ ఏదో మాట్లాడుతున్న వరుడు శ్యామసుందరం. మాట్లాడడం ఆపి, లేచి నా కెదురువచ్చి 'రండి, రండి' అంటూ నాకు స్వాగతం పలకడం చూసి నా కెంతో ముచ్చటేసింది. అందానికి అందమూ, మాట తీరుకు తోడు మన్ననా తెలిసిన మంచితనమూ ఉన్న అతనిని చూసి, కళ్యాణిచాలా అదృష్టవంతురా లనుకున్నాను.

"రండి మాష్టారూ!" అంటూ కలెక్టరుగా చేస్తున్న శ్యామసుందరం నన్ను తన స్నేహితుల దగ్గరకు తీసుకుపోయి "వీరు కృష్ణమూర్తిగారు కాలేజీలో, అదే, మా మామగారు ప్రిన్సిపాలుగా ఉన్న కాలేజీలోనే ఇంగ్లీషు లెక్చరరుగా పనిచేస్తున్నారు" అంటూ నన్ను పరిచయం చేసాడు. నన్ను పరి

కొండముది శ్రీరామచంద్రమూర్తి

చయం చేసింతర్వాత, "మాస్టారూ! మా స్నేహితులను కూడా పరిచయం చేయనీండి మీకు." అంటూ సన్నగా నవ్వి "వీరు రెవిన్యూబోర్డు మొదటి మెంబరు నీలకంఠన్‌గారు. వీరు మ్యునిసిపల్ కమీషనర్ ప్రేమ్‌చంద్‌గారు. వీరు డిప్యూటీ డైరెక్టరు కామేశంగారు" అంటూ ఒక్కరొక్కర్నే పరిచయంచేశాడు.

శ్యామసుందరం నా చేతులను తన చేతుల్లోకి తీసుకుంటూ "ఇంకొకర్ని పరిచయం చేయాలి మాష్టారూ! మిస్టర్ జేమ్స్, ఇలా రండి. వీరు సుప్రసిద్ధ కళా విమర్శకులు. పత్రికల్లో ఆర్ట్ మీద వీరి వ్యాసాలూ అవీ మీరు చూసే ఉంటారు. మేమిద్దరం చిన్నప్పుడు ఒకచోట చదువుకున్నాం." అంటూ తెల్లగా, పొడుగ్గా ఉండి, నోట్లో పైప్ పెట్టుకొని, దూరంగా కన్పిస్తున్న కొండలవేపూ, పైన పరుగెత్తుతున్న మబ్బులవేపూ చూస్తున్న ఒక లావుపాటి మనిషిని నాకు పరిచయం చేశాడు. నిజానికి నాకు కళను గురించి ఏమీ తెలీకపోయినా, ఆయన పేరు ఎప్పుడూ వినకపోయినా, అంతమంది పెద్ద మనుషుల ముందు వెలితిపడడం ఇష్టంలేక, నా తెలియనితనాన్ని చిరునవ్వుతో కప్పేసి ఆయనతో గాఢంగా కరచాలనం చేసాను.

ఆ తర్వాత ఆయన నావేపు తిరిగి "ఇంత అందమైన దేశాన్ని ఇరవై సంవత్సరాల క్రితం వొదిలి పెట్టాను" అన్నాడు.

"పోనీలెండి. శ్యామసుందరంగారి వివాహం మూలంగా నైనా మళ్లీ వచ్చారు" అన్నాను, ఏదో ఒకటి మాట్లాడకపోతే బావుండదని.

"నో. నో. ఐయామ్ వెరీ అన్‌లకీ. నేను చాలా దురదృష్టవంతుణ్ణండీ! ఇప్పుడే బొంబాయి నుంచి వార్త వచ్చింది. అమ్మగారికేం బావుండ లేదట. శ్యామసుందరంగారి కారులో మద్రాసు వెళ్లి, అక్కణ్ణుంచి విమానంలో బొంబాయి వెళ్లిపోతాను."

"అయితే పెళ్లికి ఉండరన్నమాట."

అక్కడ కూచున్న డిప్యూటీ డైరెక్టరుగారు, నా ప్రశ్న విని కొంచెం నిష్ఠూరంగా "అయినా అర్ధరాత్రి ముహూర్తాలు తప్ప మరేవీ దొరకలేదుటండీ మీకు." అన్నాడు, అని తన హాస్యాన్నికి తనే బిగ్గరగా నవ్వాడు. మిగిలినవాళ్లందరూ జేమ్స్‌ను గురించి ఆలోచిస్తున్నారులా ఉంది, నవ్వడానికి కనీసం ప్రయత్నమైనా చెయ్యలేదు. అంతవరకూ నవ్వులతో కళకళలాడుతూ ఉన్న వాతావరణమంతా ఆ ను కో కుం డా మారిపోయింది. ఉన్నట్టుండి జేమ్స్ ఆ నిశ్శబ్దాన్ని భంగపరచాడు.

"ఇన్ని సంవత్సరాల తర్వాత శ్యామసుందరాన్ని కలుసుకున్నాను. పెళ్లికి వచ్చినట్టుగా ఆ టెండన్ను కూడా వేయించుకున్నాను. మిసెస్ శ్యామసుందరాన్ని కూడా చూసి, వధూవరు లిద్దరూ ఒకచోట నుంచుని వుండగా, నే తెచ్చిన ప్రెజెంట్‌ని వారి కిచ్చేస్తే ఆ తర్వాత, అవును—ముహూర్తానికి ఉండకపోతేనే అన్న బాధ నాకు ఉండదు. అతని గొంతులో ఉన్న తీవ్రత మమ్మల్లందర్నీ వణికించింది. శ్యామసుందరం మొహం గంభీరమైంది. మిగిలినవారంతా కూడా ఆలోచనలో పడ్డారు.

"కృష్ణమూర్తిగారూ!"

నేను ఉలిక్కిపడ్డాను. వరుడు శ్యామసుందరం నా కళ్లవేపే చూస్తూ మాట్లాడుతున్నాడు. "మీరు వెళ్లి కళ్యాణి నిక్కడికి తీసుకురండి. జేమ్స్ అసంతృప్తితో వెళ్లిపోతే, నాకు చాలా బాధ కలుగుతుంది."

ఈ మాటలు వినగానే విషాదంగా ఉన్న జేమ్స్ మొహంలోకి ఒక్కసారిగా కళ వచ్చింది. కుర్చీలో కూర్చున్నవాడల్లా లేచివచ్చి నా చేతులు పట్టుకున్నాడు. "ప్లీజ్! అట్లా చేయండి. నాకు టైమూ కలిసొస్తుంది. మనసుకు తృప్తిగా ఇక్కడనుంచి వెళతాను."

రెవిన్యూబోర్డు మొదటి మెంబరు నీలకంఠన్ గారు తలాడించారు. మ్యునిసిపల్ కమీషనర్ ప్రేమ్‌చంద్‌గారు నావేపు ఆత్రుతతో చూశారు. నేను జవాబు చెప్పటానికి తటపటాయిస్తున్నాను. కలెక్టరు శ్యామసుందరం నా సందేహాన్ని గుర్తించాడు. "ఈపని మీరు చేయాలి. తప్పదు మాష్టారూ. వెళ్లిరండి" అన్నాడు. కలెక్టరు శ్యామసుందరం కంఠంలో ఉన్న ఆజ్ఞ నన్ను విచలితుణ్ణి చేసింది. పదిహేనేళ్లుగా చేస్తున్న నా అధ్యాపకత్వ దర్పమంతా అతనిముందు వెలవెలబోగా, మౌనంగా తల వూపి, ఆ విడిదిలో నుండి బయట పడ్డాను.

నామీద చాలా తమాషా అయిన భారమే మోపబడ్డది. దీన్ని ఎలా విజయవంతం చేయడమో ఆలోచన సాగడంలేదు.

2

"ఇదమ్మా అసలు విషయం" అంటూ సంగతంతా వివరించిం తర్వాత, నా ప్రయత్నం విజయవంత మవుతుందో కాదో అన్న సందేహంతో ఆమె మొహంలోకే పరీక్షగా చూడసాగాను. ఆమె నొసటన దిద్దిన కళ్యాణ తిలకమూ, బుగ్గన పెట్టిన చాదు చుక్కా ఆ నీరెండలో నూత్న సోయగాలను సంతరించుకొంటున్నాయి. మల్లెపూల వాలుజడ వేసుకుని, కాళ్లకు పారాణితో, క్రొత్త చీర కట్టుకుని నా ఎదుట నిలబడ్డ నా విద్యార్థిని కళ్యాణి నా అవస్థ చూసి జాలిపడినట్లుగా సన్నని చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వుతో కొండంత ధైర్యంతో "అయితే ఒప్పుకున్నట్టే కద కళ్యాణీ?" అని మళ్లీ అడిగాను. కళ్యాణి నావేపు చూసి అన్నది. "మీరు చెప్పిన మాటను నేను ఎప్పుడు కాదన్నాను మాష్టారూ! ఎప్పుడూ మీరు నా శ్రేయస్సునే కోరుతూంటారని నాకు తెలుసు."

నేను బరువుగా నిట్టూర్చాను. "చదువుకున్న దానివి. పరిస్థితి నర్థంచేసుకున్నదానివి తల్లీ!" అని కొంచెంసేపు ఆగి "మరి బయల్దేరుదామా అమ్మా?" అని అడిగాను.

కళ్యాణి లోపలకు వెళ్లి ఒకటి, రెండు నిమిషాల్లో తయారై బయటకు వచ్చింది. నేనూ, నవవధువు కళ్యాణి గుమ్మం దాటబోతున్నాం. అక్కడే ఆరుబయట పడక కుర్చీలో పడుకుని ఉన్నారు కన్యాదాత, ప్రిన్సిపాల్ రాజశేఖరంగారు. ఎప్పుడో అర్ధరాత్రి ముహూర్తం కావడంతో ఆత్రుత కన్పరచని ఆడ పెళ్లివారి ఇల్లులాగా ప్రశాంతంగా, ఆలోచనారహితంగా ఉన్నది ఆయన హృదయం.

పెండ్లికూతురు కళ్యాణి, ఆమె వెంట నేనూ హడావిడిగా బయల్దేరడం చూసి చకితులయ్యారాయన. తర్జనితోనే నన్ను నిర్దేశిస్తూ అడిగారు.

"ఇదేమిటోయ్! అసుర సంధ్యావేళ అమ్మాయెక్కడికి బయల్దేరిందీ?" ఆయనకు నన్ను ఏమోయ్ అని పిలవడమే అలవాటు, ఆయన దగ్గర చదువుకున్నాన్నేను. ఆతర్వాత ఆయన ప్రిన్సిపాలుగా పనిచేస్తున్న కాలేజీలోనే లెక్చరరుగా ఉద్యోగం దొరికింది. ఆయన దగ్గర నేను చదువుకున్నట్లే, మళ్లీ కళ్యాణి నా దగ్గర 'ఎడ్వాన్సుడు ఇంగ్లీషు' తో బి. ఏ. చదువుకుంది. ఆయనమీద నాకు పితృవాత్సల్యమున్నట్లే, నా మీదా కళ్యాణికి అంతటి వాత్సల్యమూ ఉంది.

"అల్లుడుగారొకసారి అమ్మాయి నక్కడకు తీసుకురమ్మన్నారండి. వారి స్నేహితుల కొకరికి 'ఇంట్రడ్యూస్' చేయాలట.

ఈమాట నే నింకాపూర్తన్నా చేయలేదు. ప్రిన్సిపాలుగారి కళ్లు ఎర్రబడడం నేను గమనించాను.

"కళ్యాణి, నువ్వు లోపలకు వెళ్లు" అన్నారాయన గంభీరంగా.

కళ్యాణీ నా వేపు అసహాయంగా చూస్తున్నది. అక్కడనుండి కదలలేదు. ప్రిన్సిపాలు రాజశేఖరంగారు కంఠం హెచ్చించారు. "నువ్వింకా మిసెస్ శ్యామసుందరానివి కాలేదు. ఇంతవరకూ కుమారి కళ్యాణివే. ఈ క్షణం వరకూ నీకు గార్డియన్‌ని నేనే. నామాట విని లోపలకు వెళ్లు."

కళ్యాణి కనుకొలకుల్లో నీళ్లు నిలిచాయి. ఆమె వదనమంతా అరుణారుణమైంది. గిరుక్కున తిరిగి కుమారి కళ్యాణి బి. ఏ లోపలకు వెళ్లిపోయింది. ఆమె వెళ్లడం చూసింతర్వాత, ప్రిన్సిపాలుగారు నావేపు తిరిగి అన్నారు.

"మనకూ, మన సంప్రదాయమూ, సంస్కారమూ ఉన్నాయ్ కృష్ణమూర్తీ! ఆ మూడు ముళ్లూ పడనంతవరకూ శ్యామసుందరమూ పరాయి మనిషే మనకు. ఆలోచన లేకుండా అతనన్నాడు కదా అని, మనమూ ఆలోచన లేకుండా ప్రవర్తిస్తామా?"

ప్రిన్సిపాలుగారు ఎంతటి పట్టుదల గల మనిషో నాకు తెలుసు. ఒక నిర్ణయాని కంటూ వచ్చింతర్వాత అటువంటి తరహా మనుష్యులతో వాదన వేసుకోవడం అనవసరం. చేయవలసిందల్లా మార్గాంతరం ఆలోచించడమే.

ఈ చిక్కు తప్పించుకోవడమే విషయమై అనేకానేక ఆలోచనలు నన్ను వివశుణ్ణి చేశాయి. చివరికి ధైర్యంచేసి ప్రిన్సిపాలుగారితో ఒకమాట అన్నాను.

"ఇంకోపని చేస్తే మాష్టారూ!"

రాజశేఖరంగారు ప్రశ్నార్థకంగానూ, ఆశ్చర్యంతోనూ నావంక చూశారు. మా ఇద్దరికీ గత మూడు దశాబ్దాల పరిచయంలోనూ, వారు చెప్పింది శ్రద్ధాళువునై విని, భక్తితో నే నాచరించడమే కాని, నాకు నేనై వారి కేదీ ఉపదేశించింది లేదు.

ఈనాటికి, నా శిష్యురాలు క్షేమం కోరి, వారికే సలహా చెప్పవలసి వస్తున్నది.

"పోనీ, మనమే ఇక్కడ ఓ పార్టీ ఏర్పాటు చేద్దాం. కలెక్టరుగార్ని, వారి స్నేహితులనూ ఆహ్వానిద్దాం. అమ్మాయిచేత టీ సర్వు చేయిద్దాం." నామాట విని ఆయన కన్నులు తళతళలాడడం నేను గమనించాను. ప్రీతిగా ఒక్క

వారిగా కళ్లజోడు తుడుచుకుని "అవును. అది మన డిగ్నిటీకి తగినట్టుగా కూడా ఉంటుంది. అమ్మడితో చెప్పి, పోయి వాళ్లను పిల్చుకురా" అన్నారు. నాకు వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. అడుగులు తడబడే తొందరతో వరుడు విడిదికి వెళ్లాను. విడిదికి అల్లంతదూరం ఇవతలగానే శ్యామసుందరం సీరియస్‌గా ఆలోచిస్తూ పరధ్యానంగా ఉండడం గమనించాను. ఆయన దగ్గర ఇంకా

వ్యక్తిత్వం

నేనేమీ చెప్పనేలేదు. నన్ను చూడగానే "ప్రిన్సిపాల్ రాజశేఖరంగారి కూతురు కుమారి కళ్యాణి ఇక్కడికి రా వీలులేదుకదు మాష్టారూ!" అన్నాడు.

తెల్లబోయాను నేను.

మళ్లీ అతనే అందుకున్నాడు. "గాభరా పడకండి. అక్కడినుండి ఇప్పుడే వచ్చిన మా ప్యూను, మీకన్నా ముందే నాకంతా చెప్పాడు."

"అది కాదండీ!" ఏదో సర్ది చెప్పటానికి నా విఫల ప్రయత్నం.

"ఇటు చూడబోతే స్నేహితుల మధ్య చిక్కువడ్డ నా పరువు, అటు ప్రక్కన కాబోయే మామగారి కరుకుతనం, ఈ డైలమా బావుంది కదండీ!"

"మిస్టర్ సుందరం!" నా గొంతు నాకే క్రొత్తగా ధ్వనిస్తోంది. "నే చెప్పేది కూడా వినండి. ప్రిన్సిపాలుగారో పార్టీ ఎరేంజ్ చేశారు. మీ స్నేహితులు వెళ్లిపోతుంటే, పార్టీ అన్నా ఇయ్యకపోతే బావుంటుందా చెప్పండి. అక్కడే అమ్మాయిని వాళ్లకు మీరు చూపించవచ్చు."

"లెక్చరరుగారు మంచి యుక్తే పన్నారు." అతని మాటల్లో వ్యంగ్యమూ, కన్నుల్లో ప్రశంసా ద్యోతకమైనాయి. ఇహ నేనక్కడ నుంచోకుండా లోపలకు వెళ్లి జేమ్సునూ, తదితర మిత్రులనూ పార్టీకి ఆహ్వానించి, పెండ్లికొడుకును వెంటబెట్టుకుని, కన్యాదాత గృహానికి తీసుకువచ్చాను.

పార్టీ అంతా అతిథులకు సంతృప్తిగా జరుగుతున్నది. మధ్యలో ప్రిన్సిపాలుగారు లోపలకు వెళ్లి కళ్యాణిని వెంటబెట్టుకుని బయటకు వచ్చారు. కళ్యాణి వదనం మబ్బులు విడిచిన చంద్రుడిలా ఉన్నది. వచ్చి సిగ్గు సిగ్గుగా శ్యామసుందరం కూచున్న సోఫాలోనే ఒక వైపుగా కూర్చున్నది.

జేమ్స్ వారిద్దరినీ చూసి ఎంతో ముచ్చట పడిపోయాడు. అక్కడికక్కడే, వా రిద్దరూ సోఫాలో కూచున్న భంగిమనే వో పెన్సిల్ స్కెచ్ వేసి వారికిచ్చాడు. ఆ తర్వాత నవ్వుతూ శ్యామసుందరంతో అన్నాడు.

"చాలా అదృష్టవంతుడివి బ్రదర్ నువ్వు. సరేకాని వధువు పేరేమిటో నేను తెలుసుకోవచ్చునా?"

శ్యామసుందరం గంభీరంగా జవాబిచ్చాడు. "నిరభ్యంతరంగానూ, కుమారి కళ్యాణి బి. ఏ."

రాజశేఖరంగారు ఉలిక్కిపడ్డారు.

జేమ్స్ కూర్చున్న చోటునుంచి లేచి నిలబడి, తన ప్రక్కనే ఉన్న 'పాడ్' లోంచి ఒక చిత్రాన్ని పైకి తీశాడు. దానికింద కళ్యాణీ సుందరానికి ఆశీస్సులతో అని వ్రాశాడు. ఆ బొమ్మలో బ్రహ్మదేముడు తన నాల్గు మొహాలతోనూ సరస్వతిని ముద్దాడబోవడం చిత్రించబడి ఉంది. సరస్వతి అలంకరించుకున్న పైటచెంగును పట్టుకుని,నాల్గు వేదాలూ నల్గురు పసికందుల రూపంలో పాలకై పట్టుబట్టడం కన్పిస్తుంది. సరస్వతిలో కళ్యాణి పోలికలూ, బ్రహ్మలో శ్యామసుందరం పోలికలూ కొట్టవచ్చినట్లున్నాయి.

ఆ చిత్రాన్ని అందుకుని కళ్యాణి ఆనందసరస్వతే అయింది. ఆమెను చూసి శ్యామసుందరం జేమ్స్‌కు అభినందనలు తెల్పడమూ మర్చిపోయాడు.

3

లగ్నం పూర్తయింతర్వాత, రెప్పలు కూరుకుపోతూండడంతో, జనానికి కాస్త దూరంగా దొడ్లో వో మూలగా ఉన్న జాజి పందిరి క్రింద మడతమంచం వాల్చుకు పడుకున్నాను. పడుకున్న వెంటనే నాకు తెలీకుండానే నిద్ర పట్టేసింది. ఆ పడుకోవడం, పడుకోవడం, మళ్లీ పొద్దున్న సూర్యుడి నులివెచ్చని కిరణాలు నన్ను జాగరితం చేసేవరకూ

లేవలేదు. అక్కడే దంత ధావనాది కార్యక్రమం పూర్తిచేసుకుని, ముందు హాల్లోకి వచ్చేసరికి, వాతావరణమంతా క్రొత్తగా, గంభీరంగా, ఏదో తెలియని తనంతో నాకే మాత్రమైనా భీతికరమై కన్పించింది.

సంశయిస్తూ మెల్లగా రాజశేఖరంగారి దగ్గరకు వెళ్ళాను. ఆయనో వాలు కుర్చీలో కళ్ళు మూసుకుని పడుకుని ఉన్నారు. ఆయన ఎంతగా దాచుకుందామని ప్రయత్నం చేస్తున్నా, వదన దర్పణంలో ఆయన మస్తిష్కం ప్రతిఫలిస్తూనే ఉన్నది.

"మాష్టారూ !"

ఆయన కళ్ళు తెరిచారు.

"ఇట్లా పడుకున్నారేం ఒంటరిగా ? ఏమిటి ఆలోచిస్తున్నారు ?"

ఆయన దగ్గర్నుంచి పేలవమైన నవ్వే నాకు సమాధానంగా ఎదురైంది. ఆ నవ్వుకు అర్థం నాకు తెలిసిందే. జవాబు చెప్పడం ఇష్టంలేనప్పుడు అట్లా నవ్వేసి, అవతలవాడికిక మాట్లాడే అవకాశం లేకుండా చేస్తుంటారాయన. ఆయన జవాబు చెప్పరని లోపల 'పిన్ని' గారి దగ్గరకు వెళ్ళాను. ఆడది కాబట్టి ఆబిడ మొహంలో నీలినీడలు మరింతగా కొట్టవచ్చినట్టు కన్పిస్తున్నాయి

"ఏమైంది పిన్నిగారూ !" విచిత్రం ! పిన్నిగారూ మాట్లాడదు. వీళ్ళిద్దరూ నాకు సమాధానం చెప్పకపోయినా, కనీసం నా విద్యార్థిని, నిన్న మొన్నటివరకూ 'మాష్టారూ !' అంటూ నా వెన్వెంట తిరిగి తన ప్రతి పిచ్చి వూహనూ నాకు తెలిపి నన్నో సర్వజ్ఞుడిగా భావించి తన సందేహాలకు సమాధానాలు తెల్సుకున్న కళ్యాణి, కాదు, ఈనాడామె శ్రీమతి కళ్యాణి, తనకు స్త్రీగా మొట్టమొదట జరిగిన ఈ వైవాహిక సత్కార సందర్భంలో నా సందేహానికి సమాధానం చెప్పకుండా ఉంటుందా కాని .... కాని .....

కళ్యాణి తన గదిలో లేదు.

అక్కడ ఉన్న కళ్యాణి స్నేహితురాళ్ళలో ఒకామె నామీద దయతలచినట్లుంది. "పొద్దుట్నుంచి కళ్యాణి కన్పించడంలేదు మాష్టారూ !" అన్నది ఆదుర్దాను కంఠంలో దాచుకొందామని ప్రయత్నం చేస్తూ.

నేను తెల్లబోయాను. "కన్పించకపోవడమేమిటి ?"

గబగబా వాకిట్లోకి వచ్చాను.

రాజశేఖరంగారు, తమ వియ్యంకుడితో ఏదో మాట్లాడుతున్నారు. ఆ వియ్యంకుడి మాటలు పెద్దగా వినబడుతున్నాయి. "మా అబ్బాయీ కన్పించడం లేదండీ. ముహూర్తమయ్యాం తర్వాత నాకూ కాస్త మాగన్నుగా నిద్రపట్టింది. లేచి చూసేసరికి, 'అబ్బాయేడండీ' అంటూ మా ఆవిడ నాకు ఎదురు వచ్చింది. మొదట్లో ఇక్కడి కేవన్నా వచ్చాడేమో ననుకున్నాను. ప్యూనును పంపిస్తే ఇక్కడా లేడని తెలిసింది. నేనే వస్తే, కోడలు పిల్లా కనబడ్డం లేదని మరో కొత్త సంగతి."

నాకో సందేహం తీగలా తోచి, వాకిట్లోకి పరుగెత్తాను.

రాజశేఖరంగారి కారు లేదు. కారు డ్రైవరు వో వాస వేసుకుని షెడ్డులో పడుకుని నిద్ర పోతున్నాడు.

నా అనుమానం నిర్ధారణమైంది.

వెంటనే మళ్ళీ రాజశేఖరంగారు మాట్లాడు తున్న చోటుకు తిరిగి వచ్చాను. ఆయన నా కళ్ళలో వో నిశ్చలతా, నడకలో తొందరపాటూ చూసి, మాటలాపి నావేపు తిరిగి ఏమి టన్నట్లుగా ప్రశ్నార్థకంగా చూశారు.

"మాష్టారూ ! మన మేమీ కంగారుపడనవసరంలేదు. ఇక్కడ అమ్మాయి లేదు. అక్కడ శ్యామసుందరం లేడు. వాకిట్లో మీ కారు లేదు. కలెక్టరుగారూ, కళ్యాణీ ఆలోచించుకుని వో కార్యక్రమం నిర్ణయించుకున్నట్టున్నది."

నా మాటలు విని వియ్యంకు లిద్దరూ వెలతెల బోవడం నేను గమనించాను. ఇహ నేనక్కడ ఉండడం బావుండదని ఈ సంగతి 'పిన్ని' గారితో కూడా చెప్పి వస్తానని లోపలకు వెళ్ళాను, వారిని తప్పించుకుని.

అప్పటికే గంట తొమ్మిది కావస్తున్నది.

నామాట విని 'పిన్ని' గారు కొంచెం ధైర్యం తెచ్చుకుని లేచి వంటింట్లోకి వెళ్ళింది. కళ్యాణి స్నేహితురాండ్ర కందరికీ ఉబుసుపోకకిది మంచి విషయమైంది. పిల్లలు కొందరు గుక్కపట్టి ఏడుస్తున్నారు.

వంటశాలమీద అజమాయిషీ వహిస్తున్న వో పూర్వ సువాసిని అక్కడకు వస్తే "పోనీ బాలలంతి కానీ కూడదు మామ్మగారూ !" అన్నాను.

ఆవిడ ఆ ప్రయత్నంలో నిమగ్నమైంది.

ఒక చెంపన పిల్లలు భోజనా లవుతూండగానే "వాళ్ళు వచ్చేసరికి అందరం స్నానాలు చేసి కూచుంటే ఆతర్వాత ఇహ ఆలస్యం లేకుండా భోజనా లేర్పాటు కానీయచ్చుకదూ" అన్నాను. కొందరికి నా సలహా నచ్చి అంగవస్త్రాలు కట్టుకున్నారు.

సూర్యుడు చీకటిని మేసిన ఆకలి చాలక, నడి పొద్దు త్వర త్వరగా చేరుకుంటున్నాడు. అందరం నవదంపతుల కోసం ఎదురుచూస్తూ కూచున్నాము

దూరంగా కారు వస్తున్న జాడ. దగ్గరగా కారు శబ్దం.

కారు స్టీరింగు ముందు కలెక్టరుగారే ఉన్నారు. ఆయన ప్రక్కన అందంగా కళ్యాణి, గర్వంగా, సంతోషంగా—

కారు ఆగింతర్వాత, తలుపు తీసి ఒక చేత్తో పట్టుకుని, రెండవచేత్తో కళ్యాణి చేతి నంది పుచ్చుకుని, జాగ్రత్తగా దిగమని చెప్తున్నాడు శ్యామసుందరం.

వరండాలో కూచున్న వయసు దాటిన వియ్యంకు లిద్దరూ చోద్యం చూస్తున్నారు. ఆడంగు లందరూ అబ్బుర పడుతున్నారు. పిల్లలు గొడవ చేయడం మర్చిపోయారు.

శ్యామసుందరం, కళ్యాణి చిటికెన వ్రేలిని సుతారంగా అంది పుచ్చుకుని, వయసు వయసూ నడిచివచ్చినట్లుగా లోనికి నడిచివచ్చాడు. అంత సేపు వాళ్లను చూసింతర్వాతగాని తేరుకోలేదు బాలాదివృద్ధులు.

"ఎక్కడికి వెళ్లావబ్బాయ్" అన్నారు శ్యామసుందరంగారి తండ్రి.

శ్యామసుందరం ఆగాడు. అతనితో కళ్యాణి ఆగింది.

"చెప్పు కళ్యాణీ !" శ్యామసుందరం కళ్యాణి వేపు చూశాడు.

"ఒక పూటకూళ్లామె యింటికి వెళ్లాం" కళ్యాణిలో చిలిపితనం వెక్కిరిస్తున్నది.

"అదేమిటి ?" ఈసారి ఆశ్చర్యపోవడం వధువు తండ్రి దయింది.

"వెళ్లడమే కాదు, భోజనం కూడా చేసి వచ్చాం" శ్యామసుందరం అందుకున్నాడు.

ఈసారి వరుడి తల్లి చకితురాలు కావలసి వచ్చింది. "అదేమిటి నాయనా?" అని మాత్రం అనగల్గింది.


"అమ్మా !" శ్యామసుందరం గొంతులో ఎంతటి ఆర్ద్రత ఉన్నది.

"జ్ఞాపకం ఉందా అమ్మా ! పదిహేను సంవత్సరాల క్రితం నాన్నగారి వూళ్ళో ఉద్యోగం చేశారు."

"అవునవును. అప్పుడీ వూరు కాలేజీలో నువ్వు ఇంటర్మీడియేట్ చదివావు కూడాను" శ్యామసుందరం తండ్రిగారు ఏదో జ్ఞాపకం తెచ్చుకొంటూ జవాబిచ్చారు.

"అవును. అప్పుడే నాకో స్నేహితుడు కూడా ఉండేవాడు. పేరు వామనరావు. నిజంగా వామనుడే. అయినా వాడంటే నాకు ప్రాణాధికమైన ఇష్టంగా ఉండేది. వాళ్ళ యింటికి నేను ఎప్పుడు వెళ్ళినా సరే, వాళ్లమ్మ — అప్పటికే ఆమెకు వో పూటకూళ్ల హోటలుంది—ఆదే ఆమె జీవనాధారం. ఏదో ఒకటి నాకు పెట్టకుండా పంపించేది కాదు. నన్ను చూడగానే మొహమంతా సంతోషం చేసుకునేది. ఇహ వాడు సరేసరి."

"ఏదీ—అతను నీ పెళ్లికి వచ్చినట్లు లేదు."



"రాలేదు ఆ సంగతి కనుక్కుందామనే నిన్న సాయంత్రం ఫ్యానును పంపించాను" శ్యామ సుందరం కంఠస్వరం బరువుగా ధ్వనించింది. "వాడు పోయాడట. వాడు పోయిన దుఃఖంలో, అవును మరి, వాడొక్కడే ఆమెకు సంతానం. ఆమె మంచం పట్టిందట. అంత దుఃఖంలోనూ నా పెళ్లివార్త విని ఎంతో ఆనందించి "ఏమయ్యా! చూస్తున్నావుగా. లేవలేని స్థితి, వాడితో 'దంపతు లిద్దర్నీ పసుపు బట్టల్లో చూడాలని ఉంది అని చెప్పావ్?' అన్నదట. అందుకని—"

"కళ్యాణిని తీసుకుని మీరు వెళ్లారు." రాజ

శేఖరంగారు నిష్టూరంగా అన్నారు.

శ్యామసుందరం ఆయనవేపు ఒకటి రెండు క్షణాలు నిశ్చలంగా చూశాడు.

"మామగారూ! మీరో సంగతి మర్చిపోయి నారు. గత అర్ధరాత్రి పన్నెండు గంటల నుంచీ కళ్యాణి, శ్రీమతి కళ్యాణీ శ్యామసుందరమైంది. ఇకనుంచీ ఆమె బరువు బాధ్యతలు నావి" అన్నాడు. అని "మీరు వెళ్లి భోంచేయండి నాన్నగారూ!" అంటూ "కళ్యాణీ! నువ్వు కూడా లోపలికి వెళ్లి అందరికీ ఏం కావాలో చూడు" అంటూ తన గదిలోకి వెళ్లిపోయాడు


రాజశేఖరంగారికీ సంతోషమూ, సంభ్రమమూ రెండు కళ్లలోనూ ప్రతిఫలిస్తుండడం నేను గమనించాను.


శ్యామసుందరం వ్యక్తిత్వం నన్ను ముగ్ధుణ్ని చేస్తుంది "అందరి మామగార్లకూ అటువంటి అల్లుళ్లే లభిస్తే...."

"నాన్నా! నిన్నూ మడిగట్టుకోమంటుంది పిన్ని గారు." అంటూ పన్నెండేళ్లు దాటుతున్న మంజుల వచ్చి నన్ను పిలుస్తున్నది.

నేను మంజుల వేపే చూస్తున్నాను. ★







లాచ్చియో. "ఇంకేమీ అక్కర్లేదు నాకు—కాదు! చెప్పులు లేవు నాకు. అయితేనేం? ఒక అడవి గొర్రెను చంపుతాను!"

ఆర్సో పది ఫ్రాంకులు తీసి అతని చేతిలో పెట్టాడు.

"కొలంబా మందుగుండు పంపించింది. వాటితో చెప్పులు కొనుక్కో!"

"ఏమిటిది లెఫ్టినెంట్" అని అరిచాడు బ్రాండులాచ్చియో డబ్బు తిరిగి ఇచ్చివేస్తూ "నేనేమయినా అడుక్కుతినేవాడినా? రొట్టె, మందుగుండు ఇస్తే తీసుకుంటానంతే!"

"ఇద్దరు సైనికుల మధ్య సహాయం పుచ్చుకొనటానికి మొహమాటాలు ఉండక్కర లేదని, నేననుకున్నాలే!"

కాని, వెళ్ళిపోయేముందు బందిపోటు చూడకుండా అతని సంచిలో పడవేశాడు.

"సెలవు ఆర్సొ ఆంటన్!" అన్నాడు దైవభక్తి, జ్ఞానాభిలాష కల మనిషి. "మళ్లీ పొదల్లో కలుస్తామేమో! మన సాహిత్య చర్చలు మానకూడదు."

వీరిని వదిలి వెళ్ళిన పదిహేను నిముషాలు తర్వాత అర్సో తన వెనుక ఎవరో వేగంగా వస్తున్నారని తెలుసుకుని వెనుక తిరిగి చూశాడు బ్రాండోలాచ్చియో కనిపించాడు

"లాభం లేదు. లెఫ్టినెంట్ సహించలేను!" అని అరిచాడు "ఇంద నీ పది ఫ్రాంకులు. వేళాకోళంగా కాబట్టి సరిపోయింది. కొలంబాగారిని అడిగానని చెప్పండి! నీ వెంట పరిగెత్తలేక చచ్చాను. సెలవు!"

తను అంతసేపు కనిపించనందుకు కొలంబా ఆందోళన చెందటం ఆర్సో గమనించాడు; అయితే, అతన్ని చూడగానే ఆమె ముఖం లోని కలవరం సాధారణంగా ఉండే

కొలంబా

21 వ పేజీ తరువాయి

విషాదంగా మారిపోయింది. భోజనం వద్ద ఇద్దరూ సామాన్యమయిన విషయాలు కొన్ని తప్ప మాట్లాడలేదు. తన చెల్లెలు 'శాంతంగా' ఉన్నదనుకుని ఆర్సో చిలినా గురించి హాస్యంగా మాట్లాడాడు; ఆ అమ్మాయి మామ, అతని గౌరవనీయుడయిన సహచరుడు శాస్త్రీకోసి కలిసి ఆమెకి కావలసిన నీతి శిక్షణ ఇస్తారన్నాడు.

"బ్రాండలచ్చియో నిజాయితీ కల మనిషి," అంది కొలంబా "కాని శాస్త్రికోసీ నియమాలు లేనివాడని విన్నాను."

"ఇద్దరూ ఇద్దరే" అన్నాడు ఆర్సో. "సంఘం మీద యుద్ధం కొనసాగిస్తున్నారు. ఒక నేరం చేస్తే దాని వెనుక మరికొన్ని. అయినా పొదల్లో దాక్కున్న వారికన్నా వారే నయమేమో!"

కొలంబా ముఖం మీద ఒక చిరునవ్వు మెరిసింది.

"అవును!" అన్నాడు ఆర్సో మళ్లీ. "ఈ దౌర్భాగ్యులకు కూడా నియమం అనేది లేకపోలేదు. ఇతరుల దురభిప్రాయం వల్ల ఈ జీవితం దక్కింది వీరికి."

ఒక క్షణం నిశ్శబ్దం ఆవరించింది


"అన్నయ్యా" అంది కొలంబా కాఫీ పోస్తూ, "చార్లెస్ బాపిస్ట్ పియత్రీ రాత్రి చచ్చిపోయాడు తెలుసా ? జ్వరం వచ్చిపోయాడు"

"పియత్రీ ఎవరూ?"

"ఈ ఊరివాడే మాదెలైన్ మొగుడు. నాన్నగారు పోయిన తర్వాత ఆయనపని ఇచ్చారు. అతని భార్య వచ్చి నన్నేదయినా పాడమని అడిగింది. మనపక్క ఇంటివారు గదా, ఆ మాత్రం చేసి పెట్టకపోతే బాగుండదు."

"పోనిద్దూ! కొలంబా, మా చెల్లెలు ఇలా బహిరంగంగా పాడటం నాకిష్టం లేదు!"

"ఆర్సో ఒక్కొక్కరు వారికి తోచినట్లు చచ్చిపోయినవారిని గౌరవిస్తారు," అంది కొలంబా. "బల్లాతా మన ప్రాచీన సంప్రదాయాలలో ఒకటి. దాన్ని మనం పాటించాలి. ఫియోరోశస్సినా కూడా పాడుతుంది కాని ఆమె వంట్లో బాగలేదు. మరిబల్లాతా పాడి తీరాలి కదా!"



"ఎవరూ పాడకపోతే చార్లెస్ బాప్టిస్ట్‌కి పరలోకంలో దారి తెలియదంటావా? నేనూ నీతో వస్తా, కాని మరీ ఆశుకవిత్వం చెప్పక అది నీ వయసుకి తగ్గది కాదు... చెల్లాయి, చెబుతున్నా విను!"

"అన్నయ్యా నేను మాట ఇచ్చాను. అది ఇక్కడ అలవాటని నీకు తెలుసు. వెళ్ళి ఆశుకవిత్వం చెప్పాలిసిందే!"

"ఏమి అలవాటు!"

"ఇలా పాడడం అంటే నాకూ బాగానే ఉంటుంది. మనకష్టాలన్నీ గుర్తుకు వస్తాయ్. రేపు కష్టపడతాను! కాని అవసరమయినపని. నన్ను వెళ్ళనీ అన్నయ్యా! అజాచ్చియోలో ఇంగ్లీషు అమ్మాయి సరదాపడుతుందని పాడించావు జ్ఞాపకం ఉందా? ఇక్కడ బీద ప్రజల కోరిక మన్నించటానికి ఆ మాత్రం చెయ్యకూడదా?"

"సరే, నీ ఇష్టం వచ్చినట్టే చెయ్యి! ఈ బల్లాతా కట్టేసి ఉంటావు. ఎక్కడ దండగయిపోతుందోనని నీ భయం."

"లేదు అన్నయ్యా! ముందుగా కట్టలేను! అసలు చచ్చిపోయిన వారిదగ్గర ఉన్నప్పుడే ఆలోచిస్తాను. కన్నీరు ప్రారంభించగానే నాకు తోచింది పాడేస్తాను."

ఇదంతా కొలంబా చాలా నిరాడంబరంగా చెప్పింది. ఆ మాటల్లో దాగిఉన్న కవితా శక్తి విషయమై ఊహాపోహ ఉండటానికి అవకాశమే లేదనిపించేట్లు ఉంది ఆమె ధోరణి. ఆర్సో అడ్డు చెప్పలేకపోయాడు. ఆమె వెంటనే పియత్రీ ఇంటికి వెళ్లాడు. శవం ఇంట్లో కెల్లా పెద్ద గదిలో పడుకోపెట్టి ఉంది; ఏమీ కప్పిలేదు; కిటికీలు, తలుపులు తెరిచే ఉన్నాయి; చుట్టూ కొన్ని మైనపు వత్తులు వెలుగుతున్నాయి. తల దగ్గర అతని భార్య ఆమె వెనుక మరికొందరు ఆడవారు ఉన్నారు. వారికి ఎదురుగా తలమీద టోపీలు తీసివేసినుంచున్న మగవారు కనిపించారు. అందరూ మౌనంగా మృతకళేబరం వంకనే చూస్తున్నారు. అప్పుడే వస్తున్నవారు ఒక్కొక్కరూ శవం వద్దకు వెళ్ళి, దానిని కౌగలించుకుని, కొడుకువైపు, భార్యవైపూ తిరిగి తల ఒక్కొక్కసారి వంకించి, నిశ్శబ్దంగా తక్కినవారితో బాటే వెళ్ళి నుంచుంటున్నారు. అయితే అప్పుడప్పుడు మాత్రం కొందరు మరణించిన వ్యక్తిని ఉద్దే-

ఒకావిడ (ఇది న్యూయార్కులో) తనభర్త గోరీ కనిపించటం లేదని శ్మశానాధికారికి ఫిర్యాదు చేసింది. అతనిపేరు జాన్ రాబిన్ అని చెప్పింది. అధికారి వెతికి వెతికి "ఇక్కడ మేరీ రాబిన్ పేరు మాత్రమే కనిపిస్తోంది!" అన్నాడు.

"అదే, అదే, అన్నీ నా పేరులోనే ఉంటాయి.'' అన్నది శ్రీమతి రాబిన్.

కె. వి. ఎస్ (చీరాల)

-శించి అక్కడ గాఢ నిశ్శబ్దాన్ని చీల్చేవారు: "ఎందుకు నీ భార్యని వదలి వెళ్ళిపోయావు!" "నువ్వు లేకపోతే ఆమెగతి ఏమి కావాలి?" "ఎందుకిలా మోసం చేశావా మని?" "ఇంకొకనెల ఆగలేక పోయేవా?" "నీ కోడలికి ఒక కొడుకు పుట్టేవాడు కదా!"

ఒక పెద్ద యువకుడు, పియత్రీ కొడుకు, చల్లబడిపోయిన తనతండ్రి చెయ్యి నొక్కుతూ అరిచాడు; "అయ్యో! బలవంతపు చావు చావలేదు కదా! నీ పగతీర్చి ఉండేవారం కదా మేము!"

ఆర్సో లోపలికి వస్తూనే ఈ మాటలు విన్నాడు, అందరూ అతన్ని చూసి ముందుకు వచ్చేందుకు దారిచేశారు. గుసగుసలు కూడా ప్రారంభం అయ్యాయి. ఇదంతా 'ఆశుకవయిత్రి'ని చూసి అని ఆర్సో గ్రహించాడు. కొలంబా చనిపోయిన వ్యక్తి భార్యను కౌగలించుకుని, ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని కళ్లుమూసుకుని కొంత సేపు మౌనంగా ఉండిపోయింది. తర్వాత తన తలమీద మెజారో (మేలి ముసుగు వంటిది) తీసివేసి, శవం వంక చూస్తూ, తన ముఖం కూడా మృతదేహం వలె పాలిపోగా, ముందుకు వంగి ఇలా వల్లించింది.

"—చార్లెస్ బాప్టిస్ట్ నీ ఆత్మ క్రీస్తులో కలిసిపోయింది!— జీవించడం కష్టపడటమే– నువ్విప్పుడున్న చోటు చలిలేదు, ఎండ లేదు— ఇంక నీకు కష్టమయిన పనిలేదు– ఇక నీ కన్నిరోజులూ ఆదివారాలే– చార్లెస్ బాప్టిస్ట్ ఇక నీ ఆత్మ క్రీస్తుది–నీ కొడుకు నీ యింటికి అధికారి–పెద్దవృక్షం కూలిపోయింది– దక్షిణ దిక్కు గాలికి పడిపోయింది– అది మరణించింది–నేను దాటిపోయాను–దాని వేరులోనుంచి మరొక చిన్న వేరు మొలిచింది— ఇదే మళ్లీ పెద్ద వృక్షం అవుతుంది– దానికింద పెద్దనీడ– మాదెలె! ఈ నీడలో విశ్రాంతి తీసుకో!"

తన పేరు వినగానే మాదలె(యిన్) వెక్కి, వెక్కి ఏడవడం మొదలు పెట్టింది. అక్కడే ఉన్న ఇద్దరు ముగ్గురు మగవారు కూడా– పిట్టలని కాల్చినట్లు కొందరు తోటి క్రైస్తవులను కాల్చి చంపివేసిన వారు–కన్నీరు కార్చారు.

కొలంబా మరికొంత సేపు 'కవిత్వం' చెప్పింది. మరణించిన మనిషి కుటుంబంవారు ఆమె వాగ్ధాటికి కదిలిపోయారు. వల్లిస్తున్నంత సేపూ

ఆమె ముఖకవళిక నిర్మలంగా ఉన్నది; చర్మం లేత ఎరుపురంగు దాల్చి, ఆమె పళ్ళవరుస తెలుపూ, కంటి పాపలలోని మెరుపూ స్పష్టంగా కనిపించాయి. అందరితోబాటు ఆరోన్ కూడా చలించిపోయాడు; గదికి ఒక మూలగా నుంచుని పియత్రి కొడుకుతోబాటు వలవల ఏడ్చాడు.

కొలంబా

ఇంతలో ఆ గుంపు విడిపోయి లోపలికి ఇంకా ఇద్దరు కొత్తవారు వచ్చారు. వీరిపట్ల అక్కడివారు చూపే గౌరవాన్నిబట్టి వారెవరో ప్రముఖులు అయిఉంటారని తెలుస్తోంది. వారు అక్కడికి రావటం ఆ ఇంటికే గౌరవం అనిపించేట్లు ప్రవర్తిస్తున్నారు అందరూ. అయితే బల్లాతా నడుస్తోంది. కాబట్టి వారిని పలకరించటం జరుగలేదు. వచ్చిన వారిలో మొదటి వ్యక్తికి సుమారు నలభయి సంవత్సరాలు ఉండవచ్చు. నల్లనిదుస్తులూ, ఛాతీమీద ఎర్రటి రిబ్బనూ, అధికారం సూచించే ధోరణి — ఇవన్నీ అతను అక్కడి గ్రామాధికారి ఎవరో అయి ఉంటాడని తెలుపుతున్నాయి. అతని వెనకాల మనిషి ఒక వంగిపోయిన ముసలివాడు. కళ్ళజోడు వెనుక కళ్లు చెదురుగా చూస్తున్నాయి. ధరించిన నల్లనిసూటు అతనికి చాలావదులుగా ఉంది. చాలాపాతది అని స్పష్టంగా తెలుస్తోంది. మొదటవచ్చిన అధికారి నీడలో నక్కినుంచునే వానివలె ఉన్నాడు.

వీరు ఇద్దరుకాక మరి ఇద్దరు యువకులు ప్రవేశించారు. ఇద్దరూ బలంగా, ఎండకి నల్లపడిన ముఖాలతో, గర్వంగా మెరుస్తున్న కళ్లతో నిర్లక్ష్యంగా ఇటూ అటూ చూస్తూ ముందుకి వచ్చారు. ఆరోన్‌కి తన ఊరివారు అందరూ జ్ఞాపకం లేరు కాని కళ్ళజోడు చూడగానే ఏవేవో సంగతులు గుర్తుకు వచ్చాయి. అధికారి వెంటరావటంవల్ల అతనే బారిచినీ (ఎడ్వకేట్) అన్న విషయం చప్పున జ్ఞాపకం వచ్చింది. యువకులిద్దరూ అతని కొడుకులు. బల్లాతా వినటానికి వచ్చారన్నమాట. ఆ క్షణంలో ఆరోన్ అంతరాత్మలో ఏమేమి మెదిలాయో చెప్పటం కష్టం; అయితే, తనతండ్రి శత్రువులు తన ఎదుట నుంచున్నారనే చైతన్యం అతనిలో భయంకరమయిన భావాలను రేకెత్తించింది; తను ఏవయితే నిరాధారాలని తోసివేశాడో ఆ అనుమానాలు తిరిగి రావటం మొదలుపెట్టాయి.

(ఇంకా ఉంది)

ప్రేమకు పగ్గాలు

25 వ పేజీ తరువాయి

"మీరు వెళ్ళిరాండి.... మేం ఇదుగో ఇక్కడే ఈ చెట్టుమీద కూచుని మీ రాకకై వేచి ఉంటాము...."

వాళ్ళు ముగ్గురూ తాత్కాలికంగా వేసిన 'పాకశాల' వేపు నడిచారు.

ఒక చెట్టుకొమ్మ మరీ వల్లకీ 'మామ'లాగ నేలకు దగ్గిరిగా సాగడంతో మిత్రులిద్దరూ దానిమీద కూచున్నారు.

"దిల్‌తేరా దివాన్నా హైసనమ్...." ఆనక "పందిట్లో పెళ్లి....." అనీ గ్రామఫోను రికార్డు లందుకున్నాయి !

"అబ్బ ! స్వర్గాని కెళ్లినా ఆరిపోరూ అనీ.... ఇదేం గోలరా !" భాస్కరం విసుక్కున్నాడు.

"పైగా ఆ పాట వినూ ! పందిట్లో పెళ్లి అవుతూందనిటా"— మూర్తి కూడా చిరాకు ప్రదర్శించాడు.

కొండలమీద ఎండ— ప్రసరిస్తోంది.

"ఆ కొండలెంతో బాగున్నాయి" మూర్తి అన్నాడు.

"మీ శైలజా నువ్వూ అక్కడికి పారిపోవాల మంది కదూ !"

"నన్ను నువ్వు మరీ 'ఎక్స్‌పోజ్' చేస్తున్నావు బ్రదర్ ! ఐ అబ్జక్ట్ !"

"అబద్ధాలు చెప్పకూడదని మా పిన్ని చెప్పింది లే అంచాత అబ్జక్షన్ ఓవర్ రూల్డ్...."

"ఆవిడకు ఇంతవరకు నువ్వు యెన్ని నిజాలు చెప్పావు ?"

భాస్కరం మొహం నల్లగా ఐపోయింది. నవ్వు తెచ్చుకుని "వైవాహింకంబులందు అసత్యం శ్రేష్ఠమన్నారుగదా !" అన్నాడు.

"ఓ.కే..... ప్రేమాయణంలో కూడా కాస్త దాపరికం అవసరం కదా !"

"అరుగో వాళ్లవొస్తున్నారు— కొంప దీసి పేకాడమనరుగదా ?"

"ఎందుకంటారూ? మనం పందెం వేస్తాంగా—' మూర్తి కొమ్మమీంచి క్రిందకు దూకాడు.

"ఏమిటండీ పందెం అంటున్నారు"

"ఆ కొండ చూశారూ...." అన్నాడు భాస్కరం.

"అదేం నలుసా ? నల్లపూసా.... నిక్షేపంలా చూశాం"— పద్మావతి అన్నది.

"అది మీలో ఏ ఒక్కరూ ఎక్కలేరూ అని భాస్కరం పందెం." అని మూర్తి చెప్పాడు గట్టిగా

"అఫ్ కోర్సు... అదీ, వో చిన్న గుట్ట.... నేనూ, కొండపల్లి కొండెక్కి 'భోగం దానిమేడ' దాకా వెళ్లాను తెలుసా?"— శైలజ అమాయకంగా చెప్పింది.

"అక్కడి కెందుకు ?" భాస్కరం మూర్తీ మరేఖ ఇంచుమించు ఒక్కసారే నవ్వేశారు.

"సాహసం ధైర్యం ఒక్క మీ "షెర్పా" జాతికేగాదు మా స్త్రీ జాతికికూడా గలదని నిరూపించుటకు...." పద్మావతి ఎగిరెగిరి పోతున్న తన ఎర్రంచు పచ్చకోక పయిటను పట్టుకుని మరీ చెప్పింది, శైలజ పక్షంగా !

"ఓ.కె.... ఆ కొండ ఎక్కుదాం..... కాస్సేపు ఈ సినిమా పాటల గోలైనా తప్పుతుంది....."

మూర్తి అడుగులు ముందుకి వేశాడు "వచ్చువారు రండు నే పోవు వాడ" నంటూ

సురేఖ రెండు జెడల్లో ఒకటి ముందుకి ఇలా వేసుకుని— "ఈ పచ్చని చోట ఇలా కూచో నీండ్రా" అంటూ గరికెనేలను కూచున్నది.

మూర్తికి శైలజతో ఏకాంతం కావాలి.... దూరంగా వెళ్లాలి.... ఎంతో ఎత్తుగా ఏ మేఘాల చాటుకో, ఏ కొండ మాటుకో పారిపోవాలనుంది.

శైలజకి కొండ ఎక్కడం సర్దా ఉన్నది. పైగా ఛాలెంజీ కూడా చేశాడు మూర్తి.

పద్మావతిని భాస్కరం ఏమీ అనలేదు.

అతనికి సురేఖతో మాట్లాడాలనుంది. పరిస్థితులు చేయిజారి పోకముందే చెయ్యాలి.

"మీరు వెళుతున్నా, అరగంట త్వరాత కూడా మేం మిమ్మల్ని వచ్చి అందుకుంటాంలెండి" అన్నాడు చెట్టుదిగి ఆ 'మానుకే' చేరగిలబడి, నిలబడి—

"హా.... అయితే మేమంత తీసిపోయామా? ....మాతో సర్దాగా రావడం కాదన్నమాట మీకు ముఖ్యం—పందెమేనా? ముఖ్యం !"

"ఆహా.... ఏభై గుంజీలు పందెం" భాస్కరం నవ్వుతూ పద్మావతిని చిలిపిగా చూశాడు.

"తియ్యండి— ఏభై కాదు వంద అంటాను" పద్మావతి అటు తిరిగి చూసింది.

శైలజా మూర్తీ అటుకేసి వెళ్తున్నారు. ఇటు సురేఖ చతికిల బడ్డది.

భాస్కరం చిలిపిగా, కొంటెగా, సవాలుగా తనకేసి చూస్తున్నాడు.... "పోనిద్దూ వాళ్లతో మనకేమిటీ ?"— అనలేదు.

పద్మావతి గిరుక్కున అటు తిరిగి

"ఓయ్ ! శైలజా ! వస్తున్నా మండం డోయ్ !" అంటూ విసవిసా వెళ్లి వాళ్లను కలుసుకుంది.

"వాళ్ళు రారా ! ?" శైలజ అడిగింది.

"వాళ్ళు కుందేళ్లట !.... వెనక అరగంట పోయాక వచ్చినా మనల్ని కలుసుకుంటారట ! ఏడవనీ" పద్మావతి అన్నది.

"మరేం పాపం ! వాడేనా ? భాస్కరమా ? కుందేలు ? వాడికి క్రికెట్‌లో ఇరవై "రన్స్" తర్వాత .... నే 'రన్నర్'గా వెళ్లేవాణ్ణి, తెలుసా ? లేపోతే 'డక్కే'వాడు" మూర్తి నవ్వాడు.

"ఇప్పుడు కూడా రన్నర్‌గా పోండి...మేం, నేనూ శైలజా ఆ కొండమీదకు పోయివస్తాం"

శైలజ చెయ్యి పుచ్చుకుంది పద్మావతి.

"నేను మీ పార్టీవాణ్ణి సార్?" అంటూ మూర్తి శైలజకు చెయ్యి ఇవ్వబోయి లాగేసుకున్నాడు— ముగ్గురు విరగబడి నవ్వుకున్నారు.

* * *

"పదండి, వాళ్ళు నొచ్చుకుంటారు"

అంటూ సురేఖ లేచింది. పైటతీసి నిండుగా కప్పుకుని, చెప్పులు విప్పి పరిగ్గా తొడుక్కుంది.

"మీరు నన్ను చాలానీచుణ్ని అనుకుంటున్నారు? అవునా?" అన్న భాస్కరం ప్రశ్నకు పరీక్షగా చూసింది సురేఖ— ఇతణ్ని ఏమనుకోవాలి అనే పరిశీలన, అన్వేషణ ఉన్నదా చూపులో....

"ఎందుకనీ ?"

భాస్కరం తాపీగా అడుగులు వేస్తూ "నేను మీకుక్షమాపణ చెప్పుకుంటున్నాను" అన్నాడు.

"అంతంత పెద్ద మాటలనకండి నేను మీ కంటె చిన్నదాన్ని కాబోలు.''

"చిన్నవారైనా చాలా బుద్ధిమంతులు...... నా ఉద్దేశంలో నేను.... నేను....''

సురేఖ ఆత్రుతగా అడిగింది.

"మీరు ఏం చెప్ప దల్చుకున్నారో చెప్పేయండి!'' అని....

"మా పిన్నమ్మని మీరు చూశారుగా.... ఆవిడ నాకు దేవుడు లాంటిది. నన్ను మా అమ్మ కన్నదిట గాని ఈమె పెంచి పెద్దవాణ్ణి చేసింది.''

"నిజంగా మీరు ఆమెను ముక్కు గుద్దిన ట్లుంటారు.... తెలియని వాళ్లు మిమ్మల్ని తల్లి పోలిక వచ్చింది చాల అదృష్టవంతుడంటారు కూడా.... !'' అన్నది సురేఖ. కాని ఆమెకు పద్మావతి తనను అపార్థం చేసుకుంటుందేమో నన్న శంక, కూడా లోపల పీకుతున్నందున వెంటనే "మనం వాళ్లను కల్సుకుందాం రండి పద్మావతి ఒక్కర్తీ అయిపోయింది'' అన్నది కొండ కేసే చూస్తో....

"మా వసంత పెళ్లికి మీరు వస్తారుగా'' — భాస్కరం కొండ ఎక్కాలనిగాని, పద్మావతిని కల్సుకోవాలనిగాని ఉత్సుకత చూపటమే లేదు.

"మా దొడ్డమ్మ రాసింది.... రమ్మని'' సురేఖ చెప్పింది.

ఎండ తీక్షణత ఎక్కువైంది. దూరాన శైలజ మూర్తీ పద్మావతీ కొండ పోటీలుగా యెక్కుతున్నారు—ఇటువేపు పిక్‌నిక్ బృందం సందడి కూడా దూరమైంది. విస్తారమైన గుట్టలు బండలు రాళ్ళు — ఓ చెట్టునీడను మెళ్లో పెద్ద పెద్ద ఎర్రపగడాల హారం — గోచీ పెట్టుకున్న పదేళ్ల పిల్ల ఒకర్తి, పుల్లలేరి పేర్చుకుంటున్నది.

"వసంత పెళ్లి ఐపోతే నాకు చాలా వరకూ 'రిలీఫ్' వస్తుంది.'' భాస్కరం అక్కడే ఒక బండమీద కూలబడ్డాడు— "ఇంక మనం కొండ ఎక్కుతాం అనే ఆశ ఏం పెట్టుకోకూ'' అన్నట్టుంది అతని వాలకం.

ప్రేమ కుపగ్గాలు

సురేఖ "ఇక్కడ ఎండ మొహం మాడులోంది —పైగా''...అని ఏమో...అంటూండగానే.

"సురేఖగారూ! మీరు నాకు ఉపకారం చెయ్యగలరా ?'' అన్నాడు ఆశగా ఆత్రుతగా చూస్తూ భాస్కరం.

"ముకుందరావును నేనెరుగుదును — అతను చాలా మంచివాడే గాని స్వతహా తల్లిదండ్రులన్నా మా దొడ్డమ్మ అన్నా చాలా భయస్తుడు'' అంటూ సురేఖ కూడా కాస్త ఎడంగా మరో రాతి బండ మీద కూచున్నది.

పిక్‌నిక్‌కి వచ్చిన వాళ్లంతా రకరకాల ఆట పాటలలోను, కాలక్షేపాలలోనూ మునిగిపోయారు —ఈ బృందం విడినట్లే కొందరు జట్లుగా విడిపోయి అగుపించిన కొండగుట్ట కెల్లా 'మౌత్ ఆర్గన్'లు 'ట్రాన్సిస్టర్'లు కూడా పట్టుకు కేరుతూ నవ్వుతూ ఎగ్రబ్రాకుతున్నారు! కాని వీళ్లకా ఆనందం లేదు.

సురేఖ పచ్చని పసిమిఛాయ, ఎండ పొడకు కగ్గిపోయింది. ఒకటి రెండు ముంగురులు ఆమె నుదుట చెమటకు అతుక్కున్నాయి.


"మా దొడ్డమ్మకి మా నాన్నగారూ అమ్మ కూడా లక్ష్యం లేదండీ'' — అన్నది ఒక ఎండు పుల్ల తీసి విరిచి దానినే తదేకంగా చూస్తూ సురేఖ.

"నిజంగా, నాకు కట్నమన్నా హోదా అన్నా పెద్ద ఆశ ఇవాళ లేదు.'' భాస్కరం తలదించుకుని మాట్లాడుతున్నాడు. "పిన్నికి మాత్రం చాలా పాత అభిప్రాయాలున్నాయి.''...

అతని జుత్తు గాలికి రేగి నుదుట పడుతున్నది. అమాయకంగా అగుపిస్తున్నాడు భాస్కరం.

"మీ పిన్నిగారి ఇష్టప్రకారమేగానివ్వండి.... మీ ఆశయ సిద్ధిని మరోరకంగా పొందా వెయ్యండి....'' అన్నదామె.

సురేఖకు భాస్కరం మీద ఒక క్షణంలో గౌరవం మరో క్షణంలో ఈర్ష్యకూడా కలుగుతున్నాయి.



"నా ఆశయం ఆదర్శం అని నేను దేన్నీ అనను. మీరు ఈ ఆశయాలు ఆదర్శాలు నమ్ముతారా?''—

". . . . . . .''

"మా పిన్నిని నేనెంతగా ప్రేమిస్తున్నానో నాకు ఇప్పుడిప్పుడే తెలుస్తున్నది. తనకు కష్టం కలిగించ గలగడం నాకు సాధ్యపడటంలేదు పైగా దీనిలో వసంత....''

"వసంతను ముకుందరావుకు ఇవ్వడం మీకు కిష్టంలేదా ?''

"అబ్బె! నిజంగా నాకు ఎంతో ఇష్టంకూడాను. పైగా ముకుందానికి కట్నం ఇవ్వరాదని కూడా నేను అనను. చెల్లాయి సుఖంకోసరం నేనేమైనా చేస్తాను— పిన్ని బాధపడకపోతే చాలు....''

సురేఖకు చాలా జాలివేసింది. యువకులెందరో తనను ప్రేమభిక్ష వేడుకున్నారు. తన ఆకర్షణకు దాసులమన్నారు గాని— తనకు ఒక ప్రతి పత్తి నిచ్చి, స్నేహభిక్ష ఇమ్మనిగాని, జీవితపు తొలి మలుపు జారుడు సమస్యలలో ఆలోచనల చేయూత నిమ్మనిగాని, ఎవ్వరూ కోరలేదు. తనకు స్నేహం చెయ్యగల పురుషుడు ముకుందరావు ఒక్కడే తటస్థ పడ్డాడు కాని ముకుందరావు దారివేరు. భాస్కరం దారివేరు. సురేఖకు భాస్కరం కోసరం ఏ ఉపకారమేనా చేద్దామనిపించింది.

"నన్ను మీరేం చెయ్యమన్నా చేస్తాను చెప్పండి....'' అన్నది.

భాస్కరం తల ఎత్తలేక పోయాడు. సిగ్గుపడ్డాడు— "సురేఖ మనసును బాధ పెడుతున్నానే అనే బాధ పడ్డాడు.

"నేను మీకు తగినవాణ్ణికాను .... మీ దొడ్డమ్మగారికి నేనో జులాయినని, తాగుబోతునని.... చెప్పండి....'' అతను లేచి అటు తిరిగి కొండమీదకు చూశాడు. ఎవ్వరూలేరు.

పద్మావతి, శైలజా మూర్తీ అజా లేదు. వాళ్ళుపోయి ముప్పావు గంట దాటింది— గడియారం పది గంటల దగ్గర టిక్‌టిక్ మంటోంది.

"ఎందుకని మీరు ఇల్లా నన్ను హింస పెడుతున్నారూ ?'' అన్నది సురేఖలేచి నిలబడి అతని ప్రక్కగా వచ్చి నిలబడి.

"క్షమించండి! ఇంత స్వార్థం మీరు మరో మనిషిలో చూడలేరు...'' లటే చూస్తూ అన్నాడు భాస్కరం.

"మీ పిన్నిగారికి మీరు మీ ఉద్దేశాలు చెప్పలేరా ?'' సూటిగా ప్రశ్న, అడగరాని ప్రశ్నే అడిగాననుకుంది సురేఖ.

"తనకు అన్నీ అపార్థాలే వస్తాయి...అదీగాక.... అదీగాక....'' అట్నుంచి ఇటు తిరిగాడు భాస్కరం ఉద్వేగంగా ఏదో అందామనుకున్నాడు "మీరంటే ఆమెకు ఇష్టం'' అందామనుకున్నాడు నాలిక్కర్చుకున్నాడు— మాటలను మింగేసి తడబడ్డాడు.

సురేఖ భాస్కరం ఇంత సున్నితమైన వాడనుకోలేదు. తనుకూడా బాధ పడ్డది...

"మీరు పద్మావతిని పెళ్లి చేసుకోండి భాస్కరం గారూ....'' అని గిరుక్కున తిరిగి నడవబోయింది.

భాస్కరం అట్నుంచి ఇటు తిరిగి ఆమెను గబగబా అనుసరించబోవడంలో గులకరాయి మీద "బాటు" మడమ పడి జర్రున జారిపోయాడు — అరక్షణంలో అది జరిగిపోయింది....అలోగానే

"సురేఖగారూ ! మాట !" అని పిలవడం ఆ వెంటనే "అబ్బా !" అనడం కూడా జరిగిపోయాయి.

సురేఖ అట్నుంచి ఇటుతిరిగి చూసేసరికి భాస్కరం కటిక రాళ్ళమీద పడి చేతులమీద కాసుకుని, బాధగా లేస్తున్నాడు.

సురేఖ "అమ్మయ్యో ! అదేమిటలా పడిపోయారూ" అంటూ వచ్చింది.

"జారి పడ్డాను.. మరేం ఫర్వాలేదులెండి" అన్నాడు లేచి సర్దుకుంటూ

అతని ఎడం అరచెయ్యి విచ్చిన దానిమ్మపండులాగ చిట్లిపోయింది. ఆ చేతిమీదనే ఒరిగి కాసుకున్నాడేమో మొన దేరిన రాళ్ళు మోసి గీసుకు పోయాయి.

నెత్తురు చిమ్ముతున్నది. మంట పెడుతున్నది.

"వై గుడనెస్....మీరంతలా పారిపోతారేం.."

సురేఖకు భాస్కరం ఆలోచిస్తే నెను గు భయం కలిగించింది.

వెంటనే తన 'వానిటీబాగ్'లోనించి తీసి రుమాలు ఇచ్చింది. "ముందీ నెత్తురుకు రుమాలు కట్టండి" అన్నది.

భాస్కరం చెయ్యి చూసుకున్నాడు. మోచెయ్యి కూడా గీరుకుంది. కాస్త కాలు బెణికింది. "థాంక్స్ ఆ రుమాలు పాడు చెయ్యను .... నాది ఉంది గాని...." అంటూ కుడిచెయ్యి ఎడమ జేబులోకి దూర్చి చూసుకున్నాడు. కాని రుమాలెక్కడ??

అది ఇంతకు క్రితం తను తీసుకొని వేలి వేళ్లకి చుట్టుకుంటూ మాట్లాడాడు. ఈ సంరంభంలో అది గాలికి ఎగిరిపోయి అలనల్లనపోయి దూరంగా ఉన్న బ్రహ్మజెముడు దుబ్బులలో చిక్కుకొంది.

"మరేం ! ఫర్వాలేదు.... ముందా రక్తం చిమ్ముతోంది చూసుకోండి"

భాస్కరం మొహమాటాన్ని లక్ష్యపెట్టలేకపోయింది, సురేఖ— "ఆ చెయ్యి ఇలా ఇవ్వండి" అతని దగ్గరగా వెళ్ళి అతని చెయ్యి అందుకుని రుమాలు కట్టింది.

ఆరుబయలు .... దూరాన మేఘాలు...... దూరంగా సందడి.... దగ్గరగా ఎండ.... ఆకాశాన మేఘాల క్రిందగా గ్రద్దలు ఎగురుతున్నాయి.

భాస్కరం చెయ్యి మండుతున్నది. గాని సురేఖ మృదువైన చేతులతో, మెత్తని రుమాలు చుడుతూ ఉంటే, తదేకంగా, కృతజ్ఞతా భావంతో ఆమెకేసి చూశాడు. మనసంతా ఉద్వేలంగా ఉన్నది ..... ఆమె తల దించుకుని కట్టుకడుతూ.

"ఏం మనుష్యులమ్మా ! ఇంత సున్నితం... కాస్త పాటుకే ఇంత దెబ్బా ?" అన్నది.

భాస్కరం నిగ్రహం పుంజుకుని, ఉచ్ఛ్వాస నిశ్వాసాల వడి నదుముకుని "థాంక్స్" అన్నాడు చెయ్యి వెనక్కి తీసుకుని.... "నా రుమాలు అదుగో అలా అలా విహారం చేస్తోంది ... తెచ్చుకుంటాను...." అని కదలబోయాడు.

"సరిలెండి.... కుడి చెయ్యి పోయిందో.... ఇక క్లాసుకి పాఠాలకి స్వస్తి.... చాల్లెండి... ఎడ్వాంచర్ మీ పద్మావతి నన్ను తిడుతుంది..."

సురేఖ వారించింది.

"మీ ఇష్టం" భాస్కరం ఆమెకు స్వాధీనమైపోయి ఆమె ననుసరించాడు. "ఈమె దేవతా మనిషా?" అన్న దతని మనసు.

(ఇంకా ఉంది)

తీర్థయాత్ర

27 వ పేజీ తరువాయి

రీయుం విప్పి గోచి పెట్టుకుని చంద్రభాగా నదిలోకి దిగాడు. చల్లటి నీళ్ళు తగలగానే అతని శరీరం వణికింది.

"హర గంగా— భగీరథీ—"

అర్జునుడు నీళ్లల్లో కూర్చున్నాడు దోసిలతో నీళ్ళు తీసుకుని వీపు తడుపుకున్నాడు. ముఖం కడుక్కున్నాడు. ఆ నిర్మల ప్రవాహంలో తన శరీరాన్ని సైతం నిర్మలంగా చేసుకున్నాడు. శుభ్రం చేసుకున్నాడు. పంచముడు అర్జునుడు లోపలా బయటా కూడా పరిశుభ్రుడైనాడు. మెల్లిగా నీళ్లను తోసుకొని గట్టుపైకి ఎక్కి అర్జునుడు సింహద్వారం దగ్గరికి వచ్చాడు.

రెండువైపులా దుకాణాల బారులున్నై. కుంకుమ, గంధపుపొడి అమ్మేకొట్లు, పేడా, బర్ఫీ అమ్మేకొట్లు, గిన్నెలు అవీ అమ్మేకొట్లు ఏవి కొనాలి ? ఏవి మానుకోవాలి ? దేవుడి కోసం కర్పూరం కావాలి, చక్కెర కావాలి, రొండిలో దాచిన డబ్బులోంచి నాలుగు పైసలు తీసి ఇవి కొని సింహద్వారం దగ్గరకొచ్చాడు.

'చోఖా' సమాధి దగ్గర ఒక కుర్రాడు నుదుటి మీద గంధం పూసుకుని కూర్చుని వచ్చే పోయే వాళ్ళతో "రండి— బాబూ— రండి చోఖా సమాధి ఇది— హరిజన దేవాలయం" అంటున్నాడు. మామూలు ప్రకారం ఆ కుర్రాడు అర్జునుడి ముందు కూడా గొంతెత్తి అరిచాడు. అర్జునుడు అది విని కిందకు చూస్తూ "ఒరే అబ్బాయి చోఖా వంశపు పిండం క్రింద పడిపోయినప్పుడు నామదేవుడు అక్కడికి వెళ్ళాడు. చాలా మంది మనుషులూ ఖర్చైపోయారు. అస్థిపంజరాల కుప్ప పోగైంది. ఆ అస్థిపంజరాలలో చోఖాది ఏదో ఎలా తెలుసుకోవటం ? నామదేవుడు ఒకొక్క అస్థిపంజరం తీసుకుని చెవిదగ్గర పెట్టుకున్నాడు. ఏ అస్థిపంజరంలోంచి 'హరిహరి' అనే శబ్దం వచ్చిందో ఆ అస్థిపంజరందాన్ని తీసుకుని దాని మీద సమాధి కట్టించాడు." కుర్రాడు నవ్వి అన్నాడు అన్నాడు. 'బాబా—' నీ నమ్మకంనీది— అదంతా నిజమంటావా ?"

కాని అర్జునుడు కర్పూరం వెలిగించాడు. చక్కెర పెట్టాడు. మెడవంచి 'చోఖా బాబా' కాళ్ళు పట్టుకున్నాడు. ఒక ఎర్రటి పైస తీసి ఆ పిల్లాడి కిచ్చాడు. అప్పుడు వాడన్నాడు— "బాబా !" హరిజనులు కూడా దేవాలయంలోకి వెళ్ళొచ్చు. నువ్వూ లోపలికెళ్ళి దేవ దర్శనం చేసుకురా—"

అర్జునుడు ముఖం వెనక్కితిప్పి చూచాడు. మెట్ల దగ్గర, నామదేవుడు ప్రసన్న ముఖంతో చూస్తున్నాడు. మెడలో మాల వేసుకుని చూస్తున్నాడు.

విఠోబాతో 'నువ్వు పక్షివి— నేను నీ అండాన్ని —అని 'శరీరాన్ని చుట్టుగా చుట్టుకొని నీ చరణాలకు వందనం చేస్తాను—' అంటూ గుడిలో నాట్యంచేసి, "వేదాలు చదవవద్దు, వద్దు శాస్త్ర బోధన, నామదేవవ్ ప్రబంధం చదవండి—" అని ప్రబోధించిన నామ్‌దేవ్, "నాయకుని ఉత్తరీయం భూజంమీద పడితే— అతనితోసూ బజారులో పోతాను నేను—" అనే అతని తెలివి తక్కువ జనీ ధన్యురాలు— ధన్యురాలు.

అర్జునుడు రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెట్టాడు. సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆవేశంతో పులకరించి పోయాడు. కాని నామ్‌దేవ్ పాదాలు దాటి ముందుకు వెళ్ళలేదు. సుందరమైన దర్శనం అతను పొందలేదు. రంగ స్థలం మీద నిలబడి అతను నాట్యం చేయలేదు. గరుడ స్థంభాన్ని అతను ఆలింగనము చేసుకోలేదు కూడాను. అతనన్నాడు— 'దేవా నేను లోపలికి రావటం అబద్ధం. నేను పంచముడను. చండాలుడను. పంకిలమైన ఈ ఎముకల ప్రోవుతో నేను నీ దగ్గరకెలా రాను. దేవా నావల్ల అయే పనికాదు. ప్రభుత్వం నీ దగ్గరకు రావటానికి మా వాళ్ళకి హక్కిచ్చింది. నిజమే— వచ్చేవాళ్ళు వస్తారు. కాని ! దేవా ! నేను మాత్రం రాను. నా హద్దు దాటి ముందుకురాను. మా తాతలు తండ్రులు మాదిరిగా నేనూ— జీవిస్తాను. దేవా ! ఇటు బారాయా ! ఈ పంకిలమైన మనసుతో నేను నీ గుడిలోకి రాను. అది సమంజసంకాదు—'

ముసలి అర్జునుడి కళ్ళు ధారాపాతంగా నీళ్ళు కురిపించినవి. అవి తుడుచుకుంటూ అతను అనుకున్నాడు— 'దేవా ! నా శక్తి క్షీణించి పోయింది. ముసలితనం వచ్చింది. మళ్ళా నీదగ్గరకు రావటం పడేదికాదు. ఇదినా ఆఖరి దర్శనం' అని అర్జునుడు క్రింద పడ్డాడు. చాలాసేపు అలాగే ఉన్నాడు. చూచినవాళ్ళు "అరే— ముసలాడు చావలేదు. కదా." అని అనుకున్నారు కాని అర్జునుడు లేచాడు. చిరిగిపోయిన పేలికతో కళ్ళు తుడుచుకుని అడుగడుక్కు వెనక్కి చూస్తూ మైదానంలోకి వచ్చాడు. పిల్లల కోసం బటాణీలు కొన్నాడు. కోడలికోసం కుంకుమ తీసుకున్నాడు. తరువాత సావకాశంగా తన వూరు వెళ్ళటానికి తిరుగు ప్రయాణమైనాడు.

* * *

అర్జునుడు తిరిగి తన గుడిసెకు వచ్చాడు. పండరీపుర యాత్ర చేసుకుని తిరిగివచ్చాడు. ముసలాడు మనిషి— మనిషిగా తిరిగి వచ్చాడని అతని వాళ్ళంతా ఆనందపడ్డారు. కోడలు మామ తెచ్చిన కుంకుమ లక్కపిడతలో నింపుతున్నది. మనమడు తాత తెచ్చిన తీపి పదార్థం తిన్నాడు. పొట్టా చేతులూ ఆ మిఠాయి పూసుకున్నాడు. కొడుకు అడిగాడు. 'దేవుని దర్శనమైందా! లోపలికి వెళ్ళి ఇటుబా ను తనివితీరా చూచావా !

అర్జునుడు సమాధానం చెప్పాడు లేదురా అబ్బాయి— సింహద్వారం దగ్గర నుంచే దర్శనం చేసుకున్నాను. లోపలికి వెళ్ళలేదు. నా మనసొప్పలేదు. అనిపించింది— ఈ అపవిత్రులైన మనసుతోటి ఆ దేవాలయంలోకి ఎలా వెళ్ళేది ? తరతరాల వస్తున్న ఆనవాయితీని ఎలా మార్చేది ? హద్దు ఎలా దాటేది ? నేను లోపలికి వెళ్ళలేదురా—!! ★

లక్మె వానిషింగ్ క్రీమ్ మరియు లక్మె కోల్డ్ క్రీమ్


ప్రొద్దుట...సాయంత్రము...రోజంతా సుందరముగా నుండండి:



ప్రతి ప్రొద్దుట లక్మె వానిషింగ్ క్రీమ్...
తేలికైన, మంచులాంటి, కనబడని లక్మె వానిషింగ్ క్రీమ్ మీకు అత్యంతసొగసైన రూపమునిచ్చి దానిని రోజంతావుంచును. దాని మీద పౌడరుబాగా అద్దుకొనును. దానంతట అదికూడ పట్టులా, మీ చర్మమును మెత్తగా చేయును.

ప్రతి రాత్రి లక్మె కోల్డ్ క్రీమ్...
పోషించు, సమృద్ధయిన, లక్మె కోల్డ్ క్రీమ్‌తో మేకప్‌ను, మలినమును పూర్తిగా తుడిచివేయండి. మీరు నిద్రపోయినప్పుడు, దాని నునుపైన, అందము నిచ్చు నూనెల వలన మీ రూపమును సొగసుగా చేసుకొనండి. ప్రత్యేక కానుక: మేకప్, అంద సంరక్షణను గురించి

లక్మె



నా డైరీలో...

13 వ పేజీ తరువాయి

"ఇటు కిటికీవేపుకు వచ్చినప్పుడు కొనుక్కో." వానిగాడు బిస్కట్ల బండికోసం నిరీక్షిస్తూ కూర్చున్నాడు.

"వెళ్లేం చేస్తోందిరా ?" అన్నాను ఉన్నట్టుండి—అంటూనే లేచి వెళ్లాను. వరాండాలోకి—లక్క పిడతలు పొట్టకు నొక్కుకు పోతోంటే నేలమీద పడి నిద్రపోతోంది. "వెర్రి ముండా !" అనుకొంటూ దాన్ని తీసి పక్కమీద పడుకోబెట్టి లేచాను.

'బిస్కట్' అనే అరుపులు దూరంగా ఎక్కడ మంచో విన్పిస్తున్నాయి. తిరిగి నా పనిలో నిమగ్నమైపోయాను....

*　　　*　　　*

కాలుగాలిన పిల్లిలా గదంతా చిందులు తొక్కటం మొదలుపెట్టాడు గోపాలం. పెట్టంతా తిరగదీసి ఓ జత యిస్త్రీ బట్టలు ఎంచుకున్నాడు. అవి టేబుల్‌మీద పడేసి బూట్‌పాలిష్ ప్రారంభించాడు. ఆదరాబాదరా అదీ అయిందనిపించి క్షురకర్మకు ఉపక్రమించాడు. గడ్డం చెక్కుకు పోబోతే రేజర్ విసిరికొట్టాడు. ఓ క్షణం లేదనుకుని కొత్త బ్లేడు వేసి ఆపని కాస్తా ముగించాడు. బయటికి తొంగిచూస్తున్న గుడ్డల నన్నిటినీ ఒక్క ఊపుతో పెట్లోకి నెట్టిపారేశాడు. రేజరూ బ్లేడూ వగైరా మంచం అడుక్కి గిరవాటెట్టాడు—టైమెంతో ? ఉలిక్కిపడ్డాడు ? "ఛా ! రోజూ ఇదో న్యూసెన్స్ ! రిస్టువాచీ కొనుక్కుంటానని రెండు సంవత్సరాలనుంచీ ఏడుస్తున్నాడు తను. ప్చ్ ! ఎవడికి పట్టింది ? వాళ్ల నాన్న విన్పించుకోడు సరిగదా తేలిగ్గా నవ్వేస్తూ—"ఇంకెంతకాలంరా ? వచ్చే ఏడో ఆ పై యేడో మీ మామగారు కొనిస్తాళ్లే" అనేస్తాడు. ఛ! వెధవ రిస్టువాచీ మామగారు కొనివ్వాలా ? పోనీ ఏ మ్యాటర్‌లాంటిదో అడిగినా అర్థం ఉంది—"ఫాదర్ బొత్తిగా కంట్రీ మాన్." నిట్టూర్చాడు గోపాలం. "చేతికి వాచ్ కట్టుకోకుండానే నరో దగ్గిరకి .... హు ! చిన్నవాళ్ల సాధక బాధకాలు తాతలకీ, తండ్రులకీ ఏం అర్థమవుతాయ్?"

"బాబాయిగారూ ! టైమెంతండీ ?" కిటికీలో మొహం పెట్టి ఇంటాయన్ను అడగక తప్పలేదు.

"మూడుంబావు—ఏమోయ్ ! ఇవ్వాళ కాలేజీకి వెళ్లలేదూ ?"

"లేదండీ—ఒంట్లో బావుండక." మొహం వెనక్కి తీసుకుంటూ గొణుక్కున్నాడు—"ఛ ! బొత్తిగా ఈ ఇండియన్స్‌కి మేనర్సు తెలీవు. పక్కవాడు బ్రతికినా వీళ్లకే కావాలి. చచ్చినా వీళ్లకే కావాలి."

దొడ్డితలుపు తీసుకుని బాత్‌రూంలో జొరబడి తుండు కట్టుకుంటే పైపు సమ్మె చేసింది. వెక్కిరించినట్టు ఓ చెంబెడు నీళ్లు కార్చి వూరుకుంది. గోపాలం గుండె గతుక్కుమంది—పట్టరాని కోపం వచ్చింది.

"వెధవ సమ్మర్ ! టెరిబుల్ సమ్మర్ ! నీళ్లూ రావు. నిప్పులూ రావు. ఇప్పుడెలా ? పోనీ పిన్నిగార్ని .... మై గాడ్ ! గుడ్ ఐడియా !"

"పిన్నిగారూ ! పిన్నిగారూ ! ఒక్కసారి తలుపు తీస్తారా ?" అంటూ ఇంటిగలవారి వంటింటి తలుపు బాదటం మొదలుపెట్టాడు.

"వెధవ నిద్ర ! ఈవిడికిదో జబ్బు ! కూర్చున్నా, నించున్నా నిద్ర ...."

"ఏం నాయనా ఇక్కడ నిలబడ్డావ్ ?" తలుపులు తెరుచుకుంటూనే అడిగింది పిన్నిగారు—"ఇదేమిటి ? ఇప్పుడు నీళ్లోసుకుంటావా ? ఒంట్లో బాగాలేదన్నావట ?"

నుదురు చిట్లించాడు గోపాలం—వెధవ ఆరాలు ! ట్రెయినింగిస్తే సి. ఐ. డి. అవచ్చు—విసుగు కప్పిపుచ్చుకుంటూ—"ఆఁ అన్నానండీ ! తల నొప్పిగా ఉంటేనూ ....."

"అయ్యో ! అయితే ఇంత ఎండలో స్నానం ఏమిటి ? ఒళ్ళు పొక్కిపోదూ ? కాస్త మంచి గంధం తీసి యిస్తాను. నుదురుకి పట్టు ...."

కొప్పు మనబోయి తమాయించుకున్నాడు గోపాలం—"ఒళ్లంతా చాలా చిరాగ్గా ఉంది పిన్నిగారూ ! వెధవ పంపులో నీళ్ళు రావటంలేదు." దాదాపు ఏడ్చుకుంటూనే మాట్లాడాడు.

పిన్నిగారికి కాస్త దయ కలిగినట్టే ఉంది. "సరేలే ! ఎలాగూ తుండు కట్టుకున్నావుగా ? కాసిన్ని నీళ్లిస్తాను. కాళ్లూ, మొహం కడుక్కో. ఎక్కువ నీళ్ళు పట్టలేదు. సాయంత్రం వంట చేసుకోవాలి నేను. మాయదారి పంపు ఎప్పటికి వస్తుందో ఏమో !" అంటూ ఓ పెద్దరకం దస్తా గిన్నెతో నాలుగైదు చెంబుల నీళ్ళ బయట పెట్టిం దావిడ.

గోపాలానికి ఒళ్ళు మండిపోయింది—"వెధవ వంట. ఒక్కపూట చేసుకోకపోతే చస్తారు కాబోలు—మర్యాదగా అడిగితే ఇంతేను. ఇంట్లో జొరబడి నీళ్లబిందె తెచ్చి పడేసుకుంటే బుద్ధి వస్తుంది."—తిట్టుకుంటూ దస్తా గిన్నె కాస్తా స్నానాలగదిలోకి మోసుకుపోయాడు విసవిసా.

మొహానికి మాత్రం రెండుసార్లు సబ్బు పెట్టి స్నానం అయిందనిపించి గదిలోకొచ్చి పడ్డాడు.—"రెరె ! సెంటు ఉంటే ఎంత బావుండును !" నాలిక్కరుచుకున్నాడో క్షణం—తీసి పెట్టుకున్న గుడ్డలు వచ్చనట్టు కన్పిస్తే అవి కాస్తా పెట్లో కుక్కి మరో జత పైకి లాగాడు ..... టైమెంతో మళ్లా అడిగితే ఏం బావుంటుందీ ? నాలుగు దగ్గిర దగ్గిర కావొచ్చు—అబ్బా ! మరో అరగంట కాచుకోవాలా ? ఐదు గంటలకి కదా నరో రమ్మంది. వెయ్యి కళ్లతో ఎదురుచూస్తానంది. క్షణమొక యుగంగా నిరీక్షిస్తానంది—ఛ ! ఈ అర గంట అవటానికి గంట పట్టేలా ఉంది ఖర్మ !"

ఎనిమిదోసారి జుట్టు దువ్వుకుని మరికొంచెం వేజలైన్ రాసి రింగు నుదురుకంటేలా అదిమిపట్టాడు. నెమ్మదిగా చెయ్యితీసి పైపైన మృదువుగా మూడోసారి పౌడ రద్దాడు— అరవై డిగ్రీల కోణంలో అద్దంలో చూసుకుంటూంటే .... కిటికీలోంచి పిన్నిగారి కంఠం !

"నాయనా గోపాలం ! దస్తాగిన్నె వంటింట్లో పెట్టావూ ?" గతుక్కుమన్నాడు గోపాలం నాయన—"లే .... లేదండీ."

"బాబ్బాబు ! ఈ ఎండలో గచ్చుమీద నడిచి అక్కడిదాకా పోయిరాలేను. కాస్త తెచ్చిపెడ తావూ బియ్యం నానబోస్తాను."

మిర్రున ఒక్కసారి కిటికీకేసి చూసి విసవిసా బాత్‌రూంలోకి నడిచి పిన్నిగారి దస్తాగిన్నె కాస్తా

నా డైరీలో...

గడపలోకి గిరవాటెట్టి దభేలుమని తలుపులు మూసుకుని అద్దం ముందుకు పోయాడు గోపాలం...

కుడి బుగ్గమీద పౌడర్ చెదిరినట్లనిపిస్తే ....

* * *

భళ్లుమంటూ డబ్బా కిందపటడ్డ చప్పుడు! కలం విసిరేసి పరుగెత్తాను. కుంపటి చుట్టూ పంచదార ఒలికి ... డబ్బా వెళ్లి అంట్లలో పడి.... తుర్రుమంటూ ఎగిరిపోయింది కాకి. కాకి నోట్లో స్టీలు చెంచా!

నా ప్రాణం గిజగిజ లాడుతోంటే "శ్! శ్!" అంటూ చెయ్యి విదుపుతూ గోలపెట్టాను చెంచా నెమ్మదిగా గోడమీద పెట్టింది కాకి—గోడ దగ్గిరికి పరిగెత్తాను. దేవుడా! గోడ అందలేదు కుర్చీ కోసం లోపలికి పోతే చెంచా కాస్త మాయమవుతుం దేమిటో భయం! కాకిని అదలించటానికి ఆ సమయంలో ఓ బారెడు కర్రముక్క కూడా నా కంటికి ఆనలేదు. అంట్లలో పడివున్న ఎంగిలి గరిటె తీసి కత్తిలా ఝుళిపించాను. నా ఆశాలత చిగిర్చేలా కాకి ఓ గంతువేసి దూరంగా పోయింది. ఇదే అద నుకొని లోపలికి పరుగెత్తాను కుర్చీ కోసం. నా ఆశాలతకు మొగ్గయినా వెయ్యలేదు సరిగదా, చిగురే లేకుండా ఎండిపోయింది—చిటికెలో పాడు కాకి చెంచా కాస్త నోట కరచుకు ఎగిరిపోయింది. ఉస్సురని తెచ్చుకుంటూన్న కుర్చీ వేసుకు కూలబడిపోయాను. పంచదార చెంచా పోయిందనుకుంటే ఏడుపే వచ్చింది. నాలుగేళ్ల క్రితం కాపరాని కొచ్చేటప్పుడు మిగతా సామానుతో పాటు అరడజను చెంచాలు కొంటే ఈ ఒక్కటీ మిగిలింది. ప్రత్యేకంగా దానికి ఎంత స్టోరీ ఉందని! అది మా శ్రీవారికీ నాకూ ఎన్ని తగూలు తెచ్చిందనీ! రోజుల తరబడీ కనపడకుండా దాక్కుని ఎంత ఏడిపించిందనీ! ప్చ్! ఋణం లేదు.

"అమ్మా! చెంచా కాకెత్తుకుపోయిందా?" నానిగాడి సానుభూతి.

"అవున్రా నాయనా! నువ్వయినా కాస్త వరండాలో కూర్చోకూడదూ? పోనీగానీ బిస్కట్లు కొనుక్కున్నావా?" అన్నాను గుర్తువచ్చి.

"ఇవ్వనన్నాడే!" బిక్కమొహం వేశాడు వాడు.

"ఏం? ఎందు కివ్వనన్నాడు?"

"డబ్బులేమో ...." అంటూ వాళ్ల నాన్న ఇచ్చిన పైసా చూపించాడు.

నా మతి మండిపోనూ! పిల్లవాడికి డబ్బు లివ్వకుండా కొనుక్కోమంటె ఎలా మరి? పాపం నానిగాణ్ణి చూస్తోంటే జాలి వేసింది—"పోనీ లేమ్మా! సాయంత్రం నాన్నని బోలెడు బిస్కట్లు తెమ్మందాం." అంటూ వాణ్ణి దగ్గరికి తీసుకున్నాను—చంటిది లేచింది కేరుమంటూ. లోపలికి వెళ్లబోతే వీధి తలుపులు .... టక్! ... టక్...

"ఎవరు వారు?"

జవాబు లేదు.

"వస్తున్నా నుండండి."

తలుపులు తెరిచాను.... పరస్పరం తడబాటు!

"(ఫలానా) వారిల్లిదేనండీ?"

"అవునండీ! రండి."

"మీరు ...... "

"ఆఁ నేనేనండీ! రండి."

"మేము ...."

"లోపల మాట్లాడుకోవచ్చు. రండి."

ఇద్దరు ఆడవాళ్ళూ, ఇద్దరు మగవాళ్ళూ, ఓ కుర్రవాడూ!

గబగబా మడతమంచం వాల్చాను ఉన్న రెండు కుర్చీలూ సర్దాను. మరో రెండు కుర్చీలు కొనమని శ్రీవారితో చెప్పి చెప్పి చాలించుకున్నాను. మీమీదో కథ రాస్తానని బెదిరించినా లాభం లేకపోయింది. ఇక పుత్రరత్నం ఉన్న రెండు కుర్చీలను కూడా రైలుబళ్ళలా, సిటీబస్సుల్లా దొర్లిస్తూంటాడు. లేదా మధ్యాన్నాలవేళ గోడ దగ్గరికి లాక్కుపోయి అవతలివాళ్ళు కన్పించకపోయినా "మీ వంటయిందాండీ ? మీవారు నిద్ర లేచారాండీ ?" అని అడుగుతూంటాడు.

తీరా ఇంటికి పెద్దమనుష్యులు వచ్చినప్పుడు గోడ దగ్గరికి పరిగెత్తి కుర్చీలు తెచ్చి సర్దటం మాత్రం బాగా అలవాటైంది నాకు.

"కూర్చోండి! నిలబడే ఉన్నారు."

"మీరేదో పనిలో ఉన్నట్టున్నారండీ!"

"అబ్బే! లేదండీ! పనేంలేదు. పనిమనిషి రాలేదని ఎదురుచూస్తున్నాను."

"అయ్యో! లోపల పాప ఏడుస్తోందండీ!"

"అవునండీ! ఇప్పుడే లేచింది. పాలు పట్టాలి."

"మాచేతికిచ్చి మీరు పాలు కలపండి! అయ్యో అదేమండీ .... పంచదార ..."

"వెధవకాకి డబ్బా తోసేసిందండీ."

"ఇక్కడ కాస్త అడ్డంగా తడకలు పెట్టించలేక పోయ్యారూ ?"

"పెట్టినవే తీసేశామండీ! ఈ వేసంకాలం ఇటునుంచే గాలి వస్తుందనీ. నే నిప్పుడే వచ్చేస్తాను. మీరు గదిలో కూర్చోండి."

ఓ ప్లేటులోకి పంచదార ఎత్తి బల్లమీద పెట్టి పాలు కలిపి సీసాలో పోశాను—పాపని అందుకుని తాపీగా కూర్చున్నాను.

"పనివేళ వచ్చి మీకు చాలా ఆటంకం ..."

"అబ్బే! లేదండీ" నవ్వుతూ అన్నాను—"పాపకి నలుగు పెడుతూ, వంటిల్లు కడుగుతూ, పప్పు రుబ్బుతూ .... కూడా అతిథుల్ని ఆహ్వానించటం అలవాటేనండీ!" నాతోపాటువారూనవ్వారు.

"మరి మిమ్మల్ని చూడాలంటే బాధపెట్టక తప్పదండీ! మీ ఖాళీ సమయాలేమిటో.. .."

"ఖాళీ ఎక్కడండీ ? ఈ పిల్లలతోనే సరిపోతుంటుంది."

"మీతోచాలావిషయాలుమాట్లాడాలనివచ్చామండీ!"

"తప్పకుండా. నిరభ్యంతరంగా మాట్లాడండీ!"

"అసలు మొదటే మా ఊహ తప్పింది. చెప్పద్దూ ? మిమ్మల్ని చూసి షాక్ తిన్నామండీ!"

నేను నవ్వాను—"మీరూ అదేమాటన్నారు .... వాస్తవాలకన్నా ఊహలూ, స్వప్నాలూ చాలా మధురంగా ఉంటాయండీ! మీ రేవేవో ఊహించుకుని నన్ను చూడటానికొస్తే నేనేం చెయ్యానండీ ?"

"లేదండీ! అలాంటి నిరాశేంకాదు. మా ఊహలు తప్పాయని మాత్రమే అంటున్నాను .... అయితే మేమడిగే విషయాలకు మీరేంఅనుకోరుగా?"

"నేనేం చెప్పనండీ? మీ రడిగే విషయాలు అంత అనుకోవాల్సినవిగా ఉంటాయంటారా ?"—కొంచెం నవ్వులు!

"మీరిలా మాట్లాడుతోంటే మరి మేము అడగలేమండీ!"

ఓ పది నిముషాల్లో అతిథు లందరూ, పెద్దలైన తలిదండ్రులూ, పిన్నలైనవారి కూతురూ, కొడుకూ, మరో చిన్న కొడుకూ అంతా బాగా పరిచయమయ్యారు. పేర్లూ, చదువులూ, ఉద్యోగాలూ అన్నీ.

చాలాసేపు కబుర్లలో కొట్టుకుపోయాం.

"ఈనెల (ఫలానా) పుస్తకంలో సాహిత్య సమీక్ష వచ్చింది. చూశారా ? అందులో మీమీద కూడా ఏదో విమర్శలాంటిది ...."

"లాంటి దేమిటండీ ? విమర్శే. ఏవో తప్పులెంచుదామని పంతంపట్టి పప్పులో కాలువేసిన విమర్శ"

"ఆయనఏదోపొరపాటు ఎత్తి చూపించారుకదండీ!"


"మరొక్కసారి ఆ నవల చదివితే ఆ పొరపాటు దొర్లించినందుకు వారే నొచ్చుకునేవారండీ!—అయినా నాఉద్దేశ్యం చెప్పాలంటే ఆయన విమర్శ నిష్కల్మషంగా చేసినట్లు మాత్రం లేదండీ! ఆడపిల్లలేం రాయగలరు ? వాళ్ల మొహం అన్నంత చులకనగా చెప్పటం సద్విమర్శకుని లక్షణం కాదండీ! పొరపాట్లు మానవ సహజం! అందులోనూ అనుభవం తక్కువైన చిన్న పిల్లలు రాశారూ అంటే ఏవో లోపాలూ, పొరపాట్లూ ఉండచ్చు. ఉండి తీర్తాయి కూడాను. అటువంటప్పుడు పెద్దవారూ, మంచి విమర్శకుడిగా పేరు పొందినవారూ కదా ఆయన .... నిర్మొహమాటంగా నిర్భయంగా "ఫలానా రచనలో, ఫలానా చోట ఇటువంటి పొరపాటు జరిగింది. ఎత్తి చూపిస్తున్నందుకు కించపడక సరిదిద్దుకోవటానికి ప్రయత్నించి, భవిష్యత్తులో అభివృద్ధి పొందాలని వాంఛిస్తున్నాను" అంటూ ఖచ్చితంగా ఎందుకు రాయకూడదు ? వారి విమర్శలో సహృదయత ఎక్కడ ? కనిపెట్టిన లోపాలు అంత అవహేళనంగా అంత వెటకారంగా రాయటమే సమంజస మనుకున్నారా? అందరి రచనలనూ ప్రస్తావించి ఉన్నవీ లేనివీ కల్పించి అపహాస్యాలు చేస్తూ రాయటానికి అసలాయనేం విమర్శలు తెలిపే మీటరా ?— వన్నడిగితే సాహిత్య సమీక్ష అంటూ రాసిన ఆ వ్యాసం అంతా ఉత్త చెత్త! ఆయన విమర్శించిన విషయాలు నా దృష్టికేమీ సరిపడలేదు "పుర్రెకో బుద్ధి. జిహ్వకోరుచి" అన్నట్లు—ఒక్కో పాఠకుడు ఒక్కొ రకంగా ఇష్టపడవచ్చు. అలాగే లక్షలాది పాఠకులలో ఈ విమర్శకుడూ ఒకడు అనుకోవటం తప్పితే ప్రత్యేకతేముంది ?"

"క్షమించండి! మీ మాటకి అడ్డు వస్తున్నాను! ఆయనలో ప్రత్యేకత లేదంటే నేను ఒప్పుకోను విమర్శకుడిగా ఆయనకు ...."

"మంచి పేరు ఉందంటారు. కావచ్చండీ! అయితే ఆ విమర్శలో పక్షపాతం ఎందుకంటాను ? పోనీ నా రచనలో ఓ పొరపాటే దొర్లిం దనుకోండి దాన్ని గురించి ఎన్ని పుస్తకాల్లో రాస్తారు? పాడిందే పాడరా అన్నట్లు చెప్పిందే ఓ నెల్లాళ్ళు పోనిచ్చి మళ్ళా చెప్పటమా ? ఆమధ్య చూశారా? సుమారో సంవత్సరం క్రితం ఇద్దరు మహామహులు వాక్—యుద్ధానికి సిద్ధపడ్డారు. ఈ పండితులంతా తలో పక్షం చేరిపోయారు. ఆడవాళ్ళకన్నా అధ్వాన్నంగా దెబ్బలాడుకున్నారు. అంతలేసి గొప్ప గ్రంథాలలో పొరపాట్లు ఉండగా లేంది ఇక ఆడపిల్లలు రాసుకునే పిట్టకథల కేమి లెద్దురూ!"

"ఒక రచనను విమర్శించే హక్కు ఎవరికీ లేదంటారా ?"

"మీరు నన్ను చాలా అపార్థం చేసుకుంటున్నారండీ! విమర్శే లేనప్పుడు రచనకు విలువే లేదు. సానపట్టిన వజ్రం తళతళ లాడుతుందన్నటు పది విమర్శలకు గురియైన రచనే నిలుస్తుంది—కాని ... ఆ విమర్శ సహేతుకంగా సహృదయంతో చేసినదై ఉండాలి. స్త్రీ పురుష



వేదాలకుగానీ, వ్యవర వైషమ్యాలకుగానీ తావుండ కూడదు. అవునంటారా ?"

"అనట మేమిటండీ ? అది మాత్రం ఒప్పుకు తీరాల్సిన విషయం. పోనీ పాఠకులు మీకు రక రకాల ఉత్తరాలు రాస్తుంటారు కదా ? వారి సలహా లేమైనా పాటిస్తుంటారా మీరు ?"

"నాకు సమంజసంగా తోస్తే తప్పకుండాను. నేను గ్రహించుకోలేని లోపాలు పాఠకుల సల హాల ద్వారానే తెలుసుకుంటున్నాను. అటువంటి ఉత్తరాలు చదవటం అంటే ఎంతో సంతోషం కూడాను. కాని, పాఠకుల్లో కూడా కొంతమంది అవధులు మించి దెబ్బలాట కొచ్చినట్లు రాస్తూంటా రండీ! నవ్వొస్తుంది."

"అస లంత చిన్న చిన్న లోపా లెందు కుండా లుండాలి మీలో ?"

"చూడండీ! రాసే వ్యక్తి ఒక్కడే! చదివేవాళ్ళు లక్షలాది. ప్రతీ ఒక్కరినీ సంతృప్తి పరచటం

నా డైరీలో ఒక పేజీ!

అసాధ్యం! ఈ విషయం కూడా పాఠకులు గుర్తు ఉంచుకోవాలి"

"అవశ్యం! అదే మరుపు వస్తూంటుంది లెండి! అయితే ఒక రచన ఏవిధంగా ఉంటే ప్రాచుర్యం వస్తుందని మీ అభిప్రాయం ?"

"మంచి ప్రఖ్యాతి రావాలని ఆశించే—ఏవిధంగా పేరు ప్రఖ్యాతి వస్తుందో వూహించి—దాని కోసం రాసే అలవాటు లేదండీ నాకు. అసలీ ప్రాచుర్యంమీద నమ్మకం కూడా పోతోంది నాకు. వాస్తవాలు రాస్తే "అసహజం—అమా నుషం" అంటూ దుయ్యబడతారు నిజంగా అసహజాలే రాస్తే కిమ్మనకుండా ఆమోదిస్తారు కార్లూ, మేడలూ, షికార్లూ, సినిమాలూ, తోటలూ, పార్కులూ, బీచ్‌లూ, బోట్లూ ఇవన్నీ ఉన్న స్వప్నలోకం కావాలి పాఠకులకి. కష్టాలూ, కన్నీళ్ళూ, వేదనలూ, సమస్యలూ, నిట్టూర్పులూ, నిరాశలూ, నిజ జీవితాలూ రాస్తే చేదు కషాయంలా మింగలేక మింగుతారు"

"రోజూ మనం అనుభవించే బాధలే పుస్త కాల్లో కూడా ఎందుకంటారు కదండీ వాళ్ళావంది ?"

"మీ మొహం అందంగా లేదని అద్దంలో చూసు కోవటం మానేస్తారా ? చెప్పండి. మన మొహం ఎలా ఉంటుందో తెలిసినా అద్దంలో చూసు కొంటూనే ఉంటాం. అలాగే ఓ రచనలో పాత్ర మీకు ప్రతిబింబం కావచ్చు. దానివల్ల కొన్ని మంచి చెడ్డలు బయట పడచ్చు అందుకే రచన జీవి తాన్ని పోలి ఉండటం."

"రచన బొత్తిగా వూహాలోకాల్లో విహరించ కుండా వాస్తవాలకు దగ్గరగా ఉండితీరా లంటారా మీరు ?"

"నా ఉద్దేశ్యం అంతే మరి—కాలక్షేపానికో,

నవ్వులాటకో రాసుకున్నవాటిని వదిలేద్దాం. పోతే కాస్త విలువగల రచనగా ఎంచాలంటే మాత్రం అది వాస్తవాలకు ప్రతిబింబంగా ఉండాలి. మనలో మనకే తెలీకుండా దాగివున్న లోపాలనీ— సాంఘిక దురాచారాలనీ అర్థంచేసుకుని సర్దుకోటానికి ప్రయత్నించగలం. అతి సంకుచితమైన మన అంతరంగాలను విశాలం చేసుకోగలం. హద్దులలో ఇమిడిపోయిన మేధాశక్తిని పెంపొందించుకోగలం— చదువరికి ఉపయోగపడని రచన రచనకాదు. పుస్తకం అనేది చదివేసి దాచుకోటానికి కాదు. చదివినదాన్నుంచి మనం కొంత గ్రహించగలగాలి. కొంత ఆచరించగలగాలి. కనీసం అప్పుడప్పుడూ గుర్తుకైనా తెచ్చుకోగలగాలి. అంతేగాని .... వెర్రిగా చదువుతూన్నంతసేపూ వూహాలోకాల్లో విహరింపజేసి — జీవితాలకు సుదూరంగా తీసుకుపోయి అతిశయాలు చిత్రించి మభ్యపెట్టి— ఏవేవో ఆనందాలు కల్పించి ఆశపెట్టి — చదువరి సమస్యలకు ఏవిధంగానూ సంబంధంలేకుండా రచన సాగిస్తే ఫలితం ఏమిటి ? కమ్మటి సారాయిలో మునిగిపోయిన స్వప్నావస్థకీ దీనికీ భేదంలేదు— తెలివి వచ్చాక వేదనే మిగులు ! కథానాయకుడికి లాటరీలో లక్ష రూపాయలు వచ్చాయనీ—పెద్ద మేడా, చిన్న కారూ కొన్నాడనీ— సినిమాస్టార్ల వెంట ఝుమ్మని తిరుగుతున్నాడనీ కథ రాస్తే— పర్యవసానం ఏమిటి ? పోనీలే పాపం వాడు సుఖపడుతున్నాడని సంతోషిస్తామా ? అయ్యో ! ఆ లక్ష రూపాయలూ మనకే ఎందుకు రాలేదూ ? అని చాటుచాటుగా ఏడ్చుకుంటాం — అప్పటినుంచీ లాటరీ కట్టటం కూడా మొదలుపెడతాం. అలా కాకుండా కథానాయకుడు లాటరీలు కట్టి సర్వనాశనమై పోయాడనీ చివరికి పశ్చాత్తాపంతో ఆ దురలవాటు తప్పించుకోగలిగాడనీ రాస్తే దాని వల్ల చాలా ప్రయోజనం ఉంది.''

''మొదటి కథ మాత్రం అబద్ధం ఎందుకైంది ? లాటరీలో ఎవరో ఒకరు గెలవాలి కదండీ ? వాడే మన కాకథానాయకు డెందుకు కాకూడదు ?''

''కావచ్చు. కాని, వాడి చరిత్ర చిత్రించటం వల్ల ఉపయోగం లేదు. పైగా నష్టం కూడాను, ఒక వ్యక్తికి లాటరీలో లక్ష రూపాయలు వచ్చాయీ అంటే వాడు మినహా లక్షమందీ దౌర్భాగ్యులే. గెల్చినవాడు ఒక్కడు ! పోయినవారు లక్షమంది. ఇక్కడ— ఈ పరిస్థితిలో ఎవరి కథ చెప్పదగింది ? ఎవ్వరి కథ చెప్పడంవల్ల ప్రయోజనం ఉంది ? రచన చదువరిని తీర్చిదిద్దాలి. చదువరి, రచన అనే అద్దంలో తన లోపాలు చూసుకుని దిద్దుకోగలగాలి—పుస్తకం మనిషికి మార్గదర్శకం కావాలంటే జీవితాలూ, వాటి సమస్యలూ చిత్రించక తప్పదు.''

''పాఠకుల రెస్పాన్స్ ఇలా తల్లక్రిందులుగా ఉండటానికి కారణం ఏమిటంటారు ?''

''జబ్బు పోగొట్టి ఆరోగ్యంగా ఉంచుతాయని తెలిసినా మందుబిళ్లలంటే ఎవరికీ నచ్చవండీ ! జ్వరంలో ఉండి కూడా చాక్‌లెట్లూ, బిస్కట్లూ తినాలనే గోల చేస్తుంటాం, తియ్యగా ఉంటాయి కాబట్టి. ఇది మన బలహీనత. ఏం చేస్తాం ?''

''జ్వరమే లేనివాళ్లు కూడా మందుబిళ్లలెందుకు తినాలి. చెప్పండి ?''

''ప్రతి మనిషికీ మానసికమైన జ్వరం— అంటే ఏవో లోపాలు ఉంటాయి. సంపూర్ణ మానవత్వం ఏ వ్యక్తికీ సిద్ధించదనే నా అభిప్రాయం.'' (ఇంకా వుంది)

స్టంటు సినిమా కథ

19 వ పేజీ తరువాయి

నవ్వాడు. సుందరం విట్వేసినందుకు. ఇంత బతుకూ బతికి, సుందరం విట్టుకి నవ్వవలసి వచ్చిందే అని అతని మనస్సు బాధ పడింది. అయినా విధి బలీయం. ఏక్షణంలో ఎవరు ఏం చేయాలో ఎవరికి తెలుసు ?

గోపాలం సుందరాన్ని కూర్చోమని సైగ చేశాడు.

సుందరానికనుభవ పూర్వకంగా తెలుసు. అలా కూర్చోమంటే బిల్లు గోపాలమే ఇచ్చేస్తాడని. సుందరం మిత్రబృందం కూర్చుందుకు చోటు లేక—''వస్తామోయ్'' అని వెళ్ళిపోయారు సుందరం మాటాడకుండా కూర్చుని—

''ఈ హొటల్నేమనాలోయ్—పారడైజు ఆఫ్ వెర్రెయ్యపాలెం అనాలా?'' అంటూ మరో విట్వేశాడు. అది విట్టు కాదనుకుని నవ్వరేమోనని భయం వేసి తనే ముందుగా గట్టిగా నవ్వేశాడు.

ఈసారి శంకర్రావు కూడా నవ్వాడు (ఇందాక నవ్వలేదు)

''నవ్వుతావేం? పారడైజుకాదు. హెల్లే అనుకో. మిల్టన్ ఏమన్నాడు? స్వర్గంలో బానిసత్వంకంటే నరకంలో రాచరికమే మేలన్నాడు. అహ్హాహ్హా— ఏమంటావ్?''

సుందరం విట్లేస్తుంటే అది విట్టువునో కాదో ఆలోచించి మరీ నవ్వవలసొస్తోంది. సుందరం మీద గౌరవంకొద్దీ గోపాలం నవ్వుతున్నాడు దాంతో సుందరం మరీ రెచ్చిపోతున్నాడు.

''కొంచం చట్నీ తీసుకురా!'' అన్నాడు శంకర్రావు

''ఏమిటి విశేషం. ఈవేళ చాలా హుషారుగా ఉన్నావ్?'' ఉండబట్టలేక అడిగేశాడు గోపాలం.

''మైడియర్ ఫ్రెండ్స్— ఇలాంటి విషయాలు స్వయంగా చెప్పకూడదు. ఇది చూస్తే మీకే తెలుస్తుంది'' మాట్లాడానికి విట్లు దొరక్క అవస్థపడుతూ జేబులోంచి కవరు తీశాడు సుందరం

ఏదో అనుమానం వచ్చిన శంకర్రావు మూర్ఛపోబోయి, ఇందాకటి మిత్రుడి మందలింపు గుర్తు రాగా, మానేశాడు.

కవరులోంచి నీలిరంగు కాగితం— దానిమీద ఎర్రసిరా అక్షరాలు ......

నది ఒడ్డున ప్రశాంతంగా ఉంది. సుందరం మదిలో హుషారులాగ కెరటా లెగి రెగిరి పడుతున్నాయ్. ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ ప్రకాశం పెన్ తీశాడు.

''ఒక్క నిముషం మాటాడించకండి —ఇన్‌స్పిరేషన్ వస్తోంది'' అన్నాడు ప్రకాశం. అంతా నిశబ్దం వహించారు.

దభీమన్న చప్పుడుతో అక్కడి ప్రశాంత వాతావరణంలో సంచలనం కలిగింది. వెనక్కు తిరిగి చూసేసరికి విశ్వనాథం. ఇందాకా శంకర్రావు చెప్పిన మాటలు గుర్తు కొచ్చాయి గోపాలానికి. ఉండరా —ఇంకాస్సేపువుంటే ఇంటిమీంచి దూకుతాన్నాట్ట ఎందుకో?

''ఒరేయ్ విశ్వనాథం—ఏమి ట్రా అది ఏక్కణ్ణించి వూడి పడ్డావ్'' ప్రకాశం పలకరించాడు మిత్రున్ని చూస్తూనే పరుగెత్తు కొచ్చాడు విశ్వనాథం. ''చెట్టుమీంచిరా!''

''అదేమిటి—చెట్టుమీంచి దూకడమెందుకూ! నేరేడు పళ్ళకోసంగానీ చెట్టెక్కావేమిటి?'' అడిగాడు ప్రకాశం

విశ్వనాథం తన ధోరణిలో తనున్నాడు ''ప్రాక్టీస్ బాగానే ఉంది. ఇప్పుడు నేను చెట్టుమీంచి అవలీలగా దూకేయగలను.''

''ఎందుకురా ప్రాక్టీసు. చెట్లమీంచి దూకవలసినంత కర్మేం పట్టిందిరా నీకు?''

''కర్మ కాదురా వెర్రి వాయనా—అదృష్టం. నిన్ను దూకమంటూ—దూకగలవా?—నాకు మాత్రం అంత సులువుగా వచ్చిందనుకున్నావా —ప్రొద్దుట్నించి ప్రాక్టీస్ చెస్తూంటే ఇప్పటికి చెట్టుమీంచి దూకులున్నాను ముందు గోడమీంచి ప్రాక్టీసు చేశా.''

ప్రకాశాని కిదేం అర్థం కాలేదు. ''ఏమిట్రా అది ఎందుకా ప్రాక్టీస్ నీకేమన్నా మతిపోలేదు గదా!''

సమయానికేం గుర్తు రాక సుందరం విట్ వేయలేదు.

''నే నింకీ ఊళ్లో ఉండబోవడం లేదోయ్— మద్రాసుకి మకాం మార్చేస్తున్నా—''

''అందుకని చెట్లు దూకుతున్నావా?''

''అదా నీ అనుమానం—'' విశ్వనాథం జేబులోకి చెయ్యి పోనిచ్చాడు. ''గురూ! పిడి క్కాడా' శంకర్రావు నసుగుతూండగా విశ్వనాథం జేబులోంచో కవరు బైటికి తీశాడు.

అంతా ఆశ్చర్యంగా చూశారు.

కవరులోంచి నీలం రంగు కాగితం. ఎర్ర సిరా అక్షరాలు.

ఓసారి గొంతు సవరించుకుని విశ్వనాథం చదవడం మొదలెట్టేడు.

ప్రియమిత్రుడు విశ్వనాథానికి బ్రహ్మం వ్రాయునది. నాకు మొన్న లాటరీలో ఫస్ట్ ప్రైజు వచ్చింది రెండు లక్ష లొచ్చాయి. ఈ డబ్బు వేం చేయాలా అని ఆలోచించాను. సినిమా తీయాలనిపించింది.

మనమంతా చిన్నప్పట్నుంచీ స్నేహితులం. కళాకారులం. కాని, మనలోని కళ అభివృద్ధి చెందేదెలా? లోకానికి తెలిసేదెలా? అందుకే మన ఊరివాళ్ళతో సినిమా తీయాలని నిశ్చయించుకున్నాను.

నువ్వు చిన్నప్పట్నుంచీ గొప్ప నటుడివి. నీలో వృద్ధిలోకి రావలసిన, నటుడి కుండవలసిన లక్షణాలు చాలా ఉన్నాయ్ నా పిక్చర్‌లో నిన్ను హీరోగా బుక్ చేస్తున్నాను నువ్వు కాదనవనే నమ్మకం

స్టంటు సినిమా కథ

నా కుంది సోమవారం 1 వ తేదీన నేను మనూరు వస్తాను ఊళ్లో పెద్ద లెవ్వరికీ ఈ విషయం తెలియ నీకు. మన మిత్రుల్లోనే రహస్యంగా ఉంచేయ్.

ఒకటి మాత్రం గుర్తుంచుకో. నేను తీయ బోయేది స్టంటు చిత్రం. స్టంటు హీరోకి కావలిసిన లక్షణాలన్నీ అలవర్చుకో. బాగా స్టంటు చిత్రాలు చూసే నీకి విషయం నేనట్టే చెప్పక్కర లేదు.

పిక్చర్ ఫెయిలౌతుందని నాకేం భయం లేదు. లాటరీలో వచ్చిన డబ్బు కదా!

నీ ప్రియమిత్రుడు
బ్రహ్మం.

"అంటే— ఆ పిక్చర్లో మనం హీరో అన్న మాట!" అన్నాడు విశ్వనాథం.

"నేను మ్యూజిక్ డైరెక్టర్ని" అన్నాడు గోపాలం.

"నేను సాంగ్సూ— డైలాగ్సూ రాస్తున్నా" అన్నాడు ప్రకాశం.

"నేను కమేడియన్ని" అన్నాడు సుందరం.

విశ్వనాథం అందరివంకా ఓసారి ఆశ్చర్యంగా చూసి— మనమంతా ఒక గ్రూపులో వాళ్ళ మన్న మాట. అయితే అంతా కలిసి పనిచేయాలి" అన్నా డుషారుగా.

"నేను......నేను......" శంకర్రావుకి మాటలు తడబడ్డాయి. అంతల్లనే తనేమీ కాదనేమాట గుర్తుకొచ్చి అవమానం కమ్ముకోగా త్వర త్వరగా అడుగు లేసుకుంటూ వెళ్ళిపోతుంటే గోపాలం పిలిచాడు.

"నేను నిన్ను సింగర్‌గా బుక్ చేసి—హీరో పాట లన్నీ నీకే ఇస్తాను. వెళ్ళిపోకురా!" అంటూ పిలి చాడు. శంకర్రావు వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు.

అంతా ఎవరి ఉషారులో వారున్నారేమో— ఎవరూ ఏం బాధ పడలేదు.

"కానీ విశ్వనాథం! నేనొకటి చెప్తున్నా విను. కేవలం చెట్లు దూకినంత మాత్రాన స్టంటు హీరోవికావు. కాస్త మొహంలో ఫీలింగ్సూ అవీ చూపించాలి. అంటే యాక్షనుండాలన్నమాట" అన్నాడు ప్రకాశం.

"స్టంటు హీరో క్కూడా యాక్షన్ కావాలా? ఈ సంగతి నాకు తెలీదే—" విశ్వనాథం ఓసారి ఆశ్చర్యపోయాడు. "నాకు యాక్షన్ కూడా వచ్చు. కానీ, స్టంటు పిక్చర్లో యాక్షన్ అవసరం లేదేమో అనుకున్నానంతే!"

నీకు యాక్షన్ వచ్చినా—ట్రైనింగుండాలి. బొత్తిగా అనుభవం లేదుకదా—అంచేత అనుభవశాలు రెవరైనా ఉంటే కలుసుకుని వాళ్ళ దగ్గిర సల హాలు తీసుకోవాలి!"

"నువ్వు చెప్పింది బాగానే ఉంది మనూళ్లో నైనా ఉన్నారా అలాంటి వాళ్ళు"

"శేకేం—నా ఎరికలో ఇద్దరున్నారు" అన్నాడు సుందరం. "ఒకావిడ సినిమాలో కూడా వేసింది. రెండో ఆయన నాటకాల్లో పెద్ద పేరున్నవాడు. నా కాయన పేరు తెలీదుకానీ—అంతా ఆయన్ని రావణాసురు డంటారు."

"మనూళ్లో సినిమాల్లో యాక్టు చేసిన ఆడవాళ్ళున్నారా—ఎవరావిడ?" విశ్వనాథం కుతూహలంగా అడిగాడు.

"ఆవిడ నాకూ తెలుసు" అన్నాడు గోపాలం. "ఎక్స్‌ట్రా వేషాలు వేసినా అందరు ఎక్స్‌ట్రాల వంటిదికాదు. ఎక్స్‌ట్రారాజం అన్నమాట. సీతారామ కల్యాణంలో అహల్య వేషం వేసింది. శ్రీరామచంద్రుడి కాళ్ళు తగలగానే రాయి అహల్యగా మారిపోతుంది చూశావూ? అక్కడన్నమాట. ఆవిడకా పిక్చర్లో డైలాగులు కూడా ఉన్నాయి. "శ్రీరామచంద్రా! ధన్యోస్మి!" అంటుంది. అప్పు డెంత బాగా నటించిందనుకున్నావ్. ఎన్నేళ్లో రాయిలా పడుండి—హఠాత్తుగా మనిషి నయ్యేననే ఆనందం ఆ కళ్ళల్లో స్పష్టంగా కన్పించింది. అదే సమయంలో శ్రీరామచంద్రునిమీద భక్తి తాత్పర్యాలు కూడా ఆ కళ్ళల్లో కన్పించాయి. అయితే దురదృష్టవశాత్తూ—ఆమె యాక్షన్ నెవరూ గుర్తించలేదు. ఆ పిక్చర్ మొత్తానికి ఆవిడ యాక్షన్ నాకు నచ్చింది."

"ఐతే తక్షణం ఆవిణ్ణి కలుసుకోవాలి" అన్నాడు విశ్వనాథం.

"మరి రెండో ఆయన విషయం" అన్నాడు సుందరం.

"వన్ బై వన్. ముందిది కానీండి. లేడీస్ ఫస్ట్" అన్నాడు విశ్వనాథం.

మిత్రులంతా బయల్దేరారు. సందు మలుపు తిరుగుతుంటే శంకరావు కలిశాడు. ఉషారుగా నవ్వి—"నేనూ బుక్కయ్యాను విలన్ పోర్షనిచ్చాడు" అన్నాడు.

"వెరీగ్లాడ్!" అన్నాడు గోపాలం.

"ఇప్పు డెక్కడికోయ్. బయల్దేరారు."


"సీతారామ కళ్యాణం ఫేమ్—అహల్య గారింటికి"

అహల్య ఇల్లు మామూలుగా చిన్న పెంకుటిల్లే. ఐనా ఊళ్లో ఉన్న అందమైన పెంకుటిళ్ళలో అదొకటి.

"ఏమండీ—అహల్యగారున్నారా?" కమేడియన్ ప్రతి విషయంలోనూ చొరవగా ఉండాలిట. సుందరం ఈ సత్యాన్నే అక్షరాలా పాటిస్తున్నాడు.

"ఎవరూ?" అంటూ ఒక పాతికేళ్ళ యువతి వచ్చింది. విశ్వనాథం ఆమెను పరీక్షగా చూశాడు. ఆమే అహల్యయ్యి యుండవొచ్చు. ముఖం చాలా అందంగా ఉంది. ఆకర్షణీయమైన బట్టలు కట్టుకుంది. అబ్బా! ఎక్స్‌ట్రాల క్కూడా ఇంత అంద ముండాలా అనిపించిందతనికి.

(సశేషం)



న్యూఢిల్లీ లేఖ

7 వ పేజీ తరువాయి

పెద్ద వివాదం లేవదీశారు. దేశంలో అధిక సంఖ్యాకుల దినసరి ఆదాయం మూడు అణాలు మాత్రమే ఉండొచ్చునన్నారు. దానిమీద ప్రణాళికల (మాజీ) మంత్రి శ్రీ గుల్జారీలాల్‌నందా ఈ వాదాన్ని ఖండిస్తూ నేషనల్ శాంపుల్ సర్వే వారి పరిశీలనలు ఉదహరించారు. దేశంలో మొత్తం జనాభాలో అతి పేదగా బ్రతికే జనంయొక్క నెలసరి పర్ కాపిటా ఖర్చు గ్రామాల్లో 8 రూపాలయనీ, పట్నాల్లో అయితే 10 రూపాయిలనీ ఈ సర్వే లెక్కలలో ఉన్నాయి. అంటే దినసరి పర్‌కాపిటా ఖర్చు గ్రామాల్లో అయితే 4 3 అణాలు పట్నాల్లో అయితే 5—6 అణాలూ అన్నమాట. శ్రీలోహియా ఆదాయాల విషయం మాట్లాడుతుంటే శ్రీ నందా వ్యయాన్ని గురించి మాట్లాడారు. ఈ లెక్కలను చూసినా కూడా ఇరువురి అంచనాలకీ మధ్య దినసరిగా 1 36 అణాలు గ్రామీణ ప్రాంతాల్లోను 2 3 అణాలు పట్న ప్రాంతాల్లోను తేడా ఉందన్నమాట.

భారత వాణిజ్య మండలుల సమాఖ్య కూడా ఆదాయాన్ని గూర్చి చేసిన అంచనాలు కేవలం వూహా జనితాలనీ, వ్యయానికి సంబంధించిన అంచనాలు మాత్రం నూటికి అన్ని పాళ్ళూ నిజమేనంటూ ప్రకటన చేసి పారేసింది. జనాభా పెరుగుదల, బళ్ళలో చదివే పిల్లలు, ఆస్పత్రులలో ఎన్ని పడకలున్నదీ అంకెలతో ఇస్తూ, ఈ సమాఖ్య "ఎక్కువ విలువైనవి, విలాసప్రాయమైన వస్తువుల వాడకం అంతగా పెరిగినట్లు కన్పడకపోవడం వల్ల, జనాభాలో అధిక సంఖ్యాకుల జీవన ప్రామాణ్యం బాగా అభివృద్ధియిందని తెలుస్తోంది" అని ప్రవచించింది

ఆదాయాన్ని గురించిన అంచనాలు కేవలం వూహా జనితాలా అన్నది ప్రొఫెసర్ మహలనోబిస్ సంఘంలాంటిదో విచారించాల్సిన విషయం. భారత సమాజంలో కొన్ని వర్గాల జనం తాము లోగడ నోచుకోని మంచి తిండిని ఇప్పుడు తింటున్నారనేది కాదనలేం. అంకెల సంగతలా ఉంచేద్దాం. దేశంలో దారిద్ర్యం ఇంకా పోలేదనేదే అసలు శ్రీ లోహియా ప్రసంగంలో ముఖ్యంగా గ్రహించాల్సిన విషయం

స్వతంత్రాధికారాలుగల నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఇకనామిక్స్ రిసర్చి సంస్థ మధ్యప్రదేశ్‌లోని ఆదిమజాతి ప్రజల సాంఘిక, ఆర్థిక, జీవనం అన్న విషయంపై నివేదిక సమర్పిస్తూ "ఆదిమ జాతి ప్రజల పర్‌కాపిటా ఆదాయం తూర్పు మండలంలో, ఆదాయం రు. 171, పశ్చిమ మండలంలో రు 162, దక్షిణ మండలంలో రు 134, ఈశాన్య మండలంలో రు. 112 మధ్య ప్రాంత మండలంలో రు. 104 లు. దినసరి 'పర్ కాపిటా' ఆదాయం బాగా ధనవంతమైన ప్రాంతంలో 50 న పై. మరీ హీనంగా వున్న ప్రాంతంలో 29 న. పై. ప్రతి మండలంలోనూ ఆదాయాల స్థాయిలలో హెచ్చు తగ్గులు కన్పిస్తూనే ఉన్నాయి ఒకే మండలంలోఉన్న తూర్పు బిలాసపూర్‌లో పర్‌కాపిటా దినసరి ఆదాయం 62 న. పై లైతే, అతి తక్కువ ప్రాంతమైన రాయ

భారీయెత్తున దేశరక్షణకు
ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి



ఉత్సాహానికి

హుషారుకు

కారణం'

రాగోవైన్



ఈ పుష్టికరమైన ఆహార పానీయమును
మీరుకూడా పుచ్చుకొని యెల్లప్పుడు
ఉత్సాహంగా వుండండి !!

ఫైన్ కెమికల్ వర్క్సు,
పి. బి. 71, మైసూరు-4



ఓం! తత్! సత్!

సుఖజీవిత సేవ

సద్వైద్య మహిమ

సద్దుం సాటిలేని కీర్తికి ఒక తార్కాణము

కే టి కృష్ణమూర్తి ఆచారిగారి

'మేల్ మాయిల్ మందు'

(Regd)

దీర్ఘకాల చర్మరోగములకు చక్కని నివారిణి

వల్లరంగు ఎర్రరంగు పొడలు దద్దులు పోట్లు గజ్జి (చర్మసంబంధము) పొడలు గల చోట్లలో తిమురు్ల సూదిలో పొడిచినప్పుడు నొప్పిలేకుండుట, నిప్పవడి బొబ్బలు గలిగినా తెలియకుండుట, దుర్నీరు సర్వఅవయములందు వ్యాపించి రక్తములో కలిసి మత్తు కలుగజేయుట (నరముల సంబంధము) చేతి వ్రేళ్ళు ముడుచుకొనుట బొబ్బలు లేచుట ముక్కు బంధనములు పాదమునందు వల్లవు పుండ్లు ఏర్పడుట కాలు చేతులు వ్రేళ్ళు తగ్గుట ముక్కు సొట్ట పడుట చూచుటకు విసుగుపుట్టించు రణములు (అస్థి సంబంధము) వీటికి చక్కని నివారిణి

1 మండలం (40 రోజులు) నూనె లేహ్యము రు 7/-
తపాల ఖర్చు రు 2/-

స్నానమునకు ఉత్తమమైన 8 ఔన్సుల శ్రీ పరమాత్మతైలం రు 2-50
తపాల ఖర్చు రు 1-50

— సిద్ధ డాక్టర్ —

కే టి. కృష్ణమూర్తి ఆచారి & సన్సు,

5/22 మేల్ మాయిల్ P O, (N A Dt)

హాదాలలో ఆనెలు

పాదాలలో ఆనెలు, కండలు పెరిగి, వ్రేళ్ళు పాతుకుపోయి పాదము నేలపై బెట్టలేక రాళ్ళు తగిలిన త్రుళ్ళి పడువారు పై పూతగా వాడి త్వరితో సహా మాయంచేయగల సంజీవి వెల పోస్టు ఖర్చులతో రు 4-25నపై

కొక్కోకము చిత్రపటముల గలది రు 1-50
దాంపత్య రహస్యములు రు 3-00
తెలుగు హిందీ స్వయంశిక్ష రు 4-50
పోస్టు ఖర్చులు ప్రత్యేకము

ప్రభ అండ్ కో

3, మలయపెరుమాళ్ వీధి మద్రాసు 1

నెలకు రు 300 సంపాదించండి

మీ తీరికవేళలలో లేక పూర్తి వ్యవధితో మా రకరకాల పొగాకు సామగ్రులకు పాన్-క-మసాల గోరి ఓం సువాసన మాత్రలకు మరియు యితర ప్రఖ్యాత కమ్మని పదార్థములకు ఆర్డర్లు సేకరించి నెలకు రు 300/-సంపాదించండి

ప్రతినిధులు లేని ప్రాంతాలలో జిలా వారీగా ఏజెంట్లు నియమింపబడుచున్నారు వ్యాపార షరతులకు సాంపిల్ సెటుకు వ్రాయండి

HARI OM & CO,
8/30 Arya Nagar Kanpur

నెలకు రు 300 సంపాదించండి
ఎలక్ట్రిక్ & రేడియో గైడ్

ఎలెక్ట్రిసిటీ లేక గ్రామాల్లోగాని నగరాల్లోగాని రు 25 కు మీరు స్వంత రేడియో తయారుచేయుటకు, రిపేరు చేయుటకు సహాయపడు 400 పటములుగల పూర్తి గైడ్ ఎలెక్ట్రికల్ మెకానిజం, రేడియో రిపేరింగ్ వయరింగ్ కూడ నేరుకొనవచ్చును ధర రు 8/8/- పటములుగల ట్రాన్సిస్టర్ రేడియో గైడ్ రు 4/- 100 పటములుగల వివాహ జీవితం రు 5/- ప్రతి పుస్తకమునకు పోస్టేజి రు 1-25 అదనం

ILFA BOOK DEPOT (APG)
Rafatganj Aligarh (U P)

తగ్గింపు ధరలకు అమ్మకం



ఆకర్షణీయమైన రంగులలో పిక్కలి అందమైన చేనేత చీరలు ఒక్కొక్కటి ధర రు 7/50 2 చీరలు రు 14 3 చీరలు రు 20 పోస్టేజి ప్యాకింగు ఉచితం

ఉత్తమ రకం చీరలు 1కి రు 14 2 చీరలు రు 25/-3 చీరలు రు 37/- పోస్టేజి ప్యాకింగ్ ఉచితం

బహుమతులు - 2 చీరలు

కొనువారికి ఒక జత ఇయర్ టాప్స్ 3 చీరలు కొనువారికి ఒక బ్లౌస్ ఒక జత ఇయర్ టాప్స్ కొద్ది స్టాకుగలదు మీ ఆర్డరును వెంటనే పంపండి మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి చీరలు నచ్చని యెడల ఎరియైన పరిస్థితిలో తిరిగి పంపిన ఖరీదు వాపసు చేయబడును

THE ROYAL STORES (APM6)
Post Box No 1774 Delhi 6.

న్యూఢిల్లీ లేఖ

ఫుర్, బెతూల్‌లలో 19 ఎ. మై. రాష్ట్రం మొత్తం మీద పోల్చి చూస్తే 'పర్ కాపిటా' దినసరి ఆదాయము 71 న.పై. అంటే ఆ ఆదిమజాతుల ప్రజలు ఎంత వెనుక బడి వుంది, వాళ్ళలో ఎక్కువవుతున్న ఆదాయం రాష్ట్రంమీద సగటుకు ఎంత తక్కువగా ఉన్నది నిరూపిస్తుంది'' అని పేర్కొంది. మరి మధ్యప్రదేశ్‌లోని ఈ జాతుల ప్రజలు ఒరిస్సా, భారతదేశంలో ఇంకా ఇతర ప్రాంతాల ప్రజల కన్న కాస్త మెరుగన్న మాట నిజం.

భారత వాణిజ్య మండలుల సమాఖ్య చేసిన ప్రకటన తర్వాత ఇక్కడో ప్రశ్న ఉత్పన్నమైంది. మనకున్న పది భారీ పరిశ్రమల్లో ఏ లెక్క ప్రకారం ఏది ఆధారంగా తీసుకుని, సగటు, పర్‌కాపిటా ఆదాయంను లెక్క వేసినట్లు? ఈ పరిశ్రమల్లో ఉత్పత్తి రేట్ ఎంతట? ఈ విషయం లోక్ సభలో చర్చకు వచ్చింది. ఇంకా వివరాలు ముఖ్యంగా సమాఖ్య చెప్పిన వాటిని గూర్చి వెలుతుర్లోకి వస్తే గాని అసలు సంగతి తెలియదు.

* * *

వ్యక్తి రంగంలో వివిధ ప్రదేశాల్లో ఎరువుల కర్మాగారాలు నెలకొల్పటానికి అనుమతులు లభించాయి. ఈ కర్మాగారాలను విశాఖపట్నం కొత్తగూడెం, మధ్యప్రదేశ్, హనుమాన్‌ఘర్, ట్యూటికోరిన్, మంగుళూర్, దుర్గాపూర్, గుజరాత్‌లలో నెలకొల్పుతారట.

వీటిలో కొత్తగూడెం, విశాఖపట్నం, గుజరాత్ రాష్ట్రం లలో ప్రారంభమయ్యే వాటి విషయంలో కొంత పని జరిగింది. హనుమాన్‌ఘర్ ట్యూటికోరిన్, మంగుళూర్‌లో నెలకొల్పాల్సిన సంస్థల యజమానులు ఇంకా తగిన వివరాలను తుది పరిశీలనకు పంపవేలేదు.

మధ్యప్రదేశ్‌కు చెందిన లైసన్సుదారు దానిని మోసే ఓపికలేక విరమించుకున్నాడు. ఇక దుర్గాపూర్‌లో కర్మాగారం విషయంలో ఆ సంస్థ లైసెన్సు దారుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, విదేశీ సహకారం, ముడి సామగ్రి, కటకటా వగైరా కారణాల వల్ల అనుకున్న విధంగా కర్మాగార స్థాపనం సాధ్యం గాదని తెలియపరిచింది. వ్యక్తి రంగాల వాళ్ళు వదిలేసిన పరిశ్రమలను ప్రభుత్వం చేపట్టి కొనసాగించే అవకాశం లేదని అంటున్నారు. అయినా, మధ్యప్రదేశ్‌కు సంబంధించిన ఎరువుల కర్మాగారం నిర్వహించే బాధ్యతను ఎరువుల ఉత్పత్తి సంస్థ ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు అప్పగించింది. బెంగాల్‌లోని ఎరువుల ఎద్దడిని తట్టుకునేందుకు వీలుగా ఒక ఎరువుల ఉత్పత్తి కర్మాగారాన్ని నెలకొల్పే విషయం కూడా ప్రభుత్వం ఆలోచిస్తోంది.

ఘోరక్‌పూర్‌లోని ఎరువు కర్మాగారానికయ్యే ద్రవ్య మారకపు ఖర్చుకు, జపాన్, భారత దేశానికిచ్చిన 'ఎన్ను'ల ఋణాలనుంచి పెట్టుబడిగా ఉపయోగించేందుకు ఉభయ ప్రభుత్వాలు అంగీకరించాయి. ఎరువు ఉత్పత్తుల విషయం చూస్తున్న ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా. దీన్ని పురస్కరించుకుని కర్మాగారానికి కావలసిన పరజాప ను సమకూర్చవలసిందిగా జపాన్‌లోని ఉత్పత్తిదారులను కోరింది

— శ్రీకృష్ణ ★



'అమరశిల్పి జక్కన్న' లో బి. సరోజాదేవి.

అవీ-ఇవీ-అన్నీ

11 వ పేజీ తరువాయి

శ్రీనిలయం పిక్చర్సు

శ్రీ నిలయం పిక్చర్స్ వారు ఇప్పటికి సుమారు అరురీళ్ళ చిత్రాన్ని పూర్తి చేశారు. ఈ చిత్ర నిర్మాత శ్రీ బి. యస్. రాయుడు ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే సమకూరుస్తున్నారు. అయిదు పాటలను, రెండు పద్యాలను రికార్డు చేశారు. ఘంటసాల, పిఠాపురం, మాధవ పెద్ది సత్యం, స్వర్ణలత పాడారు. పాటలను ఆరుద్ర, వ్రాస్తున్నారు. సంగీతం : నిత్యానంద్.

కాంతారావు, చలం, సి. యస్. ఆర్. సత్యన్నారాయణ, పేకేటి, అల్లురామలింగయ్య, బాలకృష్ణ, వాసంతి, సూర్యకళ, మీనాకుమారి, నిర్మల మొదలగువారు ఉన్నారు. డా. రాజారావు, నాగయ్య గార్లు గెస్టు ఆర్టిస్టులుగా నటిస్తున్నారు.

కథా నాయకిని క్రొత్త వారిని ఎన్నుకొని పరిచయం చేయాలని ప్రయత్నిస్తున్నట్లు పై సంస్థ వారు తెలియజేశారు.

ప్లేబాక్ జానకి యింట్లో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరపూజ

ప్లేబేక్ జానకి ఇంట్లో ఈ మధ్య తొమ్మిది రోజులు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర పూజ జరిగింది. తొమ్మిదవ రోజు ఉత్సవానికి సంగీత దర్శకులు ఘంటసాల, మాస్టర్ టి. చలపతిరావు, టి. వి. రాజు, పగ్గాలు నేపథ్యగాయకుడు పి. బి. శ్రీనివాస్ మొదలగువారు హాజరయ్యారు. ఆరోజు పాటకచేరీ జరిగింది.

"గుణశీలుని కథ"

తాజుద్దీన్ బాబా ప్రొడక్షన్సు అనే నూతన సంస్థ "గుణశీలుని కథ" అనే జానపద చిత్రానికి ఆగస్టు 29 వ తేదీని వాహినీ స్టూడియోలో ప్రారంభోత్సవం చేశారు. ప్రారంభోత్సవషూటింగ్ రోజున కథానాయకుని మందిరం సెట్టు వేశారు. షూటింగ్‌లో కాంతారావు, రేలంగి, సి. యస్. ఆర్. సీతారాం పాల్గొన్నారు.

వీరుగాక ఇంకా ఈ చిత్రంలో బాలయ్య, జ్ఞానలోచనరావు, కె.రఘునాథరావు(నూతన నటుడు) కృష్ణకుమారి, గిరిజ, యల్. విజయలక్ష్మి మొదలగువారు నటిస్తున్నారు.

ఈ చిత్రానికి మాటలు : కొండేపూడి, సంగీతం: యస్. రాజేశ్వరరావు, ఛాయ: కె. యస్. ప్రసాద్, కళ: తోట, కూర్పు: తంగవేలు, దర్శకత్వం: తాపీ చాణక్య, నిర్మాతలు: కె. శ్రీరాం అండ్ మోపి శ్రీహరి.

మీర్జాపూర్ రాజా భార్యావియోగం

శోభనాచల స్టూడియో అధినేత శ్రీ మీర్జాపూర్ రాజా గారిభార్య, ప్రస్తుతము వీనస్ స్టూడియో అధినేత శ్రీ మురళీ రాజాగారి తల్లి అయిన శ్రీమతి భూదేవి 18—8—63వ తేదీ రాత్రి స్వర్గస్థులయ్యారు. పుర ప్రముఖులు, అధికార, అనధికారులనేకులు మంది అంత్య క్రియలకు హాజరయ్యారు. **పి. ధర్మారావు.** ★



నటి సుజాత. (ప్రభాకర్)



'మంచిరోజులు వస్తాయి'లో జమున, జగ్గయ్య.

రాజధాని కబుర్లు

9వ పేజీ తరువాయి

ఈ అవకాశం వలన నూతన చైతన్యం కలగచ్చు. నిరాశతో, నిస్పృహతో, కార్యక్రమాలని నిలుపు చేసినవారు ఈ సదవకాశం ఉపయోగించుకుని, మిగతా లోపాల్ని కూడా సవరించుకోవటానికి ప్రయత్నాలు జరపవచ్చు.

ఆదర్శ కళాసమితి ప్రారంభోత్సవ సందర్భంలో గోరాశాస్త్రిగారు ప్రసంగిస్తూ, సాంఘిక నాటక రచన బాగా జరగటం లేదన్నారు. ఉత్తమ సాహిత్య విలువలు తీర్చి దిద్దే, బలమైన రసస్ఫూర్తి గల, సాంఘిక నాటకం కనక ప్రదర్శిస్తే ప్రజాదరణ తప్పక లభ్యమవుతుందని అన్నారు. అయితే యిలాంటి నాటక రచన ఒకరు పూనుకుంటే వచ్చేది కాదేమో! దానంతటది, ఏదో కాలానికి, ఓ రచయిత ఆధారంగా వెలువడుతుందనే విశ్వాసం అందరికీ ఉండచ్చు. అయితే ఈలోగా ఆ స్థాయికి అందుకోవటానికి చెయ్యాలసిన కృషి కావలసినంత ఉంది. ఇలాటి బాధ్యత చాలవున్న రచయితలమీదా వుంది. నటనాశక్తివున్న నటీ నట వర్గంమీదా వుంది. వీరిద్దరిమధ్య సమన్వయం, సంఘీభావం ఏర్పడాలి. ఎవరైనా ఔత్సాహిక నాటక బృందాలు మంచి నాటకాలు కావాలండీ అంటూనే ఉంటారు. అయితే వాళ్లకు ఓ షరతుంది. స్త్రీలు ఉండకూడదుట! ఇది వారిని నిందించటంకాదు. నటీమణులు ముందుకు రాకపోవటమే కారణం కావచ్చు. అయితే వారు ముందుకు రాకపోవటానికి గల కారణా లేమిటో కూడా పరిశీలించాలసి వుంది. తెలుగు పడుచులు నటనా రంగంలో ఆసక్తి చూపించకపోతే, మహారాష్ట్ర మహిళలు ముందుకు రావటానికి సిద్ధంగా ఉన్నారని, ఇక్కడ స్థానిక మహారాష్ట్ర సాహితీపరుడు అనటే అన్నాడు. మరి దీని భావ మేమిటో! ఏమైనా మంచి వాతావరణం సృష్టించి, నాటకరంగం పవిత్రం చెయ్యటానికి అందరూ పూనుకుంటేనే, ఉత్తమ నాటక సృష్టి, ప్రదర్శనలు సాధ్యమవుతాయి.

— ఐ. ఎల్. ఎస్. ★

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 &7 Thambuchetty Street Madras-1. Chief Editor S. Sambhu Prasad.